www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆరబెట్టిన ధాన్యంపై అకాల వర్షం


ముథోల్‌లో తడిసిన పంటను చూపుతున్న రైతు

- నిర్మల్ జిల్లాలో తడిసిన సోయా, మక్కలు
- ఖమ్మం జిల్లాలో పలు చోట్ల ఓ మోస్తరు వాన
- సాగర్ 20 గేట్లు, శ్రీశైలం 6 గేట్ల ఎత్తివేత
- ఇరు ప్రాజెక్టులకు 2 లక్షల క్యూసెక్కుల వరద
- రేపు బంగాళాఖాతంలో వాయుగుండం
- ఎల్లుండి తుపానుగా మారే అవకాశం

3

సోమవారం | 21-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 204

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 2.30 తదుపరి షష్ఠి; నక్షత్రం: రోహిణి ఉ. 6.50, మృగశిర తె. 5.51 వరకు వర్జ్యం: మ. 12.12-1.44; దుర్ముహూర్తం: మ. 12.22-1.08, మ. 2.41-3.27; అమృతఘడియలు: రా. 9.24-10.56; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 5.45

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న గ్రూప్ 1 అభ్యర్థులు

జీవో 29 రద్దు చేసి..
మెయిన్స్ నిర్వహించాలి
- ఎవరో చెప్పిన మాటలు విని మా భవిష్యత్తు నాశనం చేయవద్దు
- సీఎంకు గ్రూప్-1 అభ్యర్థుల విజ్ఞప్తి.. ప్రెస్‌మీట్ అడ్డుకున్న పోలీసులు

14

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు

- ఈ నెల 27వ తేదీ వరకు వరుసగా పరీక్షలు
- 31,383 మంది అభ్యర్థులు, 46 పరీక్షా కేంద్రాలు
- కేంద్రానికి కనీసం అరగంట ముందు వెళ్లాలి
- అభ్యర్థులు అన్ని పరీక్షలూ రాయాల్సిందే
- పటిష్ఠ బందోబస్తు.. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు

జీవో 29ని రద్దు చేయండి
- దాని వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర నష్టం
- గ్రూప్-1 పరీక్షను రీ షెడ్యూల్ చేయాలి
- సీఎంకు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ

మెయిన్స్‌ను వాయిదా వేయకపోతే రాష్ట్రాన్ని దిగ్బంధిస్తాం: ఆర్. కృష్ణయ్య

జీవో 29తో అన్యాయం జరగదు.. బీసీ బిడ్డగా నేను భరోసా ఇస్తున్నా: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27 వరకు కొనసాగనున్నాయి. మొదటి రోజు ఇంగ్లిష్ (క్వాలిఫై టెస్ట్) పరీక్ష, తర్వాత వరుసగా సబ్జెక్టు పరీక్షలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. ఒకపక్క ఈ పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ పరిస్థితి ఏర్పడింది. ఈ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. 46 పరీక్షా

మిగతా 14వ పేజీలో...

జీవో 29పై వివాదం అందుకే!
- మెయిన్స్‌కు మెరిట్‌ను గంపగుత్తగా అమలు చేయడంపై అభ్యంతరం!
- అన్యాయం జరుగుతోందంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు.. జీవో 29 రద్దుకు డిమాండ్
- జీవో 55 సరైనదన్న విశ్లేషణలు

14


గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ఆవరణలో మొక్క నాటిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ధైర్యం ఉంటేనే ఎదుగుతాం

గొప్ప పనులు చేయాలంటే రిస్క్ తీసుకోవాలి

- త్యాగానికి సిద్ధపడితే ఏదైనా సాధించవచ్చు
- ట్రిలియన్ డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- న్యూయార్క్, లండన్, టోక్యోతో హైదరాబాద్ పోటీ పడాలి
- ఎక్కడికి వెళ్లినా ఏ హోదాలో ఉన్నా.. రెండేళ్లు తెలంగాణకు కేటాయించండి
- కార్పొరేట్ స్థాయి జీతం ఇవ్వలేకపోవచ్చు గొప్ప అవకాశాలు మాత్రం కల్పిస్తాం
- ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్

13

రాయ'బేరం'!

దిక్కుతోచక దిగొచ్చిన జగన్.. షర్మిలతో చర్చలు

- ఆస్తుల పంపకంపై బెంగళూరులో రాజీ
- దాదాపుగా కుదిరిన ఒప్పందం
- కాంగ్రెస్‌తో దోస్తీ కోసమే ఈ ఎత్తుగడ




ఎన్నికల్లో ఘోర పరాజయం.. తర్వాతి పరిణామాలతో జగన్‌కు దిమ్మ తిరిగి బొమ్మ కనపడింది. దెబ్బకు వాస్తవంలోకి దిగొచ్చారు. రాజకీయ భవిష్యత్తు ఉండాలంటే 4 మెట్లు దిగక తప్పదని గ్రహించారు. మరో దిక్కు కానరాక చెల్లి షర్మిలతో రాయ'బేరానికి' సిద్ధమయ్యారు. ఇన్నాళ్లూ ససేమిరా అంటూ వచ్చిన ఆస్తుల పంపిణీకి అంగీకరించారు. ఎందుకిలా? తెర వెనుక అసలు ఏం జరిగింది? 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇన్నాళ్లూ సొంత చెల్లి షర్మిలను నానా రకాలుగా వేధించిన వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ దెబ్బకు దిగొచ్చారు. ఆమెతో రాయ'బేరానికి' దిగారు. ఆస్తిలో వాటాలు పంచేందుకు అంగీకరించారు. వాస్తవానికి తన ఆస్తిలో కుమార్తె షర్మిలకు సమాన వాటా ఉండాలని వైఎస్ రాజశేఖరరెడ్డి పలుమార్లు చెబుతుండేవారు. కానీ ఆయన మరణానంతరం ఆమెకు వాటా ఇచ్చేందుకు జగన్ ససేమిరా అన్నారు. అంతేకాకుండా ఆమెను పలు రకాలుగా వేధించారు. ఇంటి నుంచి దాదాపు వెలివేశారు. ఇది సరికాదని వైఎస్ కుటుంబానికి సన్నిహితులైన చాలా మంది చెప్పి చూసినా జగన్ ఖాతరు చేయలేదు. తండ్రి వైఎస్ ఇచ్చిన మాటను నెరవేర్చాలని ఆయనకు ఎంతగా నచ్చజెప్పినా.. ఆస్తుల పంపిణీకి ససేమిరా అన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ కోసం తీవ్రంగా శ్రమించిన షర్మిల.. జగన్ అసలు స్వరూపం అర్థమయ్యాక పోరాటం తప్ప మరో మార్గం లేదని గ్రహించారు. హక్కుల కోసం ఆమె ఒకరకంగా భారీ ధర్మ యుద్ధమే చేశారు. అలుపెరుగని రీతిలో ఆమె చేసిన పోరాటం ఇప్పుడు ఫలితాలనిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

ఏపీలో అడుగుతో..

షర్మిల రాజకీయ రంగ ప్రవేశాన్ని జగన్ మొదట్లో అంతగా పట్టించుకోలేదు. ఆమె తెలంగాణకు పరిమితం కావడంతో తనకు వచ్చిన నష్టం ఏమీ లేదన్నట్లు ఉండిపోయారు. తన మొండి వైఖరిని కొనసాగించారు. కానీ మొన్నటి ఎన్నికలకు ముందు ఆమె ఏపీ రాజకీయాల్లో అడుగుపెట్టడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఏకంగా రాష్ట్ర పీసీసీ పగ్గాలు చేపట్టి జగన్‌పై పదునైన విమర్శలతో

మిగతా 12వ పేజీలో...

జీవో 317పై నివేదిక



- మంత్రి దామోదర ఆధ్వర్యంలో రూపొందించిన మంత్రివర్గ ఉపసంఘం.. ముఖ్యమంత్రికి అందజేత
- స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ కేసులకు గ్రీన్ సిగ్నల్?
- 26న జరిగే మంత్రిమండలి భేటీలో నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్త జోన్లకు అనుగుణంగా ఉద్యోగాలు, ఉద్యోగుల సర్దుబాటుకు సంబంధించిన జీవో నంబరు 317పై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ప్రభుత్వానికి తన నివేదిక సమర్పించింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలోని ఈ కమిటీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం కలిసి నివేదికను సీల్డు కవర్‌లో అందజేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత జీవో నంబరు 317లోని సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 26న మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించింది. మంత్రి దామోదర అధ్యక్షతన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ.. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారు, మేధావులతో చర్చలు జరిపింది. అలాగే, ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ విధానాల ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభ్యంతరాలు, వినతులు స్వీకరించింది. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న మంత్రివర్గ ఉపసంఘం తన నివేదికలో ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. ముఖ్యంగా స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ గ్రౌండ్ కేసులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వారం పది రోజుల్లో ఈ తరహా కేసులను వారివారి స్థానాలకు బదిలీ చేసే అవకాశాలున్నాయి. అలాగే, కొన్ని మండలాలు జిల్లాల పరిధి మారడంతో తలెత్తిన లోకల్, నాన్ లోకల్ సమస్యపై ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాలని క్యాబినెట్‌సబ్ కమిటీ సూచించినట్లు సమాచారం. వచ్చే శనివారం(26వ తేదీ) మంత్రిమండలి సమావేశంలో ఈ నివేదికపై చర్చించి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

జీవో నంబరు 317 నేపథ్యం...

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పది జిల్లాలను 33 జిల్లాలుగా చేసింది. ఆయా జిల్లాల్లో పాలనా వ్యవహారాల కోసం వర్క్ టూ ఆర్డర్ కింద ఉద్యోగులను కేటాయించినా.. శాశ్వత కేటాయింపులు చేయలేదు. 2018 ఎన్నికలకు

మిగతా 13వ పేజీలో...

ప్రైవేటు ఆస్పత్రుల 'ఛీ'టింగ్!

రిజిస్టర్డ్ వైద్యులు, అనుమతులు లేకుండానే వైద్యం



- కనీస ప్రమాణాలూ కరువు.. ప్రజారోగ్యంతో చెలగాటం
- అగ్నిమాపక నిబంధనలను పట్టించుకోని నిర్లక్ష్యం
- అల్లోపతి వైద్యం చేసేస్తున్న ఆయుష్ వైద్యులు
- టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకొచ్చిన వాస్తవాలు
- హైదరాబాద్‌లో 10 శాతం ఆస్పత్రులకు నోటీసులు
- సిద్దిపేట జిల్లాలో 35 దవాఖానాలకు జరిమానా
- నిబంధనలు పాటించని 97 ఆస్పత్రుల మూసివేత

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారా? అయితే, జర జాగ్రత్త.. మీరు వెళ్లే ఆస్పత్రిలో అర్హులైన వైద్యులున్నారో లేదో తెలుసుకుని వెళ్లండి! అక్కడ పరీక్షలు చేసే ల్యాబ్‌లో నిజంగా నిపుణులున్నారో లేదో వాకబు చేయండి. అసలు ఆ ఆస్పత్రిలు కనీస ప్రమాణాలు పాటిస్తున్నాయో లేదో ఆరా తీశాకే వెళ్లండి. లేకుంటే ఉన్న జబ్బుకు తోడు కొత్త రోగాలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎందుకంటే.. రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. రిజిస్టర్డ్ వైద్యులు లేకుండానే రోగులకు వైద్యం చేసేస్తున్నాయి. కనీస ప్రమాణాలను పాటించకుండా.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నాయి. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై సర్కారు దృష్టి సారించింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా.. ప్రైవేటు ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఫాలో అవుతున్నాయో లేదో పర్యవేక్షించేందుకు వైద్య శాఖ ఈ ఏడాది జూన్‌లో ఏడు టాస్క్‌ఫోర్స్ కమిటీలను వేసింది. కొద్ది రోజులుగా ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేయగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కమిటీలు వైద్య, ఆరోగ్య శాఖకు అందించిన నివేదిక ప్రకారం.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న 97 ప్రైవేటు ఆస్పత్రులకు అధికారులు తాళాలు వేశారు. 1,094 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులిచ్చారు. 327 ఆస్పత్రులకు రూ.39,76,900 మేర జరిమానాలు



మిగతా 12వ పేజీలో...

అనుమతులుంటే.. కూల్చం!



సీఎం ఆదేశాలను అమలు చేస్తాం

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటన
- ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో స్పష్టత
- అనుమతుల్లేని వాటినే కూల్చామని వెల్లడి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలకు సంబంధించిన సంస్థల నుంచి అనుమతి(చెల్లుబాటయ్యే అనుమతి) తీసుకొని చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అన్ని రకాల అనుమతులు పొంది నిర్మించిన నిర్మాణాలకు కూల్చివేతల భయం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలపై హైడ్రా కమిషనర్ స్పష్టతనిచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉందని ఆదివారం ఓ ప్రకటన చేశారు. చెరువుల పక్కనున్న నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుందని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతుండడంతో కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటిదాకా హైడ్రా కూల్చేసిన నిర్మాణాలన్నీ అనుమతులు లేకుండా నిర్మించినవేనని చెప్పారు. దుండిగల్, మల్లంపేట, అమీన్‌పూర్‌లో అనుమతులు ఇచ్చిన అనంతరం అవి ప్రభుత్వ స్థలాలని తెలిసి వాటిని రద్దు చేశారని, కానీ డెవలపర్లు నిర్మాణాలు చేపట్టి విక్రయించడంతో కూల్చివేశామని వివరించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ప్రజలు నివసిస్తోన్న భవనాల జోలికి వెళ్లమని గతంలోనే చెప్పామని గుర్తు చేశారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో చెల్లుబాటయ్యే అనుమతులతో నిర్మిస్తోన్న భవనాలను ఇక నుంచి కూల్చేది లేదని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా చేపడుతోన్న నిర్మాణాల విషయంలో మాత్రం చట్ట ప్రకారం వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు ప్రభుత్వ విభాగాలు ఇకపై అనుమతులివ్వకుండా చూస్తామని, కొత్త నిర్మాణాలు రాకుండా నిఘా పెడతామని తెలిపారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ జరుగుతోందని, సమగ్ర వివరాల సేకరణ అనంతరం తదుపరి చర్యలుంటాయని రంగనాథ్ చెప్పారు. కాగా, చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో హైడ్రా కూల్చివేసిన భవనాల్లో అధిక భాగం డెవలపర్లు

మిగతా 13వ పేజీలో...

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు
- ఒక్కరోజే 24 విమానాలకు హెచ్చరికలు
- అన్నీ ఒట్టివేనని తనిఖీల్లో వెల్లడి
- వారంలో 90కిపైగా విమానాలకు..
- గంటలపాటు సర్వీసుల ఆలస్యం.. ప్రయాణికులకు ఇబ్బందులు

2

ఢిల్లీ సీఆర్పీఎఫ్ స్కూల్ వద్ద పేలుడు
- ప్రహరీ గోడ ధ్వంసం.. దెబ్బతిన్న చుట్టుపక్కల భవనాల కిటికీలు, కార్ల అద్దాలు
- 2 కిలోమీటర్ల వరకు వినిపించిన శబ్దం
- 'క్రూడ్ బాంబు'గా పోలీసుల అనుమానం

2

రోడ్ల మరమ్మతులకు నిధులు!



- నియోజకవర్గానికి రూ.30-40 కోట్లు
- మొత్తం రూ.3,570-4,760 కోట్లు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అంచనాలు
- పంచాయతీరాజ్ పరిధిలో రోడ్ల మరమ్మతులకు 1,377 కోట్లు
- దశల వారీగా విడుదలకు కసరత్తు
- కేంద్రం సాయం కోరే అవకాశం

3

కశ్మీర్‌లో ఉగ్రదాడి
వైద్యుడు, ఐదుగురు వలస కార్మికుల మృతి

2

యుద్ధానికి సిద్ధం కండి
తైవాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సైన్యానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం

3

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

- ఒక్కరోజే 24 విమానాలకు హెచ్చరికలు
- వారం రోజుల్లో 90కిపైగా విమానాలకు



న్యూఢిల్లీ, అక్టోబరు 20: విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతోంది. ఆదివారం దాదాపు 24 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. వీటిలో ఇండిగో, విస్తారా, ఆకాశ ఎయిర్, ఎయిరిండియా మొదలైన కంపెనీలకు చెందిన దేశీయ, అంతర్జాతీయ సర్వీసులున్నాయి. వీటితో కలిపి గత వారం రోజుల్లో మొత్తం 90కిపైగా విమానాలకు బెదిరింపులు వచ్చాయి. ఇవన్నీ కూడా ఒట్టివేనని తేలింది. తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకరమైన వస్తువులు కనిపించలేదు. అయితే, గమ్యస్థానానికి వెళ్లకుండా మార్గమధ్యంలోనే విమానాలను దింపివేయటం, తనిఖీలు చేపట్టటం కారణంగా సర్వీసులు పలు గంటల పాటు ఆలస్యమయ్యాయి. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈ బెదిరింపుల పర్వం మొదలుకావటంతో.. వీటి వెనుక ఏదైనా రాజకీయ కుట్ర ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ, ఉత్తరాది రాష్ట్రాల్లో వందలాది స్కూళ్లకు ఇదే తరహాలో బాంబు బెదిరింపులు వచ్చాయి.

ఢిల్లీ సీఆర్పీఎఫ్ స్కూల్ వద్ద పేలుడు



పేలుడు జరిగిన స్థలంలో తనిఖీలు

న్యూఢిల్లీ, అక్టోబరు 20: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం కలకలం రేగింది. ప్రశాంత్ విహార్ సీఆర్పీఎఫ్ పాఠశాల ప్రహరీ గోడ వద్ద ఉదయం 7.50 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు కానీ పేలుడు ధాటికి ఆ గోడ దెబ్బతినడంతో పాటు సమీపంలో ఉన్న కార్లు, భవనాల కిటికీలు పగిలిపోయాయి. చెవులు చిల్లులు పడేలా వచ్చిన శబ్దం దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. ఢిల్లీ పోలీసులతో పాటు ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది, బాంబు స్క్వాడ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఇంకా అక్కడేమైనా పేలుడు పదార్థాలు ఉన్నాయేమో తనిఖీ చేయడానికి రోబోలను వినియోగించారు. ఫోరెన్సిక్ నిపుణులు అక్కడ తెల్లని పౌడర్ లాంటి పదార్థాన్ని గుర్తించి.. దాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. పేలుడుకు 'క్రూడ్ బాంబు' కారణమని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

లోకం తీరు



కశ్మీర్‌లో ఉగ్రదాడి

వైద్యుడు, ఐదుగురు వలస కార్మికుల కాల్చివేత

శ్రీనగర్, అక్టోబరు 20: జమ్మూ-కశ్మీర్‌లో ఆదివారం సాయంత్రం ఉగ్రవాదులు మళ్లీ తెగబడ్డారు. గందేర్‌బల్ జిల్లాలోని గగన్‌గిర్ వద్ద ఓ ప్రయివేటు కంపెనీ సిబ్బంది ఉంటున్న స్థావరం కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఓ వైద్యుడుతో పాటు, అయిదుగురు వలస కార్మికులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన ఈ కార్మికులు గగన్‌గీర్ నుంచి సోనామార్గ్ వరకు చేపడుతున్న జడ్-మోర్త్ సొరంగం పనుల్లో పాల్గొంటున్నారు. శుక్రవారమే సోఫియాన్ జిల్లాలో బిహార్‌కు చెందిన వలస కార్మికుడిని కూడా ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఏప్రిల్ నెలలోనూ అనంత్‌నాగ్ జిల్లాలో పని చేస్తున్న ఓ వలస కార్మికుడిని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఇందుకు తమదే బాధ్యత అని లష్కర్ ఎ తోయిబా ప్రకటించుకొంది. స్థానికేతర కార్మికులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. ఈ దాడి అమానుషమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

తండ్రి అప్పు కట్టలేదని కుమార్తెపై అత్యాచారం

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర తాలూకాలో అమానుష ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి రుణం చెల్లించలేదని అతని మైనర్ కుమార్తెపై వడ్డీ వ్యాపారి అత్యాచారానికి ఒడిగట్టాడు. మాదనాయకనహళ్లిలో ఆదివారం ఈ దారుణ ఘటన జరిగింది. దీనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని వెంటనే అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు రవికుమార్ (39) వద్ద బాలిక తండ్రి రూ.70 వేలు అప్పు తీసుకుని రూ.30 వేలు తిరిగి చెల్లించాడు. రూ.40 వేలు అసలుతోపాటు వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం వసూలు చేసుకునేందుకు తరచూ రవికుమార్ అతని ఇంటికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో వెళ్లి అప్పు చెల్లించాలని బాలికను బెదిరించాడు. అనంతరం అత్యాచారానికి పాల్పడ్డాడు.

మంత్రి దినేశ్ గుండూరావు క్షమాపణలు చెప్పాలి

- నోటీసులు పంపిన సావర్కర్ముని మనవడు

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక దామోదర్ సావర్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ కర్ణాటక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావుకు సావర్కర్ ముని మనవడు సాత్యకి సావర్కర్ నోటీసులు పంపారు. ఇటీవల గాంధీ జయంతి రోజున బెంగళూరులో ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సావర్కర్ గోవధకు వ్యతిరేకం కాదని, ఆయన గొడ్డుమాంసం తినేవారని వ్యాఖ్యానించారు. సావర్కర్‌ను మహ్మద్ అలి జిన్నాతో పోల్చారు. దీంతో సాత్యకి సావర్కర్ నోటీసులు పంపారు. అందులో 15 రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్టు తెలిసింది.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఇదో ఉద్యమంలా సాగాలి.. అప్పుడే అవినీతి అంతం.. పరివార్‌వాదంతో దేశానికి ముప్పు: మోదీ

వారాణసిలో శంకర నేత్రాలయం ప్రారంభం

- ఎన్డీఏ అంటే.. 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్': శంకరాచార్య



వారాణసిలో ఆర్‌జే శంకర నేత్ర వైద్యశాల ప్రారంభోత్సవంలో కంచి కామకోటి శంకరాచార్య విజయేంద్ర సరస్వతి, ప్రధాని మోదీ

వారాణసి, అక్టోబరు 20: దేశంలో కుటుంబ వారసత్వ రాజకీయాలు ఉండడం మంచిది కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందువల్ల రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. 'రాజకీయ వంశాలు' దేశ యువతకు నష్టం కలిగించాయని విమర్శించారు. ఆదివారం వారాణసిలో కంచిపీఠం నెలకొల్పిన ఆర్‌జే శంకర నేత్ర వైద్యశాలను ప్రారంభించడంతో పాటు, రూ.6,700 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "పరివార్‌వాదులతో దేశానికి పెద్ద ముప్పు ఉంది. యువతకు అవకాశాలు ఇవ్వడంలో వారికి నమ్మకం లేదు. అందువల్లనే రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన లక్ష మంది యువత రాజకీయాల్లో పాల్గొనాలని ఎర్రకోట నుంచి పిలుపునిచ్చాను. దేశ రాజకీయాలను మార్చేందుకు, అవినీతిని, పరివార్‌వాద సిద్ధాంతాన్ని నిర్మూలించేందుకు దీన్ని ఉద్యమంలా చేపట్టాలి" అని అన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆశ్రిత పక్షపాతాన్ని పోషిస్తున్నాయని విమర్శించారు. గతంలో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు పత్రికల్లో పతాక శీర్షికలుగా ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో కంచి కామకోటి పీఠం శంకరాచార్య జగద్గురు విజయేంద్ర సరస్వతి స్వామి ప్రసంగిస్తూ ప్రధాని మోదీ, ఎన్డీఏలను దేవుడు అనుగ్రహించాడని అన్నారు. ఎన్డీఏ అంటే 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్' (నరేంద్ర దామోదర్ దాస్ పరిపాలన) అని అభివర్ణించారు. తొలుత సంస్కృతంలో ప్రసంగాన్ని ప్రారంభించిన శంకరాచార్య మోదీ ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అందరి సంక్షేమానికి కృషి చేస్తూ ప్రపంచంలోనే ఆదర్శ ప్రభుత్వంగా ఉంటోందని చెప్పారు. ఇటీవలి కశ్మీర్ ఎన్నికల ఫలితాలను కూడా ప్రశంసించారు. తనకు ప్రధాని మోదీతో చిరకాలంగా అనుబంధం ఉందని చెప్పారు. కోయంబత్తూరులో తొలుత నేత్ర వైద్యశాలను ప్రారంభించామని, ఇది 17వదని చెప్పారు. ప్రధాని మోదీ తన నియోజకవర్గమైన వారాణసిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆగ్రా, బగ్‌డోగ్రా, రేవా, అంబికాపూర్, సార్‌సావా విమానాశ్రయాల పనులకు కూడా శంకుస్థాపనలు చేశారు.

మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా విడుదల

ముంబై, అక్టోబరు 20: నవంబరు 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన ఈ జాబితాలో 99 మంది పేర్లు ఉన్నాయి. ఇందులో 71 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలే. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 సీట్లు ఉండగా... బీజేపీ 151 సీట్లకు పోటీ చేయనుంది. మిగిలిన సీట్లకు బీజేపీ మిత్రపక్షాలు శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ వర్గం పోటీ చేయనున్నాయి. బరిలో దిగనున్న ప్రముఖుల్లో ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, స్పీకర్ రాహుల్ నర్వేకర్ తదితరులున్నారు. బీజేపీ తొలి జాబితాలో 13 మంది మహిళలకు సీటు దక్కింది. అలాగే షెడ్యూల్ తెగలకు చెందినవారికి ఆరు, షెడ్యూలు కులాలకు నాలుగు సీట్లు కేటాయించారు.

రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సగటున 474 మంది దుర్మరణం

న్యూఢిల్లీ, అక్టోబరు 20: దేశవ్యాప్తంగా రహదారులు నెత్తురోడుతున్నాయి. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. గత ఏడాదిలో రోడ్డు ప్రమాదాల వల్ల 1.7 లక్షలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి వివరాలను సమర్పించాయి. ఈ లెక్కన రోజుకు సగటున 474 మంది లేదా ప్రతి మూడు నిమిషాలకు దాదాపుగా ఒకరు మృత్యువాత పడినట్టు చెప్పవచ్చు. ప్రమాదాల వెనుక కారణాలు, సమస్యలను మదింపు చేయడానికి జాతీయ స్థాయిలో కేంద్రం రోడ్డు ప్రమాదాల గణాంకాలను క్రోడీకరించడం మొదలు పెట్టినప్పటి నుంచి గత ఏడాదిలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాద మరణాలు సంభవించాయి. ఇక రోడ్డు ప్రమాదాల కారణంగా గాయాలపాలవుతున్న వారి సంఖ్యా పెరుగుతోంది. గత ఏడాదిలో దాదాపు 4.63 లక్షల మంది గాయాలపాలయ్యారు. 2022 సంవత్సరంతో పోల్చితే ఇది 4 శాతంకన్నా ఎక్కువ. కాగా రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం గత ఏడాదిలో రోడ్డు ప్రమాదాల మూలంగా జరిగిన మరణాలు 1.6 లక్షలకు పైనే ఉన్నాయి.

రష్యాకు ఉత్తర కొరియా సైనిక సహకారం!

ధ్రువీకరించిన దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్

న్యూఢిల్లీ, అక్టోబరు 20: ఉక్రెయిన్‌తో యుద్ధంలో పోరాడేందుకు రష్యాకు కిమ్ నేతృత్వంలోని ఉత్తర కొరియా సైనిక సహకారం అందిస్తోందా? అంటే.. దక్షిణ కొరియా అవుననే అంటోంది. రష్యాకు మద్దతుగా 12 వేల మంది సైనికులను పంపించాలని ఆ దేశం భావిస్తోందని, దీనికోసం 1,500 మంది సైనికులు తూర్పు రష్యాలో శిక్షణ తీసుకుంటున్నారని దక్షిణ కొరియా నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎన్ఐఎస్) ధ్రువీకరించింది. ఉక్రెయిన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ విడుదల చేసిన వీడియోలో రష్యా తూర్పు ప్రాంతంలోని ఓ శిక్షణ మైదానంలో ఉత్తర కొరియా సైనికులు యూనిఫాం, ఆయుధాలు అందుకుంటున్నట్టు కనిపించారు. మరో వీడియోలో రష్యా-చైనా సరిహద్దుకు సమీపంలో ఉన్న సెర్గీవ్‌కా శిక్షణ మైదానానికి కూడా కొంతమంది సైనికులు చేరుకోవడం కనిపించింది. రష్యాలోని వ్లాదివోస్తోక్, ఖబరోవ్స్క్ సహ వివిధ సైనిక స్థావరాల్లో ఉత్తర కొరియా దళాలు శిక్షణ పొందుతున్నాయని ఎన్ఐఎస్ నివేదించింది. ఆయా ప్రదేశాల్లో ఉత్తర కొరియా దళాల ఉనికిని ధ్రువీకరించే చిత్రాలు, వీడియోలను విడుదల చేసింది. అలాగే ఉత్తర కొరియా నుంచి సైనికులను రవాణా చేస్తున్న రష్యా నౌకలను కూడా ఎన్ఐఎస్ గుర్తించింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఉత్తర కొరియా 13వేల షిప్పింగ్ కంటైనర్లలో రష్యాకు సైనిక సామగ్రిని పంపించిందని ఎన్ఐఎస్ తెలిపింది. రష్యాకు 10 వేల మందికిపైగా సైనికులను పంపేందుకు ఉత్తర కొరియా సిద్ధంగా ఉన్నట్లు తమ ఇంటెలిజెన్స్ వద్ద సమాచారం ఉందని జెలెన్‌స్కీ చెప్పారు. కాగా, దక్షిణ కొరియాకు చెందిన మిలటరీ డ్రోన్‌ను తమ భూభాగంలో గుర్తించామని, మరోసారి ఇలా జరిగితే యుద్ధం తప్పదని కిమ్ జోంగ్ హెచ్చరించారు.

గర్జించలేదు రష్యా..

ఉక్రెయిన్‌తో యుద్ధంలో లక్షలాది సైనికులను కోల్పోయిన పుతిన్

- యుద్ధం మొదలై 31 నెలలు దాటినా.. లొంగని ఉక్రెయిన్
- నాటో దేశాల అండ, టెక్నాలజీ సాయంతో రష్యాపై పోరు
- రష్యా భూభాగాన్ని సైతం ఆక్రమించుకున్న జెలెన్‌స్కీ సైన్యం
- నల్లసముద్రంలో పుతిన్ మోహరించిన యుద్ధనౌకల ధ్వంసం

బైబిల్ కథల్లో డేవిడ్ అండ్ గోలియత్ కథ చాలా మందికి తెలిసే ఉంటుంది! అత్యంత శక్తిమంతుడైన గోలియత్‌ను బాలుడైన డేవిడ్.. మట్టికరిపిస్తాడు! గోలియత్‌ను కొట్టడానికి డేవిడ్ దగ్గర పెద్దగా శస్త్రాస్త్రాలేమీ ఉండవు. కేవలం తన దగ్గరున్న ఒడిసెల(స్లింగ్)తో కొట్టి విజయం సాధిస్తాడు! అది కథ కావచ్చు. కానీ, ఇప్పుడు అలాంటిదే.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ రూపంలో మన కళ్ల ముందు జరుగుతోంది. అత్యంత బలమైన సైనిక శక్తుల్లో ఒకటైన రష్యాను.. చిరుదేశమైన ఉక్రెయిన్ దీటుగా ఎదుర్కొంటోంది! రెండున్నరేళ్లకు పైబడి సాగుతున్న ఈ యుద్ధంలో.. రష్యా లక్షలాది మంది సైనికులను కోల్పోయింది! అంతేకాదు.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి తన భూభాగాన్ని సైతం కోల్పోయింది.

- సెంట్రల్ డెస్క్







ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలై దాదాపు 30 నెలలు గడుస్తోంది! భౌగోళికంగా ప్రపంచంలోనే అతి పెద్ద దేశం (1,71,25,191 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం.. 16 దేశాలతో సరిహద్దులను కలిగి ఉంది).. 11.5 లక్షల సైనిక బలం, అణ్వాయుధాలు ఉన్న దేశం.. వచ్చి మీదపడిపోతే ఉక్రెయిన్ లాంటి చిట్టి దేశం ఎన్నాళ్లు పోరాడగలదని మొదట్లో చాలా మంది భావించారు! కానీ.. అలా అనుకున్నవారందరి అంచనాలూ తారుమారయ్యాయి! తనపై ముప్పేట దాడికి దిగిన అంత పెద్ద దేశాన్నీ ఉక్రెయిన్ ముప్పతిప్పలు పెట్టి మూడు సముద్రాల నీళ్లు తాగిస్తోంది. నాటో దేశాల సహకారంతో దెబ్బతీస్తోంది! అత్యుత్సాహంతో, ఆత్మవిశ్వాసంతో ఈ యుద్ధాన్ని మొదలుపెట్టిన రష్యా.. తానే ఎక్కువ నష్టాలను చవిచూస్తోంది. యుద్ధం మొదలైన తొలినాళ్లలో ఉన్న జోరు ఇప్పుడు లేదు. మూణ్నాలుగు రోజుల క్రితం ఉక్రెయిన్‌కు చెందిన 110 డ్రోన్లను నేలకూల్చినట్టు రష్యా ప్రకటించిందిగానీ.. తనకున్న పరిమిత వనరులతో వ్యూహాత్మకంగా పోరాడుతున్న జెలెన్‌స్కీ సైన్యందే పై చేయిగా ఉందనడంలో సందేహం లేదు. 2022 ఫిబ్రవరిలో మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటిదాకా.. రష్యా సైనికులు 2 లక్షల మంది ప్రాణాలు కోల్పోగా 4 లక్షల మంది తీవ్రంగా గాయపడినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. అంటే చనిపోయినవారు, గాయపడ్డవారు అంతా కలిపి 6 లక్షల మందికిపైగా సైన్యాన్ని రష్యా కోల్పోయినట్టు లెక్క! ఈ నేపథ్యంలోనే.. పుతిన్ ఈ ఏడాది మేలో రక్షణ మంత్రి సెర్గి షోయిగును పదవి నుంచి తొలగించారు! కోల్పోయిన సైనికుల స్థానంలో కొత్తవారిని తీసుకునేందుకు.. రష్యా ఆర్మీ నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. స్వచ్ఛందంగా సైన్యంలో చేరాలంటూ ప్రజలకు పిలుపునిస్తోంది. దేశమంతటా ఎక్కడపడితే అక్కడ.. సైనిక నియామకాలకు సంబంధించి 'సమాచార కేంద్రాల'ను ఏర్పాటు చేస్తోంది. రష్యాలో సైన్యంలో కాంట్రాక్ట్ పద్ధతిలో చేరాలనుకునేవారికి ఏడాదికి 30 లక్షల రూబుళ్ల నుంచి 53 లక్షల రూబుళ్ల (రూ.27 లక్షల నుంచి రూ.48 లక్షల) దాకా వన్‌టైమ్ చెల్లింపు చేస్తామని.. నెలవారీ జీతంగా ఇచ్చే 7 లక్షల రూబుళ్లకు ఇది అదనమని ప్రకటనలు చేస్తోంది. అంతకుముందు నెలవారీ వేతనం సగటున 63,060 రూబుళ్లుగా ఉండేది. అంతేనా.. 'రిఫర్ ఏ ఫ్రెండ్' ఆఫర్ కూడా నడుస్తోందక్కడ. అంటే, ఇప్పటికే సైన్యంలో చేరినవారు మరొకరిని చేరిస్తే.. వారికి బోనస్‌గా మరికొంత సొమ్ము ముట్టజెప్తున్నారు. మెట్రో స్టేషన్ల ముందు మొబైల్ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి మరీ యువతను సైన్యంలోకి తీసుకుంటున్నారు. అలాగే.. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న నేరగాళ్లను, అండర్ ట్రయల్ ఖైదీలను సైతం సైన్యంలో చేర్చుకోవడానికి వీలుగా రష్యా చట్టసభ సభ్యులు ఒక బిల్లును ఆమోదించారు. యుద్ధంలో సాహసోపేతంగా పోరాడి పతకాలు సంపాదిస్తే.. వారిపైనున్న నేర రికార్డులను తొలగిస్తామని హామీ ఇచ్చారు.



ఉక్రెయిన్ సైన్యం

భారతీయులనూ మోసం చేసి..

సైనికుల కొరత నేపథ్యంలో.. విదేశీ యువకులను సైతం సైన్యంలో చేర్చుకోవడానికి రష్యా వెనుకాడట్లేదు. దీంతో కొందరు ఏజెంట్లు... 'రష్యాలో హెల్పర్, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలు.. నెలకు రూ.లక్షన్నర జీతం' అంటూ మోసపూరిత ప్రకటనలతో పలువురు భారతీయులను కూడా అక్కడికి తరలించిన సంగతి తెలిసిందే! అలా వెళ్లినవారిలో మన తెలుగు వారు కూడా ఉన్నారు! తొలుతవారికి తుపాకులు కాల్చడంలో శిక్షణ ఇచ్చి.. రోజుకు 15 గంటలు పనిచేయించుకునేవారు. వారు తమ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి గోడు వినిపిస్తే.. ప్రధాని మోదీ రష్యాకు వెళ్లినప్పుడు వారిని తిరిగి భారత్‌కు పంపించాలని కోరారు. దీంతో అక్కడి సైన్యం తొలి విడతగా 45 మంది భారతీయులను యుద్ధభూమి నుంచి వెనక్కి రప్పించి, భారత్‌కు పంపింది. మరో 40-50 మంది దాకా మనవాళ్లు ఇంకా అక్కడే ఉన్నారు.

రష్యా నష్టాలపై ఉక్రెయిన్ లెక్కలివీ..

యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటిదాకా రష్యా కోల్పోయిన సైనికులు, యుద్ధ ట్యాంకులు, యుద్ధనౌకలు, విమానాల సంఖ్యకు సంబంధించి 2024 అక్టోబరు 20న 'జనరల్ స్టాఫ్ ఆఫ్ ఉక్రెయిన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్' ఒక ప్రకటన చేశారు. దాని ప్రకారం..

6,78,520	రష్యా కోల్పోయిన సైనికులు
9,047	యుద్ధట్యాంకులు
18,111	ఆర్మర్డ్ ఫైటింగ్ వెహికల్స్
26,987	వెహికల్స్ అండ్ ఫ్యూయెల్ ట్యాంక్స్
19,565	ఆర్టిలరీ సిస్టమ్స్
1,232	మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్స్
978	ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్
369	విమానాలు
329	హెలికాప్టర్లు
17,287	డ్రోన్లు
28	యుద్ధనౌకలు, ఓడలు
1	జలాంతర్గామి

భూభాగాన్నీ కోల్పోయి..

యుద్ధం మొదలైన తొలినాళ్లలో తన భూభాగంలోకి వచ్చిన రష్యన్ సేనలను వ్యూహాత్మకంగా నిర్వీర్యం చేసిన ఉక్రెయిన్.. ఈ ఏడాది ఆగస్టు 6 నుంచి రష్యా భూభాగాలను ఆక్రమించడం ప్రారంభించింది. 'ఆపరేషన్ వైట్ ట్రయాంగిల్' పేరుతో.. ఇప్పటిదాకా 1500 చదరపు కిలోమీటర్లకు పైగా రష్యన్ భూభాగాన్ని ఉక్రెయిన్ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. ఇంత భారీగా రష్యా భూభాగం విదేశీ ఆక్రమణకు గురికావడం ఇదే మొదటిసారి. ఇదిలా ఉండగానే.. ఉక్రెయిన్ చేతికి నాటో దేశాల నుంచి ఎఫ్16 యుద్ధ విమానాలు అందడం మొదలైంది. నిజానికి.. ఉక్రెయిన్‌కు ఎఫ్-16లు ఇస్తే అది ప్రపంచయుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని అమెరికా, యూరప్ దేశాలు తొలుత కొంత సంశయించాయి. కానీ.. రష్యా ప్రస్తుత పరిస్థితిని బట్టి ఆ అవకాశం లేదని గ్రహించి ఇప్పుడు ఇవ్వడం మొదలుపెట్టాయి. రష్యావాటిని ఎంతవరకూ ఎదుర్కోగలదు? వాటికెలా ప్రతిస్పందిస్తుంది? అనే విషయాలను గమనించాక, తాను కూడా ఉక్రెయిన్‌కు ఎఫ్-16లు ఇవ్వాలని అమెరికా భావిస్తున్నట్టు సమాచారం. అమెరికా దగ్గర వాడని పాత ఎఫ్-16లు 700 నుంచి 900 దాకా ఉన్నాయి. వాటితోపాటు.. ఏఐతో పనిచేసే ఎఫ్-16లను కూడా ఉక్రెయిన్‌లో దించే ఆలోచనలో అమెరికా ఉన్నట్టు సమాచారం. ఇవి రిమోట్‌తో పనిచేస్తాయి. వాటిని ప్రత్యక్ష యుద్ధంలో పరీక్షించాలని అమెరికా భావిస్తోందని.. అందుకే ఉక్రెయిన్‌కు ఇచ్చే చాన్స్ ఉందని రక్షణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అవి రంగంలోకి దిగితే.. కథే మారిపోతుంది!!



బయటపడలేక.. లోపల ఉండలేక..

బాస్ఫరస్ జలసంధిని టర్కీ మూసేయడంతో నల్లసముద్రంలో ఇరుక్కుపోయిన రష్యా నౌకలు



రష్యా 'బ్లాక్ సీ ఫ్లీట్' పేరొందిన నౌకాదళంలో.. ఫ్రిగేట్లు, కార్వెట్లు, క్షిపణి ఓడలు, మైన్‌స్వీపర్లు ఇలా అన్నీ కలిపి 50 దాకా సర్ఫేస్ వార్‌షిప్పులు ఉంటాయి. వాటితోపాటు.. ల్యాండింగ్ షిప్స్, ఆయిలర్స్, టగ్స్, సర్వే, ఇంటెలిజెన్స్, ఆక్సిలరీ నౌకలు, ఆరు జలాంతర్గాములు ఉంటాయి. వాటన్నింటిలో కలిపి 25 వేల మంది దాకా సిబ్బంది పని చేస్తుంటారు. అంతటి అమేయశక్తినీ ఉక్రెయిన్ తన డ్రోన్, క్షిపణి దాడులతో వెనక్కి తగ్గేలా చేయగలిగింది. రష్యాకు చెందిన పలు పెద్ద నౌకలను ధ్వంసం చేసేసింది. మరి అంత నష్టం జరగకముందే రష్యా తన నౌకలను అక్కడి నుంచి వేరొకచోటకు ఎందుకు తరలించలేకపోయిందంటే.. దానికి కారణం టర్కీ. ప్రపంచపటాన్ని ఒకసారి పరిశీలిస్తే.. రష్యా, ఉక్రెయిన్, టర్కీ, బల్గేరియా, రొమేనియా, జార్జియా, మాల్డోవా దేశాల నడుమ ఒక బెలూన్ ఆకారంలో 'నల్ల సముద్రం' కనిపిస్తుంది. రష్యా నౌకలు మధ్యధరా సముద్రం గుండి ఇతర దేశాలతో వాణిజ్యసంబంధాలు నెరపాలంటే.. టర్కీ అధీనంలో ఉన్న బాస్ఫరస్, డార్డనెల్లెస్ జల సంధుల గుండానే జరపాల్సి ఉంటుంది. అసలు నల్ల సముద్రం నుంచి రష్యా నౌకలు బయటకు రావాలంటే ఆ జలసంధి గుండానే రావాలి. అంతటి కీలక జలసంధులను.. జెలెన్ స్కీ విజ్ఞప్తి మేరకు టర్కీ మూసేయడంతో రష్యాకు దెబ్బ పడింది.

నిప్పులు కక్కే డ్రాగన్ డ్రోన్లు

తమ దేశం మీద దండయాత్ర చేసిన రష్యాను నిలువరించడానికి ఉక్రెయిన్ ప్రధానంగా వాడుతున్నది.. డ్రోన్ టెక్నాలజీనే! యుద్ధం తొలి దశల్లో రష్యన్ యుద్ధ ట్యాంకులను పేల్చేయడానికి డ్రోన్లనే వాడింది. ఆ తర్వాత కూడా.. రకరకాల డ్రోన్లను వినియోగించింది. తాజాగా.. 'డ్రాగన్ డ్రోన్'లతో రష్యాకు దడ పుట్టిస్తోంది. చైనీస్ పురాణాల్లో ఉండే డ్రాగన్‌ల లాగా.. నిప్పులు కక్కే డ్రోన్లు ఇవి. యుద్ధరంగంలో శత్రువుల మీద, శత్రు భూభాగంలో.. 2,200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండే థెర్మైట్‌ను (అల్యూమినియం పొడి, ఐరన్ ఆక్సైడ్‌ల మిశ్రమం) స్ప్రే చేస్తూ ముందుకు సాగిపోతాయి! ఆ డ్రోన్లు నిప్పులు కక్కిన దారిలో జీవం అంటూ ఏదీ మిగలదు! కన్నుమూసి తెరిచేలోపు అక్కడంతా కరిగిపోతుంది!! రైల్వే ట్రాకుల వెల్డింగ్ కోసం జర్మన్ కెమిస్ట్ ఒకరు 1890ల్లో ఈ థెర్మైట్‌ను అభివృద్ధి చేశారు. కానీ, జర్మనీ దీన్ని మొదటి ప్రపంచయుద్ధంలో బ్రిటన్‌పై దాడికి ఉపయోగించింది. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ, దాని మిత్ర దేశాలు వినియోగించాయి. ఇప్పుడు అదే థెర్మైట్‌ను ఉక్రెయిన్ డ్రోన్ల ద్వారా వినియోగిస్తోంది.

కులగణన పూర్తయ్యే వరకు బీసీలూ.. అప్రమత్తం

» రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష, బీసీ నేతలు

» బీసీలు రాజకీయ అధికారం సాధించుకునేందుకు కులగణన ఏకైక పరిష్కారం : వీహెచ్



సమావేశంలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, మధుసూదనాచారి, బండ ప్రకాష్, జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన పూర్తయ్యే వరకు బీసీలంతా అప్రమత్తంగా ఉండాలని పలు పార్టీల నేతలు, బీసీ నేతలు అన్నారు. తెలంగాణలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని చేస్తున్న పోరాటం విజయ వంతమైందని పేర్కొన్నారు. సమష్టి పోరాటం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో18 విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో "సమగ్ర కులగణనకు మద్దతుగా అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం" సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హను మంతరావు మాట్లాడుతూ కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందని, ఇప్పటికే కులగణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో అధిక శాతమున్న బీసీలు రాజకీయ అధికారం సాధించుకోవడానికి కులగణన ఏకైక పరిష్కారమార్గమన్నారు. శాసనమండలిలో విపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ కులగణన పూర్తయ్యే వరకు బీసీ సమాజం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. జనాభా లెక్కల తరహాలో కాకుండా స్పష్టంగా కులగణన జరగాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కులగణనపై బీసీ నేతలు చేస్తున్న న్యాయపోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు జరపాలని, ప్రభుత్వం ఏసాకులు చూపకుండా కులగణనను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో సమగ్ర కులగణన చేపట్టాలని గత ఆరు నెలలుగా ప్రజాస్వామ్యబద్ధంగా బీసీలు చేసిన పోరాటమే ఈ విజయమన్నారు. ప్రభుత్వం జీవో 18 విడుదల చేయడంతో రాష్ట్రంలో కులగణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

గుట్టపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్ చిత్రీకరణ

» కుటుంబసభ్యులతో రీల్స్... ఎక్స్‌లో పోస్ట్!

» ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు



ఆలయ ప్రాకార మండపంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దంపతులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఇలవేల్పుగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రీల్స్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి భార్య శాలిని పుట్టినరోజును పురస్కరించుకుని కుమార్తె శ్రీనికతో కలిసి చేసిన రీల్స్ వీడియో, ఫొటోలు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేయడంతో విషయం వెలుగుచూసింది. అవి ఈ నెల 7వ తేదీన ఆయన స్వామివారి దర్శనార్థం యాదగిరిగుట్టకు వచ్చిన సందర్భంగా ఆలయ ఆవరణలో తీసిన ఫొటోలేనని, అవి తీయడం సంప్రదాయానికి విరుద్ధమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రీల్స్ చేసేందుకు ఆలయ సందర్శనకు వచ్చారని, భక్తుల సంచారం లేనిచోట వీడియో, ఫొటోలు తీయడం ఇందుకు నిదర్శనమని అంటున్నారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి ప్లాన్లు లీక్

పెంటగాన్ నుంచి కీలక పత్రాలు బయటకు

టెల్ అవీవ్, అక్టోబరు 20: ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడికి ప్రణాళికలు బహిర్గతమయ్యాయి. పెంటగాన్ నుంచి రెండు కీలక పత్రాలు బయటకు వచ్చాయి. అక్టోబర్ 1న ఇరాన్ 200 క్షిపణులతో దాడి చేశాక ఇజ్రాయెల్ ప్రతిదాడికి పెద్ద ఎత్తున సన్నద్ధమౌతున్నట్లు ఈ పత్రాల్లో ఉంది. ఇజ్రాయెల్ బలగాల సన్నద్ధతపై అమెరికా గూఢచార ఉపగ్రహాల సాయంతో నేషనల్ జియోస్పాటికల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రూపొందించిన కీలక పత్రాలను ఇరాన్ అనుకూల టెలిగ్రామ్ ఛానళ్లలో పోస్ట్ చేశారు. దీనికి సంబంధించి న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. దీంతో అమెరికా ప్రభుత్వం కీలక పత్రాల లీకేజీ ఎలా జరిగిందనే విషయంపై ఉమ్మడి దర్యాప్తునకు ఆదేశించింది. గాజాపై ఇజ్రాయెల్ తాజా వైమానిక దాడుల్లో 87 మంది చనిపోయారు.

యుద్ధానికి సిద్ధం కండి: జిన్‌పింగ్

బీజింగ్, అక్టోబరు 20: తైవాన్- చైనా మధ్య మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ సైన్యానికి ఆదేశాలు ఇచ్చారని చైనా మీడియా సంస్థలు కథనాలు వెలువరించాయి. గురువారం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్‌కు చెందిన బ్రిగేడ్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నాయి. ఈనెల 14న తైవాన్ చుట్టూ చైనా యుద్ధ విమానాలు, డ్రోన్‌లు, యుద్ధ నౌకలు వంటి వాటిని మోహరించింది.

భారత్‌కు తిరిగి వెళ్లిపోండి!

» కెనడాలో భారత సంతతి వ్యక్తిపై విద్వేష వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 20: కెనడాలో నివసించే భారతీయులపై విద్వేష నేరాలు పెరిగిపోతున్నాయని భారత సంతతికి చెందిన కెనడా పౌరుడు అశ్విన్ అన్నామలై ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి 'ఎక్స్'లో ఆయన ఒక వీడియోను షేర్ చేశారు. అందులో అశ్విన్‌ను భారతీయుడిగా భావించిన ఒక మహిళ జాత్యాహంకార వ్యాఖ్యలు చేసింది. ఈ అనుభవం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు!

నియోజకవర్గానికి రూ.30-40 కోట్లు.. మొత్తం రూ.3,570-4,760 కోట్లు

» రోడ్లు, భవనాల శాఖ అంచనాలు

» పంచాయతీరాజ్ పరిధిలో రోడ్ల మరమ్మతులకు రూ.1,377 కోట్లు

» దశల వారీగా విడుదల చేసే ఛాన్స్

» ఆయా పనులకు త్వరలో టెండర్లు



హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రహదారుల మరమ్మతులు, అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ, ప్రధానమైన రహదారులన్నీ పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖల పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మతులకు నిధులు ఏ మేరకు అవసరం అన్నదానిపై అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయని, వాటి రిపేర్లకు నిధులను మంజూరు చేయాలంటూ పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల మంత్రులకు లేఖల రూపంలో విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే మరమ్మతులకు అవసరమైన నిధులను అంచనా వేసి, పనులు ప్రారంభించే దిశగా ఇరు శాఖలు చర్యలు ప్రారంభించాయి. ఇందులో భాగంగా ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,320 కి.మీ.ల మేర 641 చోట్ల రహదారులకు మరమ్మతులు చేయాల్సి ఉందని, రూ.1,375 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ నిధులను నియోజకవర్గాలవారీగా పలు దఫాలుగా మంజూరు చేసే అవకాశం ఉంది. త్వరలోనే ఆయా పనులకు టెండర్లను ఆహ్వానించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆర్ అండ్ బీ శాఖ కూడా నియోజకవర్గాల వారీగా రోడ్ల మరమ్మతులకు ప్రాథమికంగా ఎన్ని నిధులు అవసరమవుతాయనే అంచనాలను సిద్ధం చేసింది. దాని ప్రకారం రాష్ట్రంలోని ఒక్కో నియోజకవర్గానికి రూ.30-40 కోట్ల చొప్పున 119 అసెంబ్లీ సెగ్మెంట్లకు రూ.3,570-4,760 కోట్ల నిధులు అవసరమవుతాయని తేల్చినట్టు సమాచారం. ఆర్ అండ్ బీ పరిధిలో రహదారులకు చేపట్టాల్సిన మరమ్మతులు, కొత్త రోడ్ల ప్రతిపాదనలకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏ నియోజకవర్గంలో ఎన్ని రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉందన్న జాబితాలను సిద్ధం చేస్తున్నారు. తొలుత అత్యవసరమైన రోడ్లకు నిధులను మంజూరు చేయాలని, అనంతరం మిగిలిన నియోజకవర్గాల్లోని రోడ్ల రిపేర్లకు నిధులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. నిధుల సర్దుబాటు పూర్తికాగానే పనుల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు.

గతేడాది పనులతోనే ఇప్పుడు భారం

గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు కొంతకాలం ముందు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,888.34 కోట్లతో రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలకు మరమ్మతులు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించి, అందుకు సంబంధించి నిధులను కూడా ఆర్ అండ్ బీకి మంజూరు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో ఆ పనులు జరగలేదు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న రోడ్ల మరమ్మతుల పనులు ప్రస్తుత ప్రభుత్వానికి భారంగా మారాయని ఆర్ అండ్ బీలో చర్చ జరుగుతోంది.

వర్షాలతో 2,555 కి.మీ.ల రహదారులకు నష్టం

రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కలిపి ఆర్ అండ్ బీ పరిధిలో దాదాపు 2,555 కి.మీ.ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. వీటిలో కొన్నింటికి మరమ్మతులు చేపట్టగా కొన్ని నియోజకవర్గాల్లో పనులు నిర్వహించలేదు. ఆ నియోజకవర్గాలను గుర్తించి, వాటికి నిధులను మంజూరు చేయటంపై కసరత్తు జరుగుతోంది. రాష్ట్రంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.2,500 కోట్ల నిధులు అవసరమవుతాయని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన నివేదికలో పేర్కొంది. ఆ మేరకు కేంద్రం సహాయాన్ని కూడా కోరే అవకాశం ఉంది.

ఆరబెట్టిన ధాన్యంపై.. అకాల వర్షం

నిర్మల్ జిల్లాలో తడిసిన సోయా, మక్కలు.. ఖమ్మం జిల్లాలో పలు చోట్ల మోస్తరు వాన

» సాగర్ 20, శ్రీశైలం 6 గేట్ల ఎత్తివేత

» ఇరు చోట్ల 2లక్షల క్యూసెక్కుల వరద

» రేపు బంగాళాఖాతంలో వాయుగుండం

» ఎల్లుండికి తుపానుగా మారే అవకాశం



ముథోల్‌లో తడిసిన సోయా పంటను చూపుతున్న రైతు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): అకాల వర్షం అన్నదాతలను నిండా ముంచింది. నిర్మల్ జిల్లాలో శనివారం రాత్రి కురిసిన వాన దెబ్బకు పలు మండలాల్లో రైతులు ఆరబెట్టిన పంటలు తడిసి ముద్దయ్యాయి. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని ముథోల్ మండలంతో పాటు చించాల, ఆష్ట, బోరిగాం, ఎడ్‌బిడ్, వెంకటాపూర్, తరోడా, భైంసా మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన సోయా, మొక్కజొన్న, వడ్లు తడిసిపోయాయి. కోతకు వచ్చిన వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలో ఆదివారం సాయంత్రం పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. మధిరలో అత్యధికంగా 2.98సెం.మీ.. పెనుబల్లి, కల్లూరు, చింతకాని మండలం నాగులవంచ, ఎర్రుపాలెం, బోనకల్ మండలం రావినూతల, పెనుబల్లి మండలం గౌరారంలో 1 సెం.మీ. పైగా వర్షం కురిసింది. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో పొలంలో పిడుగుపాటుకు రైతు మడుపల్లి నాగేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. కాగా, బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది మంగళవారం నాటికి వాయుగుండంగా, బుధవారం తుపాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

నిండు కుండలా సాగర్, శ్రీశైలం..

కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరద వస్తోంది. శ్రీశైలానికి ఆదివారం 1.95 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో 6 గేట్లను ఎత్తి 1.67 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 66వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 211 టీఎంసీల నీరుంది. జూరాల ప్రాజెక్టుకు 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 23 గేట్లు ఎత్తి 94,553 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 33,814 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 2,28,175క్యూసెక్కుల వరద వస్తోంది. 20 గేట్ల ద్వారా 2,02,404 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,45,943 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 310 టీఎంసీల నీరు ఉంది.



ప్రతాప్ సింగ్, కళావతి, చేనేత కార్మికుడు సంపత్ (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

» సిరిసిల్లలో నేతకార్మికుడి బలవన్మరణం

ఝురాసంగం, సిరిసిల్ల క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం, కుటుంబకలహాలతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా ఝురాసంగంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. భార్యాభర్తలైన బొందిలి ప్రతాప్ సింగ్(60) కళావతి(50)... కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం ముందు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా వ్యాపారం సరిగా నడవకపోవడంతో ఇద్దరికి తరుచు గొడవలు జరుగుతుండేవి. కుటుంబసభ్యులు, బంధువులు వారికి సర్దిచెప్పుండేవారు. ఆదివారం మరోసారి గొడవ జరగడం...మరోవైపు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబపోషణ భారంగా మారడంతో మనస్తాపానికి గురై గ్రామంలోని తమ పొలం వద్ద పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. మరో ఘటనలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌కు చెందిన ఆడెపు సంపత్ (60) అనే చేనేత కార్మికుడు ఉపాధి లేక ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో సంక్షోభం కారణంగా నాలుగు నెలలుగా పని లేకుండా పోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రోజురోజుకు కుటుంబం గడవడం కష్టమవుతోందని మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు.

తిరుమలలో వైసీపీ ఎమ్మెల్సీ దందా

» 9 వీఐపీ బ్రేక్ టికెట్లు రూ.1.5 లక్షలకు విక్రయం

» శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



జకియా ఖానం

తిరుమల/రాయచోటి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ తిరుమల వీఐపీ బ్రేక్ టికెట్లను రూ.1.5 లక్షలకు విక్రయించిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన సాయికుమార్ తనతోపాటు 9 మందికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కావాలని చంద్రశేఖర్ అనే దళారీని సంప్రదించారు. ఈ క్రమంలో చంద్రశేఖర్.. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం పీఆర్వో కృష్ణతేజ ద్వారా 9 వీఐపీ బ్రేక్ టికెట్లు, వేదాశీర్వచనంతో కలిపి రూ.1.5 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే 9మందికి ప్రొటోకాల్ దర్శనాలు చేయించేందుకు ఎమ్మెల్సీ జకియా ఖానం వారితో కలిసి ఈ నెల 19న ఉదయం దర్శనానికి వచ్చారు. క్యూలైన్‌లో డిక్లరేషన్‌పై సంతకం చేసి దర్శనానికి వెళ్లారు. ఈక్రమంలో అధికంగా డబ్బులు తీసుకున్నారని గ్రహించిన సాయికుమార్.. చంద్రశేఖర్, కృష్ణతేజపై టీటీడీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ స్వయంగా దళారీలతో చేతులు కలిపి టికెట్లు విక్రయించినట్టు విచారణలో తేలింది. విజిలెన్స్ అధికారుల నివేదికతో పోలీసులు కేసు నమోదు చేసి ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా కృష్ణతేజను చేర్చారు. కాగా, ఎమ్మెల్సీ గతంలోనూ ఇదే విధంగా తనకు పరిచయం లేని వ్యక్తులను దర్శనాలకు తీసుకొచ్చినట్టు విజిలెన్స్ విచారణలో గుర్తించినట్టు సమాచారం. కాగా, ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని జకియా ఖానం తెలిపారు. తనకు ప్రస్తుతం పీఆర్వోలు లేరని, తన వ్యక్తిగత సహాయకుడే వ్యవహారాలను చూసుకుంటున్నట్టు వెల్లడించారు. తనపై ఈ ఆరోపణలు, కేసు నమోదు వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తంచేశారు.

సోమవారం 21 అక్టోబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'యోధ' ఆవిష్కరణ

హస్మిత ప్రచురణలు, హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరం, తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయ భండారు సంపాదకత్వంలో 'యోధ – మాతృత్వం: భిన్న వ్యక్తీకరణలు' పుస్తకావిష్కరణ సభ అక్టోబర్ 22 మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత ఓల్గా; ఆవిష్కర్త కె. శ్రీనివాస్; ముఖ్య అతిథి కొలకలూరి ఆశాజ్యోతి; గౌరవ అతిథులు సంధ్య, మామిడి హరికృష్ణ; పుస్తక పరిచయం గోపరాజు సుధ, అపర్ణ తోట, ఘంటశాల నిర్మల, రచన.

గిరిజ పైడిమర్రి

కవి సంధ్య స్వర్ణోత్సవం

'కవి సంధ్య' కవిత్వ పత్రిక 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 27 ఉ.10 గంటలకు యానాం గీతా భవన్‌లో స్వర్ణోత్సవ సభ జరుగుతుంది. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ; వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాలు; పదిమందికి సంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం; శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ; కవి సమ్మేళనం ఉంటాయి. సభలో మల్లాడి కృష్ణారావు, దీర్ఘాశి విజయ్ భాస్కర్, సి. మృణాళిని, వీరలక్ష్మీదేవి, ఆర్. సీతారాం తదితరులు పాల్గొంటారు.

కవి సంధ్య

రొట్టమాకురేవు కవిత్వ అవార్డు

రొట్టమాకురేవు కవిత్వ అవార్డు – 2024 సభ అక్టోబర్ 27 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత ప్రసేన్; ముఖ్య అతిథి కె. శివారెడ్డి; వక్తలు లక్ష్మీనరసయ్య గుంటూరు, పేర్ల రాము. షేక్ మహమ్మద్ మియా స్మారక అవార్డును ఏనుగు నరసింహారెడ్డి ('నీడలదృశ్యం'); పురిటిపాటి రామిరెడ్డి స్మారక అవార్డును అరుణ నారదభట్ల ('లోపలి ముసురు'); కె.ఎల్. నర్సింహారావు స్మారక అవార్డును తండా హరీష్ గౌడ్ ('గాలిలేని చోట'), సాంబమూర్తి లండ ('నాలుగురెక్కల పిట్ట') అందుకుంటారు.

యాకూబ్

'నానీ కిరణాలు' ఆవిష్కరణ

కంచనపల్లి రవికాంత్ కవితా సంపుటి 'నానీ కిరణాలు' ఆవిష్కరణ సభ అక్టోబర్ 27 ఉ.10గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి, ఆవిష్కర్త ఎన్. గోపి; అధ్యక్షులు ఎస్. రఘు; విశిష్ట అతిథి సూర్యా ధనంజయ్; గౌరవ అతిథి జి. శ్యాంప్రసాద్ లాల్; ఆత్మీయ వాక్యాలు తగుళ్ల గోపాల్, తండ హరీష్ గౌడ్.

బోధి ఫౌండేషన్

శ్రమ వెలిగించిన అక్షరం

రోజుకి పద్దెనిమిది గంటలు వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తూ శక్తిని హోటల్ పనికే ధారపోసిన ఆ భావుకుడు, పుట్టిన తర్వాత సరైన తిండీ, గుడ్డా ఎరగనని రాసుకున్నాడు. స్వతంత్రం వచ్చాక ఇలాగ ఉండదని ఆశించానని వాపోయాడు. కాఫీలు, బీడీలతోనే బతికిన శారద చిట్టచివరి వరకూ తన శక్తినీ, రక్తాన్నీ తెలుగు సాహిత్యం కోసమే ధారపోశాడు. ఇంతా చేసి అతడు బతికింది ముప్పై సంవత్సరాలు మాత్రమే.



తెలుగు సాహిత్యంలో చెరగని మహోన్నత చరిత్ర శారద. సరిగ్గా వంద సంవత్సరాల క్రితం తెలీని తేదీన తమిళనాడులోని పుదుకోట్టైలో పుట్టిన ఎస్. నటరాజన్ 88 ఏళ్ళ క్రితం 1937లో ఒక చలికాలం ఉదయం కడుపు చేత పట్టుకుని తెనాలిలో కాలుమోపాడు. అప్పటికే ఆంధ్రా ప్యారిస్‌గా ప్రసిద్ధి చెందిన తెనాలి శారదకి కూడా హోటల్ పనివాడిగా ఓ దారి చూపింది. ఆసక్తితో తెలుగు నేర్చుకున్నాడు. అనురక్తితో అభ్యుదయ సాహిత్యం చదువుకున్నాడు. అలా ఎందరో మిత్రుల్ని అక్కున చేర్చుకున్నాడు. స్వశక్తితో కలం పట్టి సగటు మనిషి పక్షం చేరాడు. ప్రజాపక్ష రచయితగా వందకి పైబడి కథలు, పదుల సంఖ్యలో నవలలు రాశాడు శారద అనబడే ఎస్. నటరాజన్.

తమిళనాడు ప్రభావంతో తెనాలిలో అప్పుడప్పుడే వెలుస్తున్న కాఫీ హోటెళ్ళలో పనివాడిగా మొదలుపెట్టి అనేక అవతారాలు ఎత్తాడు. సర్వర్‌గా, వంట పనివాడిగా ప్రారంభించి ప్రెస్ వర్కర్‌గా పత్రికలు, పుస్తకాలు అమ్మడం; గారెల దుకాణం; మజ్జిగ వ్యాపారం వరకూ ఎన్నో పనులు చేసాడు. అంతేనా, 'ప్రజావాణి' పత్రిక నుంచి 'చంద్రిక' పత్రిక స్థాపన దాకా పాత్రికేయుడిగా సాహితీ ద్రష్టగా రూపొందాడు. అల్లూరి సీతారామరాజు, కన్నెగంటి హనుమంతుల జీవిత ఆదర్శాలతో ఏకంగా సినిమాలు తీయాలని తపించాడు. మొట్ట మొదటి హోటల్ వర్కర్ల సంఘం ఆదీకాక చలం, కుటుంబరావు తదితర అభ్యుదయ రచయితల పుస్తకాలనీ చదివాడు. ఆ స్ఫూర్తితోనే 'ప్రపంచానికి జబ్బు చేసింది' అనే తొలి రచనతో ప్రజాశక్తిలో కలాన్ని ఝుళిపించి తనదైన గొంతుకతో నినదించిన శారద తన శరీరాన్ని తొలిచేస్తున్న మూర్ఛ జబ్బుకి బలై పోయాడు. అభ్యుదయ రచయితల సంఘంలో "రచనకు తగిన పారితోషికం పొందడం రచయిత హక్కు" అంటూ బహుశా మొట్టమొదటిసారిగా తీర్మానం పెట్టిన శారద అవే ఆర్థిక వ్యవస్థాపకుల్లో ఒకరయ్యాడు. కాంగ్రెస్‌తో మొదలై సోషలిస్టు, రాడికల్ హ్యూమనిస్టు ధోరణులను కూడా ప్రత్యక్షంగా చూసి స్వతంత్ర ఆలోచనాపరుడిగా కమ్యూనిజాన్ని ఎంచుకున్నాడు. తెలుగులో శ్రమజీవి వైపు నిల్చే రచనా వ్యాసంగాన్ని సృష్టించిన విశిష్టమైన దార్శనికుడిగా ఎదిగాడు.

రోజుకి పద్దెనిమిది గంటలు వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తూ శక్తిని హోటల్ పనికే ధారపోసిన ఆ భావుకుడు, పుట్టిన తర్వాత సరైన తిండీ, గుడ్డా ఎరగనని రాసుకున్నాడు. స్వతంత్రం వచ్చాక ఇలాగ ఉండదని ఆశించానని వాపోయాడు. కాఫీలు, బీడీలతోనే బతికిన శారద చిట్టచివరి వరకూ తన శక్తినీ, రక్తాన్నీ తెలుగు సాహిత్యం కోసమే ధారపోశాడు. ఇంతా చేసి అతడు బతికింది ముప్పై సంవత్సరాలు మాత్రమే. అందులోనూ అతడి రచనలు చేసిన కాలం మొత్తం ఏడేళ్ళే. అంత చిన్న వయసులో ఒకవైపు నిత్యం బతకడానికి పోరాటం చేస్తూనే మరోవైపు తెలుగు భాషా సాహిత్య సారస్వతాల్ని శ్రామిక వర్గ దృక్పథంతో నిరంతరం సుసంపన్నం చేసిన రచయిత మరొకరు లేరు.

అప్పటికే పాత్రికేయుడిగా తండ్రి వారసత్వం, తమిళ నాట వెలువడిన ఆంగ్ల అనువాద ప్రగతిశీల సాహిత్య ప్రభావం శారద మీద ఉంది. జీవితం నేర్పిన అసంఖ్యాక చేదు అనుభవాలు ఉన్నాయి. బాధలతో అస్తవ్యస్త సమాజంలో అసహాయంగా అశువులు బాసాడు.

"పత్రికలవారు కథలు రాస్తే ఇచ్చే డబ్బులు నా మూర్ఛ రోగాన్ని నయం చేసుకోడానికన్నా సరిపోతాయేమోనని సంతోషించాను. అదీ వట్టిదై పోయింది. ఈ పద్ధతిలో నేను స్వతంత్ర భారత పౌరుణ్ణని భావించ లేకపోవడంలో నా తప్పేమీ లేదనుకుంటాను" అంటూ, సరిగ్గా 75ఏళ్ళ క్రితం 1949 ఫిబ్రవరిలో 'తెలుగు స్వతంత్ర' పత్రికలో 'నాదైన సమస్యలు' పేరిట శారద రాసుకున్న చివరి వాక్యాలివి. అసలా వ్యాసమే "నాకు అనిపిస్తుంది అప్పుడప్పుడు. ఈ చాకిరీ చేస్తూ ఇట్లా ఆలోచనలు చేస్తే తొరగా చచ్చిపోతానని," అంటూ ప్రారంభిస్తాడు. చనిపోయే నాటికి నిండు గర్భవతియైన భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్న శారదకి మరణించిన తర్వాత కూడా తెలుగు సాహిత్యం, పాలకులు ఏమేరకు సముచిత స్థానం ఇచ్చారనేది ప్రశ్నార్థకమే.

వాస్తవ జీవన సమరం కావిస్తూ, దుర్భర దారిద్ర్యంతో సంఘర్షించాడు కనుకనే సమసమాజం కోసం స్వప్నించిన నిబద్ధత కలిగిన విప్లవ స్వాప్నికుడు కాగలిగాడు శారద. అందుకే వ్యవస్థలోని ఆధిపత్య రూపాలన్నింటినీ రచనలుగా మల్చి మానవ సంబంధాల్లోని అసమానతల్ని అక్షరీకరించాడు. దైనందిన జీవితంలోని ఒడిదుడుకుల్ని, సామాన్యులకి ఎదురయ్యే సమస్యలను నిజాయితీగా చర్చించాడు. ఒకనాటి తెలుగు సాహిత్య సాంస్కృతిక రాజకీయార్థిక సమాజానికి ప్రతిబింబంగా నిలిచే ఎన్నో రచనలు చేసాడు.


ప్రస్తుతం శారద సంతానం పెద్ద వాళ్ళయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆ మధ్య కొందరు ఔత్సాహికులు పూనుకుని శారద రచనలు ప్రచురించారు. కొన్ని విశ్వవిద్యాలయాల్లో శారద రచనలు విద్యార్థులకి పాఠ్యాంశంగా కూడా పెట్టారు. అయితే, తెలుగు భాషపై మక్కువతో తెలుగు సాహిత్యం మీద మమకారంతో తమిళ నాట పుట్టి మూడు పదుల వయసులోనే జీవన యవనిక నుంచి నిష్క్రమించిన ఒక యువ ఆలోచనాపరుడు, తత్వవేత్త, మేధావి, పాత్రికేయుడు, కథకుడు, రచయిత, వ్యాసకర్త, అన్నింటికీమించి తెలుగు భాషను గుండెల్లో పెట్టుకుని ప్రేమించిన నిష్కళంక శ్రమజీవిగానే శారదని గుర్తించడం సబబు. అంతకంటే ముఖ్యంగా, తెలుగు ప్రాంతంలో క్రియాశీల ఆరంభ సామ్యవాదుల్లో ఒకడిగా, కమ్యూనిస్టు కార్యకర్తగా జీవితాన్ని మల్చుకునే క్రమంలో ఆచరణలోనే అక్షర కక్ష్యల్ని ఛేదించిన అరుదైన యోధుడిగా శారదని స్మరించుకోడమే సముచితం.

శారద పుట్టిన సంవత్సరం 1924 అనీ 1925 అనీ వాదనలు ఉన్నాయి. చనిపోయింది మాత్రం 1955 ఆగష్టులో. ఆలూరి భుజంగరావు గారు రచించిన శారద జీవితచరిత్ర, ఆయన కథలతో కలిపి 'స్మృతి శకలాలు' పేరిట మొదటిసారి 40ఏళ్ళ క్రితం 1985లో, రెండోసారి పదిహేనేళ్ళ క్రితం 2009లో తెలుగులో వచ్చింది. ఆయన జీవితం, రచనల గురించి పరిశోధించి పట్టాలు పొందిన వాళ్ళు కూడా ఎందరో ఉన్నారు. అయినప్పటికీ అవిశ్రాంతంగా ఈ నేల మీద ఉవ్వెత్తున ఎగసిన శారద అక్షర ప్రభంజనాన్ని అంచనా వేయాల్సిన బృహత్కార్యం ఇంకా మిగిలే ఉంది.

(శారద శతజయంతి సందర్భంగా)

■ గౌరవ్

✆ 90320 94492



కలల్ని అంటుకడుతో...

ఏనాడూ అడగకండి
ఓ కామ్రేడ్ ఎలా చనిపోతాడని?
ఓ చెట్టులా,
ముందతన్ని ఇంటి నుండి పెకలించారు
వెలుతురూ వాన
మబ్బులూ గాలీ లేకుండా
అండాసెల్‌లో నిర్బంధించారు.
రాజ్యం చెట్టు
రసాన్ని పీల్చి పిప్పి చేసి
మాయమయ్యేలా చేస్తుంది.
రచయితలు తమ
మరణ యోగ్యతా పత్రాలను రాస్తారు
కొంచెం కొంచెంగా,
నెమ్మదిగా,
వైద్యపరంగా,
సూక్ష్మంగా.
వాళ్ళు ఒక చెట్టును చంపగలరు
కానీ
అతని చక్రాల కుర్చీ చక్రాలకు
అతని సిరాతో అంటుకట్టినట్లు
వేనవేలుగా విస్తరించిన వాటి వేర్లనెలా చంపగలరు?
కామ్రేడ్ మరణానికి ఎప్పుడూ దుఃఖపడకండి
చుట్టూ చూడండి
ఎల్లప్పుడూ చెట్టు తన ఆకులను
ఈలలా ఊదుతున్నట్లు
కనుగొంటారు మీరు
యుద్ధం ఇంకా నడుస్తూనే ఉంది
సాయిబాబా ఎన్నటికీ మరణించదు.

ఇంగ్లిష్ మూలం ■ **మౌమితా ఆలం**
తెలుగు అనువాదం ■ **అరుణాంక్ లత**
arunank.latha@gmail.com

నాకు విమర్శ కూడా సృజన ప్రక్రియే!

చదువు ముచ్చట

నండూరి రాజగోపాల్



ఈమధ్య చదివిన/ చదువుతున్న పుస్తకం?

'Post truth' అని లీ మెక్‌ఎంటైర్ పుస్తకం చదివాను. కె.ఎస్.వై. పతంజలినీ, వర్తమాన ప్రపంచాన్నీ, రచనలనీ ఈ కాన్సెప్ట్ నేపథ్యంలో అర్థం చేసుకోవడం, విశ్లేషించగలగడం నాకు బావుంది.

బాల్యంలో మొదటిసారి ఏ పుస్తకం ఇష్టంగా చదవటం గుర్తుంది?

బుచ్చి బాబు గారు బహుశా నేను మొదట చదివిన రచయిత. 1989లో నేను ఇంటర్‌లో ఉండగా తొలిసారి, ఆ తరువాత చాలాసార్లు ఆయన నవల, కథలు, వ్యాసాలు చదువుతూనే ఉన్నాను. ఈ సాహిత్య ప్రపంచంలోకి నన్ను తీసుకువచ్చిన రచయిత ఆయన.

మిమ్మల్ని వ్యక్తిగతంగా ప్రభావితం చేసిన రచయిత?

మళ్ళీ అదే సమాధానం. బుచ్చిబాబు గారు, ఇంకా పతంజలి శాస్త్రి గారు– ఈ ఇద్దరూ జీవితాన్ని ఎటువంటి పరదాలూ లేకుండా అన్ని వైపుల నుండి, అన్ని లోతుల నుండి చూడడం కొనసాగించారు. ఇప్పుడు కూడా పతంజలిశాస్త్రి గారు కథకి కొత్త సాంకేతికత, కొత్త భాష అద్ది నా లాంటి పాఠకులను విస్మయపరుస్తూనే ఉన్నారు.

తెలుగులో మీకు బాగా నచ్చిన విమర్శ పుస్తకం?

ఇది చెప్పడం కష్టం అండి. ఎందుకంటే నాకు వ్యక్తిగతంగా విమర్శ కూడా సృజన ప్రక్రియగా అనిపిస్తుంది. మనకు అరవైయ్యవ దశకం నుండి తొంభైయ్యవ దశకం వరకు వచ్చిన వ్యాస సంపుటాలు అన్నీ దాదాపు 'ఫార్ములా, దానికి వివరణ' లాగే వచ్చాయి. ప్రతిదానికీ ఏదో ఒక సిద్ధాంత నేపథ్యం ఉంది. ఇది తప్పని నేను అనడం లేదు. కానీ ఇది ఒక్కటే విమర్శ కాదు. వీరభద్రుడు గారి తొలి రెండు విమర్శ గ్రంథాలు 'సహృదయునికి ప్రేమలేఖ', 'సాహిత్యం ఎందుకు' ఈ రెండూ ఖచ్చితంగా ఆయా రచనలకు కొత్త పాఠకులను పరిచయం చేస్తాయి.

సాహిత్యంలో మీకు నచ్చిన కల్పిత పాత్ర?

భమిడిపాటి జగన్నాథ రావు గారి కథ 'మువ్వలు'లో ఒక రెండు నిమిషాలు వచ్చి వెళ్లి పోయే పాత్ర ఒకటి ఉంది. కథ మొత్తాన్ని ఈ పాత్ర ప్రభావితం చేస్తుంది. ఒక అప్రధాన పాత్ర, జస్ట్ కాజువల్‌గా వచ్చినట్లుగా కనపడే ఈ పాత్ర అంటే నాకు ఇప్పటికీ ఫస్ట్ క్రష్ అంత ఇష్టం.



'వేలుపిళ్లై' రాసిన సి. రామచంద్రరావు గారిని కలిసి, 'మీరు మళ్లీ ఎందుకు కథలు రాయలేదు' అని అడగాలని ఉంది.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

'వేలుపిళ్లై' రాసిన సి. రామచంద్రరావు గారిని కలిసి, 'మీరు మళ్లీ ఎందుకు కథలు రాయలేదు' అని అడగాలని ఉంది.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

నేను మొదట్లో పుస్తకాల మీద వచ్చిన విమర్శను ముందు చదివి, ఆ తరువాత ఆ రచనలని చదివేవాడిని. ఇప్పుడు రచనలను ముందు చదువుతున్నాను. అంతే కాదు వర్తమాన కాలానికి సంబంధించి ఒక అలెర్ట్‌నెస్ కూడా ఇవాళ రచయితలకు, పాఠకులకు అవసరం. అందువల్ల సృజనాత్మక రచనలతో పాటు, ఇతర సామాజిక, రాజకీయ, ఆర్థిక, మత సంబంధిత గ్రంథాలు కూడా చదవాల్సిన అవసరం ఉందని గ్రహించాను. బహుశా ఇది చెయ్యకపోతే ఏ గ్రంథాన్ని మనం పూర్తిగా విశ్లేషించలేం.

(నండూరి రాజగోపాల్ విమర్శకుడు, 'చినుకు' పత్రిక సంపాదకుడు. ఆయన పుస్తకాలు– సాహిత్య పరామర్శ వ్యాసాల సంపుటి 'అనంతరంగాలు', సంపాదకీయ వ్యాసాల సంపుటాలు 'మొదటి పేజీలు', 'వర్తమానం'.)

I refuse to die

మరణించేది లేదని తెగేసి చెప్పాక
నా సంకెళ్ళు తెగాయి

జైలు బయటికి వచ్చి
విశాల మైదానాల్లో అడుగుపెట్టిన వెంటనే
గడ్డిపరకల్ని చూసి నవ్వాను

నా చిర్నవ్వును సహించలేక
మళ్ళీ సంకెళ్ళకు పనిచెప్పారు

మళ్ళీ మళ్లీ మృత్యువును తిరస్కరిస్తుంటే
నా జీవితమే వాళ్ళకి తలనొప్పిగా మారింది
విసుగెత్తి నన్ను వదిలేసారు.

మరోసారి ఆకుపచ్చలోయల్లోకి అడుగుపెట్టాను
పొడుస్తున్న పొద్దుకింద
తలెగరేస్తున్న గడ్డిపోచల్ని నవ్వుతూ పలకరించాను

చెరగని నా చిర్నవ్వు చూసి
వాళ్ళకి చిర్రెత్తుకొచ్చింది
మళ్ళీ అదే బందిఖానా

మళ్లీ అదే మరణాన్ని తిరస్కరించే మొండితనం
విచారించాల్సిన విషయం ఏంటంటే
నన్నెలా చంపాలో కూడా వాళ్ళకి తెలియదు

ఎందుకంటే
మొలకెత్తె గడ్డిపువ్వుల నవ్వడిని
ప్రేమించడం తెలుసు నాకు.

ఇంగ్లిష్ మూలం ■ **జి.ఎన్. సాయిబాబా**
తెలుగు అనువాదం ■ **శివప్రసాద్**

ప్రాంతాల్ని దాటిన నాటి సాహితీ సామరస్యం!

"నిజామ్ రాష్ట్రంలో కవులు పూజ్య"మని ముడుంబ రాఘవాచార్యులు దురహంకారాన్ని ప్రదర్శిస్తే, గోలకొండ కవుల సంచిక ద్వారా 'సురవరం' తెలంగాణ ప్రాంత సాహిత్య ప్రతాపాన్ని చూపించాడు. తెలంగాణ భాషను నిందించిన వారిని నిలదీయాల్సిందే. కానీ ఇక్కడ భాషా సాహిత్యాల గురించి సమున్నతంగా స్పందించిన వారిని కూడా యాది చేసుకోవాలి. సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కొంతమంది పాతతరం కవి పండితులు, తెలంగాణ ప్రాంత భాషా సాహిత్యాల ఔన్నత్యాన్ని ప్రశంసించారు. ప్రాంతాలకు అతీతంగా తెలంగాణ సారస్వత ఘనతను కీర్తించారు.

"కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన ఎంతోమంది కవులు, పండితులు, సాంస్కృతిక కార్యకర్తలు తెలంగాణ వికాసానికి నడుం బిగించారు. ఇక్కడి సాంస్కృతిక ఉద్యమాలతో మమేకమయ్యారు" ('ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ') అని గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి గుర్తు చేశాడు. "ప్రాణంబైనది తెల్గుగడ్డకు ధరా ప్రాలంబమౌనీ తెలంగాణము/ విన్నాణంబైన కవిత్వసంపదలకు" కేంద్రబిందువని ('కీర్తితోరణం') డెబ్బయ్యో దశకంలోనే ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి వ్యాఖ్యానించాడు. ఈ భూమిపై కాలుపెడితే శరీరము పులకరిస్తుందని తెలంగాణ, వరంగల్ ప్రాంత సాంస్కృతిక, చారిత్రక, కళా వైశిష్ట్యానికి ఆనాడే హనుమచ్ఛాస్త్రి కీర్తితోరణాలను అలంకరించాడు. "తెలుగు దేశ చరిత్రకు తెలంగాణ విత్తనమని" కొమర్రాజు లక్ష్మణరావు ఈ ప్రాంత ప్రాధాన్యతను ఎంతో దార్శనికతతో విశ్లేషించాడు.

ప్రాచీన కాలం నుండి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల సాహిత్య స్వరూప స్వభావాలు విభిన్నంగా ఉన్నాయని పింగళి లక్ష్మీకాంతం 'రంగనాథ రామాయణం' పీఠిక (1942)లో పేర్కొన్నాడు. ఆంధ్ర ప్రాంతంలో మార్గ పద్ధతిలో, తెలంగాణలో దేశి పద్ధతిలో ప్రధానంగా కవితా సృజన సాగిందని, లక్ష్మీకాంతం వివరించాడు. భౌగోళిక కారణాల రీత్యా సంస్కృత సాహిత్యానుకరణం, తరువాత బెంగాల్ సాహిత్య ప్రభావం ఆంధ్రప్రాంత కవుల రచనల్లో కనిపిస్తుందని ఆయన వివరించాడు. "తమ ప్రాంతంలో మహోదారమైన జీవితములు గడిపిన వీరుల చరిత్రలే" ఇతివృత్తాలుగా మలుచుకొని, తెలంగాణ సాహిత్య కారులు తాతల నాటి తల్లి భాషలో రచనలు చేశారని తెలంగాణ భాషా సాహిత్యాల విశిష్టతను, విలక్షణతను, అందుకు గల కారణాలను పింగళి లక్ష్మీకాంతం సముచితంగా వివేచించాడు.

కృష్ణా జిల్లా నుండి వలస వచ్చిన శేషాద్రి రమణ కవులు తెలంగాణలో స్థిరపడి ఈ ప్రాంత చరిత్ర, సాహిత్య చరిత్ర, సంస్కృతుల పరిశోధనకు తమ జీవితాలను అంకితం చేశారు. "తెలంగాణ పరిశోధనోద్యమ, శేషాద్రి రమణ కవులు పర్యాయ పదాలు అన్నా అతిశయోక్తి కాదు" అన్న ('తెలంగాణ సాహిత్యవికాసం') కె. శ్రీనివాస్ మాటల్లో శేషాద్రి రమణకవుల అపురూపమైన పరిశోధనా కృషి అర్థమవుతుంది. వందేళ్ళ క్రితమే శేషాద్రి రమణ కవులు కాలికి బలపం కట్టుకొని తెలంగాణలో పర్యటించి నిజాము రాష్ట్రంలో పరిశుద్ధమైన ఆంధ్ర భాషా స్వరూపం కనిపిస్తుందని వేయి కన్నులతో పరిశీలించి, తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్రను తవ్వి పోశారు. 'నిజాం రాష్ట్ర కావ్య ప్రశంస' కావ్యంతో తెలంగాణ సాహిత్య వైభవానికి శేషాద్రి రమణ కవులు నీరాజనాలు పలికారు. 'పరిశోధనా వ్యాస మంజరి' గ్రంథం ద్వారా ఈ ప్రాంత చరిత్రపై కొత్త వెలుగులు ప్రసరించారు.

ఆదిపూడి సోమనాథరావు గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన కవి. వీరికి గద్వాల, మునగాల సంస్థానాలతోపాటు హైదరాబాద్ నగరంతో, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంతో ప్రగాఢ అనుబంధం ఉంది. "అచ్చ తెనుంగు కబ్బమునకాది పదంబయి పొల్చు భాగ్యమున్నెచ్చగ గన్న దేశమిది". ఆది నుండి అచ్చ తెలుగు భాష తెలంగాణలో విలసిల్లిందని సోమనాథ రావు స్పష్టంగా ప్రకటించాడు. "ఉరుదు శారద యూరేగు ధరణి లోన/ తెలుగుబిబ్బోకవతి పేరు నిలుపుచున్న సరసులకు మీకు వలపుటంజలి ఘటింతు" ('మధుకణాలు' జాషువ సర్వలభ్య రచనల సంకలనం) అంటూ తెలంగాణ ప్రాంత సాహిత్యానికి, కవులకు జాషువ కితాబు ఇచ్చాడు. ఉర్దూ సాహిత్యం ఊరేగుతున్న ప్రాంతంలో, తెలుగు సాహిత్యానికి సేవ చేసే సరస సాహితీవేత్తలకు జాషువ 'వలపుటంజలి' ఘటించాడు. "తెలంగాణలో గొప్ప త్రోవలో కవితా సంచారము సాగుతుంది" అని పల్లా దుర్గయ్య పాలవెల్లి కావ్యానికి రాసిన ముందుమాటలో విశ్వనాథ ప్రశంసించాడు. "తెలంగాణలో మాట్లాడే తెలుగుభాషకు కొన్ని ప్రత్యేకతలు, కొంత వైశిష్ట్యము ఉన్నది" అని తెలంగాణ రచయితల మహాసభల్లో (1953) శ్రీశ్రీ సముచితంగా ప్రకటించాడు. మిగతా ప్రాంతాలవారు పరిహసిస్తారని సందేహించకుండా తెలంగాణ రచయితలు తమ ప్రాంత ప్రజల దైనందిన జీవిత భాషనే రచనలల్లో ప్రయోగించాలని సూచించాడు. తెలుగుకు వెలుగునిచ్చింది తెలంగాణ ప్రాంతమేనని అడవి బాపిరాజు విశ్వసించాడు.



సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కొంతమంది పాతతరం కవి పండితులు ప్రాంతాలకు అతీతంగా తెలంగాణ సారస్వత ఘనతను కీర్తించారు. అలాగే అప్పటి నిజాం కాలం నుండి తెలంగాణ సాహితీవేత్తలు, సంస్థలు ఆంధ్ర ప్రాంత కవి పండితులను సమాదరించిన విషయం కూడా మరిచి పోలేనిది.

"చాలా మంచి తెలుగు పదాలు తెలంగాణ, రాయలసీమ గ్రామగ్రామాల్లో ఉన్నాయి. వాటిని సాదరంగా స్వీకరించి అందరూ అందుకొని ఉపయోగించాలి" (పందిరి మల్లిఖార్జున రావు శత జయంతి సంపుటం) అని జమ్మలమడుగు మాధవ రామ శర్మ కవి పండితులకు హితవు చెప్పాడు. ప్రకాశం జిల్లా ఏదుబాడు నుండి వచ్చి, నల్లగొండ జిల్లా చండూరులో స్థిరపడిన అంబటిపూడి వెంకట రత్నం ఈ ప్రాంత సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడు. 'సాహితీ మేఖల' సంస్థను స్థాపించి, దాశరథి, దేవులపల్లి రామానుజరావు లాంటి కవుల గ్రంథాలను ప్రచురించాడు. నైజాము రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల కొత్త తరం కవులకు సాహితీమేఖల ఒక వేదిక లాగా ఉపయోగ పడిందని రామానుజారావు అభినందించాడు. జయధీర్ తిరుమలరావు సంపాదకత్వంలో వెలువడిన 'సురవరం ప్రతాపరెడ్డిగారి సన్నిధికి కవిపండితులు రాసిన లేఖలు' పుస్తకం చదివితే ప్రతాపరెడ్డితో, తెలంగాణతో అప్పటి సీమాంధ్ర ప్రాంత రచయితలకు ఉండే సాహిత్య అనుబంధం అవగతమవుతుంది. అయితే రాయప్రోలు సుబ్బారావు, కురుగంటి సీతారామయ్య ఎంతోకాలం తెలంగాణలో ఉన్నప్పటికి ఈ ప్రాంత భాషాసాహిత్యాలను గౌరవించ లేదని తెలంగాణవాదులు విమర్శించారు.

తెలంగాణలోని భాషా సాహిత్యాల విశిష్టతను అర్థం చేసుకోవడంతోపాటు ఇక్కడి పోరు తత్వానికి ఆంధ్ర ప్రాంతకవులు అక్షర జేజేలు పలికిన సందర్భాన్ని తలుచుకుంటేనే మహోన్నత స్ఫూర్తి కలుగుతుంది. "తెలంగాణ తెలంగాణ ధీరుల మొగసాల/ తెలంగాణ తెలంగాణ విప్లవోజ్వల గాథ" అని ఆవంత్స సోమసుందర్ సాయుధ పోరాటానికి 'వజ్రాయుధా'న్ని అందించాడు. "తెలంగాణ, గగనాన అరుణ తారై వెలుగు/ ఆ తార వెలుగులోనే మము నడుపుమో స్వాతంత్ర్య దేవీ" అంటూ పులుపుల వెంకట శివయ్య ఆదర్శనీయమైన ఈ ప్రాంత ఉద్యమ స్ఫూర్తిని అక్షర బద్ధం చేశాడు. ఆరుద్ర, గంగినేని, బొల్లిమంత శివరామ కృష్ణ, తుమ్మల వెంకట్రామయ్య తదితర అభ్యుదయ కవులెందరో తెలంగాణ పోరాటాన్ని కలమెత్తి గళమెత్తి గానం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా కొంతమంది సీమాంధ్రకవులు 'కావడి కుండలు' సంఘీభావ కవిత్వంతో జై కొట్టిన విషయం జగద్విదితం.

అప్పటి నిజాం కాలం నుండి తెలంగాణ సాహితీవేత్తలు, సంస్థలు ఆంధ్ర ప్రాంత కవి పండితులను సమాదరించిన విషయం కూడా మరిచి పోలేనిది. సీమాంధ్ర ప్రాంతానికి చెందిన దళిత, బహుజన కవుల గురించి సంగిశెట్టి శ్రీనివాస్ ఎన్నో వ్యాసాలు రాశాడు. ఆంధ్రాలో సాగిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలతో తెలంగాణ కవులు కలిసి నడిచి ప్రజాచైతన్యాన్ని ప్రజ్వలింప జేశారు. ఈ దిశగా ప్రత్యేకంగా అధ్యయనం జరగవలసిన అవసరముంది.

■ **కోయి కోటేశ్వరరావు**

✆ 94404 80274



వీరులారా.. వందనం

శాంతి భద్రతల పరిరక్షణలో సమిధలు పోలీసులు

- ప్రాణాలు పణంగా పెట్టి విధి నిర్వహణ
- మందుపాతరలు, నక్సల్స్ తూటాలకు బలి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 మంది అమరులు
- నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం
- పది రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- ఘన నివాళులర్పించనున్న పోలీసులు, కుటుంబసభ్యులు

8

"ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టే త్యాగశీలురు పోలీసులు. ముష్కర మూకలను తరిమికొట్టే.. అసాంఘిక శక్తుల ఆట కట్టించే ధీరులు. సమాజ హితం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని త్యాగధనులు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అవిరామంగా కృషి చేస్తుంటారు. విధి నిర్వహణలో అరాచక శక్తుల ఆటకట్టిస్తారు. ఒక్కోసారి వారి చేతుల్లో ప్రాణాలు కోల్పోతుంటారు. పోలీసు విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగాల్లా కొన్నిగంటలకే పరిమితమైనది కాదు. ఎండ, వాన, రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతీ ఒక్కరు ఆపదలో సాయం కోరేది పోలీసులనే. శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేది సైనిక జవానులైతే.. అంతర్గత శత్రువు నుంచి ప్రజలను కాపాడేది పోలీసులు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసులు కొందరైతే.. నక్సలైట్ల తుపాకీ గుండ్లకు, మందు పాతరలకు బలైన పోలీసు అమరవీరులు ఇంకెందరో.. విధినిర్వహణలో అసులుబాసిన వారందరికీ అశ్రునివాళులర్పిస్తూ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి గౌరవార్థం పోలీసుశాఖ ఏటా అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం."

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉన్నాం..

- ప్రతీ పోలీసు కుటుంబాన్ని ఆదుకుంటున్నాం..
- 30 ఏళ్ల కిందట మరణించిన పోలీసు కుటుంబాన్ని మరిచిపోలేదు..
- స్వయం ఉపాధితోపాటు విద్య, ఉద్యోగాల కల్పనలో సహకరిస్తున్నాం..
- ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయిస్తున్నాం..
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ప్రత్యేక ఇంటర్వ్యూ

8



'సంఘ విద్రోహ శక్తులు, నక్సలైట్లతో జరిగిన పోరులో వీర మరణం పొందిన పోలీసులను శాఖ ఎప్పటికీ మర్చిపోదు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నాం. అమరుల కుటుంబాలకు విద్య, ఉపాధి కల్పనలో కృషి చేస్తున్నాం. అలాగే వృత్తి విద్యాకోర్సులు, ఉన్నత చదువుల్లో అమరుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి అవకాశాలు కల్పిస్తున్నాం. విధి నిర్వహణలో అసువులు బాసిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో అమరులైన 59 మంది పోలీసులు, ఐదుగురు హోంగార్డుల కుటుంబాలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటున్నాం' అని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సమాచారం



నేడు సీసీఐ కేంద్రం ప్రారంభం

- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పత్తికి మద్దతు ధర కల్పించేందుకు సోమవారం ఏనుమాముల మార్కెట్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నది. సీసీఐ కేంద్రాన్ని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ పరిధిలోని శివనగర్, ఆర్ఎస్ నగర్, చింతల్, మిల్స్‌కాలనీ, శాకరాసికుంట, ఎస్ఎస్ఆర్ నగర్ ప్రాంతాలలో సోమవారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ వాల్‌మార్ట్ ప్రాంతంలో ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పడ్డ లీకేజీకి మరమ్మతు పనులు కొనసాగుతున్నందున సరఫరా ఉండదని పేర్కొన్నారు.




నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో వర్షపునీటిలో కొట్టుకుపోతున్న మొక్కజొన్నలను రాసిగా చేసుకుంటున్న రైతులు

కన్నీటి వర్షం

- నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్న
- కన్నీరు మున్నీరైన అన్నదాతలు

నర్సంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్లెదుటే వర్షంలో తడిసి ముద్దయిపోవడం, వర్షపునీటిలో కొట్టుకు పోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. నర్సంపేట పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్నలు తడిసిముద్దయ్యాయి. తేమశాతం ఎక్కువగా ఉండడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు మక్కలను తీసుకొచ్చి మార్కెట్ ఆవరణలో ఆరబెట్టుకున్నారు. అకస్మాతుగా మధ్యాహ్నం కురిసిన వర్షానికి మక్కలు తడిసిపోయాయి. వర్షానికి మక్కలు తడువకుండా రైతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా కుదరలేదు. వర్షపునీటిలో తడిసిన మక్కజొన్నల రాసులను, నీటిలో కొట్టుకుపోయిన మక్కలను రాసులుగా చేయడానికి రైతులు అరిగోస పడ్డారు. సుమారు 70 క్వింటాళ్ల మక్కలు వర్షానికి తడిచినట్లు రైతులు పేర్కొంటున్నారు.

కొండాపురానికి చెందిన సాంబయ్య, కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన రాజుకు చెందిన మక్కజొన్నల రాసులు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. వర్షం వెలిశాక తడిసిన మక్కలను ఆరబెట్టుకోవడానికి రైతులు తంటాలు పడుతున్నారు. మొక్కజొన్నలు తడిసిపోవడంతో సరైన గిట్టుబాటు ధర రాక పెట్టిన పెట్టుబడులు చేతికందుతాయోలేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకొని ఆదుకోవాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్, కమిటీ సభ్యులతో పాటు, మార్కెట్ అధికారులను రైతులు కోరుతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకు చూపకుండా రైతులు అమ్మకానికి తెచ్చిన మక్కలను కొనుగోలు చేసేలా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులను సన్మార్గంలో నడిపించేది గురువే..

- బీఆర్ఎస్ పాలనలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు..
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ఎమ్మెల్యే నాయిని

వడ్డెపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను సన్మార్గంలో నడిపించే మార్గదర్శి గురువులేనని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో భాషోపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆత్మీయ సన్మాన సభను పోలోజు శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని దుయ్యబట్టారు. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొడుతూ ప్రతిపక్షాలు పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని చెప్పారు. పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. 15వేల మంది పోలీసు సిబ్బందిని కొత్తగా నియమించామని, 1,637 ఇంజనీరింగ్ పోస్టులు, 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేపర్ లీకేజీలు చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని మంత్రి స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేయని అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ప్రజాపాలనలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని అన్నారు. అనంతరం పోలోజు శ్రీహరి రచించిన రాష్ట్ర భక్తి గీతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కర్రెం గౌరీశంకర్‌రావు, గౌరవ అధ్యక్షులు పెండ్యాల బ్రహ్మయ్య, చౌడవరం చంద్రమోహన్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు అడ్డూరి వెంకటేశ్వర్లు, పోలోజు శ్రీహరి, నాయకులు భద్రయ్య, షేక్ హాజీనూరాని పాల్గొన్నారు.

స్పౌజ్ విభాగం బదిలీలు చేపట్టాలి..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన 317 జీవో కేబినెట్ సబ్ కమిటీ స్పౌజ్ విభాగం బదిలీలు జరపాలని మంత్రి సీతక్కను స్పౌజ్ ఫోరం ప్రతినిధులు ఎ. దేవేందర్‌రెడ్డి, సాంబమూర్తి, హసన్ అలీ, ఎండీ. హుస్సేన్‌లు కోరారు. మంత్రి సీతక్కను టీటీడీ కల్యాణ మండపం వద్ద కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పౌజ్ విభాగం బదిలీల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని వారు కోరారు.

నెరవేరనున్న 'కోచ్‌ఫ్యాక్టరీ' కల

- కాజీపేటలో వందేభారత్, స్లీపర్ కోచ్‌ల తయారీ కేంద్రం
- హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- 500 మందికి ఉపాధి లభించే అవకాశం



కాజీపేటలో నిర్మాణం అవుతున్న వ్యాగన్ ఫ్యాక్టరీ

కాజీపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన కాజీపేట రైల్వే జంక్షన్‌లో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు కాబోతున్నది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని చర్లపల్లిలో జరిగిన ఓ సమావేశంలో స్వయంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

కాగా, 2013 సంవత్సరంలో కాజీపేట మండలం మడికొండ శివారులోని అయోధ్యపురంలో రూ.521కోట్లు నిధులతో వ్యాగన్ పీరియాడికల్ ఓవరాలింగ్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. దీనికి 2023 సంవత్సరంలో హనుమకొండలోని సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. అనంతరం నిర్మాణంలో వున్న వ్యాగన్ పీవోహెచ్‌ను అప్‌గ్రేడ్ చేసి వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ చేశారు. ఇదేకాకుండా మరో అడుగు ముందుకేసి నెల కిందట వందేభారత్‌ల తయారీ పరిశ్రమకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అదనంగా రూ.66కోట్ల నిధులు విడుదల చేశారు. ఇదిలా వుండగా, ఆదివారం చర్లపల్లిలో జరిగిన ఓ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్లీపర్ కోచ్‌లను సైతం కాజీపేటలో తయారీ చేయడానికి అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కాజీపేటలో వందేభారత్, స్లీపర్‌కోచ్‌ల తయారీ పూర్తిస్థాయిలో నిర్మాణం కాబోతోంది.

సమాచార సేకరణ

కాజీపేటలో స్లీపర్‌కోచ్‌ల తయారీకి స్థలం, నిధుల విషయమై పూర్తి సమాచారం కావాలని రేల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ సంస్థ (ఆర్‌వీఎన్ఎల్)ను రైల్వే బోర్డు కోరింది. ఆ వివరాలను ఆర్‌వీఎన్ఎల్ సంస్థ రైల్వే బోర్డుకు అందించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అయితే 2025 ఆగస్టు వరకు రైల్వేవ్యాగన్ మ్యాను ఫ్యాక్చరీకి సిద్ధం కాబోతుండగా, 2026లో స్లీపర్‌కోచ్‌ల తయారీ పూర్తవుతుందని రైల్వే అధికారులు చెప్పారు. కాజీపేటలో పూర్తిస్థాయి కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పడితే సుమారు 500 మందికి ఉపాధి అవకాశం వుంటుందని రైల్వే కార్మిక నాయకులు చెబుతున్నారు.

దేవరుప్పుల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్న అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలికొంది. బతుకుదెరువు కోసం వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం కలిచివేసింది. ఈ విషాదకర ఘటన జనగామ జిల్లా జనగామ-సూర్యాపేట రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం..

పని కోసం వచ్చి.. ప్రమాదానికి గురై..

- బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ట్రాలీని ఢీకొన్న బైక్
- కర్నూలు, వనపర్తికి చెందిన ఇద్దరు మృతి
- ఆటోలో ఉన్న మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- జనగామ - సూర్యాపేట రహదారిపై ఘటన

కర్నూలు జిల్లా మొగితికి చెందిన బోయ నర్సింహా(20), వనపర్తి జిల్లా మాదాపురంనకు చెందిన చీరోలు భరత్(22)లు కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ప్లంబింగ్ పనికోసం వచ్చారు. పని మీద బైక్‌పై దేవరుప్పులకు బయలుదేరారు. జనగామ-సూర్యాపేట రహదారిపై గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించారు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టి ఆర్టీసీ బస్సుకు తగిలారు. దాంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన నర్సింహా, భరత్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో టాటా ఏస్ వాహనం నడుపుతున్న సింగరాజుపల్లికి గ్రామానికి చెందిన కొంగరి భాస్కర్, రాపాక ఉప్పలయ్య, రేణుకలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, నర్సింహ, భరత్‌ల మృతదేహాలను జనగామ మార్చురీకి తరలించి, వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారవిచ్చారు.

మృతుల కుటుంబ సభ్యుల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

ప్రాణం తీసిన అప్పు

▸ తీసుకున్న అప్పు చెల్లించని స్నేహితుడు

▸ మధ్యవర్తిగా ఉండడంతో వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబీకులు, మృతుడు రాంబాబు (ఫైల్)

బాలసముద్రం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడికి అప్పు ఇప్పించగా, అతడు చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులకు తాళలేక ఓ వ్యక్తి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో చోటుచేసుకుంది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన మాశెట్టి రాంబాబు(51) పాల వ్యాపారం చేస్తున్నాడు. అదే కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్‌తో ఈయనకు పరిచయం ఉంది. ఈ క్రమంలో ఉపాధ్యాయుడి వద్ద నుంచి రాంబాబుకు తెలిసిన విష్ణువర్ధన్‌రెడ్డికి 2019లో రూ.3లక్షలు అప్పుగా ఇప్పించాడు. ఈ డబ్బులు విష్ణువర్ధన్‌రెడ్డి చెల్లించకపోవడంతో రమేశ్ రాంబాబుపై ఒత్తిడి పెంచాడు. దీంతో రూ.3లక్షలను రాంబాబు రమేష్‌కు చెల్లించాడు. అయితే ఇచ్చిన డబ్బులకు రూ.10చొప్పున వడ్డీ కట్టిన రమేశ్.. ఇంకా చెల్లించాలని రాంబాబును వేధించాడు. దీంతో రాంబాబు ఈ నెల 15న ఎలుకల మందును తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం కుటుంబసభ్యులకు తెలవడంతో వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ రాంబాబు మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్యారాణి సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్‌పై పోలీసలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. గోకుల్‌నగర్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్ ఇంటి ఎదుట రాంబాబు మృతదేహం ఉంచి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై సుమన్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి వరకు కూడా ఆందోళన చేపట్టడంతో పోలీసులకు మృతుడి కుటుంబసభ్యులకు కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా, రాంబాబుకు భార్య సంధ్యారాణి, ఇద్దరు కుమార్తెలున్నారు.

న్యూస్ బాక్స్

బాలపురస్కార్ అవార్డు గ్రహీతకు సీపీ అభినందన



లక్ష్మిప్రియను అభినందిస్తున్న సీపీ

హనుమకొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా బాలపురస్కార్ అవార్డును అందుకున్న కూచిపూడి నాట్య కళాకారిణి పెండ్యాల లక్ష్మీప్రియకు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందనలు తెలిపారు. రాజేష్ కుమార్ - సాయిలత దంపతుల కుమార్తె లక్ష్మీప్రియ ప్రముఖ కూచిపూడి నాట్య గురువు సుధీర్ వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది కిందటేడు జాతీయ స్థాయిలో నిర్వహించిన కళోత్సవ్ పోటీల్లో అన్ని విభాగాల్లో ప్రథమంగా నిలవడంతో బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును లక్ష్మీప్రియ ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకోవడమే కాకుండా ప్రధాని నరేంద్ర మోదీతో రెండు సార్లు అభినందనలు అందుకున్నారు. బాల పురస్కార్ అవార్డు అందుకున్న లక్ష్మీప్రియ విశ్రాంత పోలీసు అధికారి గంధం మనోహర్ మనవరాలు కావడం విశేషం.

జీటీఏ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దుర్గం రవి



వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం - నల్లగొండ శాసన మండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా హనుమకొండకు చెందిన డాక్టర్ దుర్గం రవిని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు.ఆదివారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రాష్ట్రకౌన్సిల్ సమావేశంలో దుర్గం రవిని తమ అభ్యర్థిగా ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. బ్రహ్మచారి, నాయకులు తాళ్లపెల్లి ప్రకాశ్, వెంకటేశం పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ సదస్సును విజయవంతం చేయాలి

▸ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి



మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి

కేయూ క్యాంపస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న కాకతీయ యూనివర్సిటీలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి పిలుపునిచ్చారు. ఆదివారం కేయూ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ వర్సిటీ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొచ్చు తిరుపతి హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన డీఎస్సీ పోస్టుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు కాకపోవడంతో మాదిగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూప్-1, 2, 3, 4తో పాటు విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, జూనియర్ అసిస్టెంట్లతో పాటు ఇతర ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేశారని చెప్పారు. ఆయా ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిజామాబాద్‌లో ఎంఎస్ఎఫ్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు అక్టోబరు 24న కేయూలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓదెల అరిస్టాటిల్, కీర్తి దిలీప్, అరవింద్, మేకల వరప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఏడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఎం.చందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ నెల 30 మధ్యాహ్నం 3 గంటలలోపు అభ్యర్థులు ప్రవేశాలు పొందగోరే ఐటీఐల్లో వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని వారు కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మద్దతు ధర కోసం జాగ్రత్తలు పాటించాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పత్తికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కాలంటే సీసీఐ నిబంధనలకు లోబడి ఉండాలని ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆదివారం తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే మద్దతు ధర పొందవచ్చన్నారు. ధర నిర్ణయంలో తేమ శాతం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు.

పత్తి ఏరడంలో జాగ్రత్తలు

చలికాలం పత్తి ఎండపూట ఏరాలన్నారు. ఏరిన పత్తిని కుప్పగా పోయడం వల్ల తేమ అందులోనే ఉండి నాణ్యత దెబ్బతిని ధర రాదన్నారు. పత్తి ఏరిన తరువాత ఆర బెట్టి మార్కెట్‌కు అమ్మకానికి తీసుకురావాలని సూచించారు. తద్వార తేమ శాతం తగ్గి మంచి ధర పొందవచ్చన్నారు.

నాణ్యత నిర్ధారణ ఇలా..

పత్తిలో తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారు. 8శాతం తేమ ఉన్న పత్తికి మద్దతు ధర రూ.7521లు లభిస్తుంది. ప్రతీ ఒక్క శాతానికి కిలో ధర తగ్గించి ఇస్తారు. అది కూడా 12 శాతం తేమ వరకు ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని వివరించారు.



పాట్స్ కార్యక్రమంలో ఎంపీ కావ్యను సన్మానిస్తున్న దృశ్యం

శిశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

▸ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

▸ ఘనంగా పదో పాట్స్ వార్షిక సమావేశం

వరంగల్ మెడికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : శిశువుల్లో అతి ప్రమాదకరమైన వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేలా సరైన న్యూట్రిషన్ అందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మడికొండ సత్యసాయి కన్వెన్షన్‌లో వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ - తెలంగాణ (పాట్స్) 10వ వార్షిక సమావేశానికి ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో చిన్న పిల్లల వైద్యనిపుణులు అందరూ ఒక చోట కలిసిన సమావేశానికి రావడం సంతోషంగా ఉందన్నారు. మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ముఖ్యంగా మహిళా డాక్టర్లపై జరుగుతున్న లైంగిక దాడులకు అడ్డుకట్ట వేయాలన్నారు. దీనిపై హెల్త్ కమిటీ మెంబర్‌గా ప్రత్యేక చట్టాలు రూపొందించే విధంగా పార్లమెంట్‌లో చర్చిస్తానని అన్నారు. అనంతరం కడియం కావ్యను శాలువాతో సత్కరించి మెమెంటో బహూకరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సభ్యులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకుంటాం

▸ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఈగ వెంకటేశ్వర్లు

కాశిబుగ్గ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల వివరాలు అందిస్తే వారి చదువుల కోసం ఆదుకుంటామని పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన, పదోన్నతులు పొందిన వారిని, ఉత్తమ ఉద్యోగులు, పద్మశాలి పాత్రికేయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ సంఘం పరిధిలో అన్ని రకాలుగా సేవలందించడానికి అందుబాటులో ఉంటామని చెప్పారు. ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలను జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రం వీరస్వామి కొనియాడారు. ఉద్యోగుల పనితీరును హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఏవో కుసుమ సత్యనారాయణ అభినందించారు. వంద మందిని కార్యక్రమంలో సన్మానించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శి ధర్మదేవ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, విద్యుత్ శాఖ సీజీఎం మధుసూదన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ వంగరి సూర్యనారాయణ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు

▸ తీర్చలేక యువకుడు ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

దుగ్గొండి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ వివిధ బ్యాంక్‌లలో క్రెడిట్ కార్డుల ద్వారా తీసుకున్న అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నాచినపల్లిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నాచినపల్లి గ్రామానికి చెందిన దార అనసూర్య - రాములు దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడైన దార ప్రసాద్ (38) డిగ్రీ వరకు చదివి ఏడేళ్ల నుంచి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ప్రసాద్ వివిధ బ్యాంక్‌లలో క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు పొందాడు. ప్రసాద్‌కు వివాహం కాలేదు. ఇటీవల దసరా పండుగకు స్వగ్రామమైన నాచినపల్లికి వచ్చాడు. క్రెడిట్ కార్డుల ద్వారా తీసుకున్న అప్పులు చెల్లించక పోవడంతో క్రెడిట్ కార్డులకు చెందిన బ్యాంక్‌ల వారు ప్రసాద్‌ను ఒత్తిడి చేసినట్లు ఎస్సై వెల్లడించారు. దీంతో ప్రసాద్ మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఊరి వేసుకున్నాడు. కొంతసేపటికి బంధువులు వచ్చి ఊరి వేసుకున్న ప్రసాద్‌ను కిందికి దింపగా చనిపోయి ఉన్నాడు. చనిపోయిన ప్రసాద్ దగ్గర వివిధ బ్యాంక్‌లకు చెందిన 10 క్రెడిట్ కార్డులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి రాములు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సీఎం ఆదేశిస్తే ఎమ్మెల్సీగా ఎన్నికల్లో పోటీ చేస్తా..



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశిస్తే వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తానని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండకు వచ్చిన ఆయనను హనుమకొండలోని జిల్లా అధ్యక్షురాలు కోలేపాక సంగీత ఇంట్లో ఆయనకు తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... జీవో నెంబరు 317తో ఇబ్బందులకు గురవుతున్న ఉపాధ్యాయులందరికీ మేలు చేస్తానన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సలహాదారు ఎం. సారయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్.రమేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం కోసం కృషి చేస్తా

▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

▸ సందడిగా ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం తరువాత అత్యంత అభివృద్ధిలో దూసుకుపోతున్న వరంగల్ నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుకాంత్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-23 క్రికెట్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వరంగల్ జిల్లా క్రికెట్ హైదరాబాద్ నగరానికి ధీటుగా ఉందని పేర్కొన్నారు. వరంగల్ నగరంలో త్వరలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ క్రీడామైదానం ఏర్పాటుకు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

కాగా, తొలి రోజు మహబూబాబాద్ - వరంగల్ జట్ల మధ్య జరిగిన పోరులో మహబూబాబాద్ జట్టు ఘన విజయం సాధించినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ముందుగా టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జిల్లా జట్టు నిర్ణీత 30 ఓవర్లకు గాను 29.3 ఓవర్లను ఎదుర్కొని 123 పరుగులు చేసి ఆలౌట్ అయింది. 124 పరుగుల లక్ష్య ఛేదనలో 30 ఓవర్లను ఎదుర్కొని 8 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసి 2 వికెట్ల తేడాతో మహబూబాబాద్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రఘురామ్, సభ్యులు ఉపేందర్, వెంకటేశ్వర్, రాము, కుమార్ పాల్గొన్నారు.

27న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

▸ నయీంనగర్ బ్రాంచ్ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్



మాట్లాడుతున్న ఇనిస్టిట్యూట్ చైర్మన్ వేణుగోపాల్


హనుమకొండ టౌన్, అక్టోబరు 20: ఈ నెల 27న నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్‌లో మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ చైర్మన్ వడ్లకొండ్ల వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఆదివారం నయీంనగర్‌లోని ఇనిస్టిట్యూట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షను మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ ప్రధాన కేంద్రమైన రాజస్థాన్ కోటా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 150 కోట్ల స్కాలర్‌షిప్, 2 కోట్ల ప్రైజ్ మనీ, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందివ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా మోషన్ వరంగల్ సెంటర్ నుంచి ఐదుగురికి ఉచిత విద్య మరో ఐదుగురికి విద్యార్థులకు ఫీజుల్లో 50 శాతం రాయితీతో పాటు రూ.18లక్షల స్కాలర్‌షిప్, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్లెట్, లక్ష రూపాయల విలువగల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, 10వ తరగతిలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోసైన్స్, మెంటల్ ఎబిలిటీ సిలబస్‌పై 31 ప్రశ్నలతో 124 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం నయీంనగర్ ఇనిస్టిట్యూట్‌లో గానీ, లేదా 9703000850, 51, 52 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, మోషన్ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి.మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనిగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాళ్లపల్లి రమేశ్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మండల రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు బ్రేక్

పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు

కాజీపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, దక్షిణ భారత దేశ రైల్వే మార్గాలను కలిపే కాజీపేట జంక్షన్, సికింద్రాబాద్ డివిజన్‌లోనే ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రయాణికుల రద్దీ కూడా ఎక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది అమృత్ భారత్ పథకంలో రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలని రూ.24.45 కోట్లతో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాది దాటినా పనులలో పురోగతి లేదు. మోడల్ స్టేషన్ బయట చిన్న, చిన్న గుంతలు తవ్వి ఇటుకలతో చిన్న గోడలు కట్టి వదిలివేశారు. అసంపూర్తి పనులతో రైల్వే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



కాజీపేట స్టేషన్‌లో అసంపూర్తిగా చేసి వదిలిన పనులు

అమృత్ భారత్ పథకంలో భాగంగా విమానాశ్రయం మాదిరిగా రైల్వే స్టేషన్‌ను ఆధునీకరిస్తారని రైల్వే ఉన్నతాధికారులు ఓ డాక్యుమెంటరీని సైతం విడుదల చేశారు. ప్రత్యేక లిఫ్టులు, అదిరిపోయే ఎంట్రన్స్, రెస్టరూంలు, టాయిలెట్స్, వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫారాల ఆధునీకరణ, పార్కింగ్, లాంటివి నిర్మిస్తామని ఉన్న భవనాలు కూల్చారు. అడపాదడపా చిన్న, చిన్న పనులు చేపట్టి వదిలేశారు. ఏడాది గడిచినా పనుల పురోగతి ఆశించినస్థాయిలో లేకపోవడంతో పలువిమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం 10 వేల మంది ప్రయాణికులు రాకపోకలు, 150 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. కాజీపేట నుంచి రైల్వేకు ప్రతీ రోజు సుమారు రూ.10లక్షల ఆదాయం వస్తోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు ఆశించిన స్థాయిలో జరగకపోవడానికి నిధుల లేమా... కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే కార్మికులు, రైల్వే ప్రయాణికులు కోరుకుంటున్నారు.

హక్కుల సాధనే లక్ష్యంగా మాలలు ఉద్యమించాలి

▸ దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర

▸ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి

హసన్‌పర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కుల సాధనే లక్ష్యంగా మాలలు ఉద్యమించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రగట్టుగుట్టలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా మాల, మాల ఉపకులాల, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లక్ష్మయ్యతో కలిసి బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీసే కుట్ర చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకు మాల, మాల ఉపకులాలు, ఉద్యోగ, రాజకీయ నాయకులు ఉద్యమించాలన్నారు. ఎస్సీ గణనను శాస్త్రీయం చేయాలని, ఎస్సీ రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 30 శాతానికి పెంచాలని, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్ అమలు చేయాలని దళితులకు 3 ఎకరాల భూమి ఇవ్వాలని, దళిత బంధును రూ.20 లక్షలకు పెంచాలని, 2014 నుంచి ఇప్పటి వరకు ఎస్సీలోని ఏ కులం ఏ రంగంలో అభివృద్ధి చెందిందో గణాంకాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళిత జనగర్జన సీడీని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఎం.ఎఫ్.గోపినాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల రవిందర్, సమతా సైనిక్ దళ్ జాతీయ కార్యదర్శి దింగబర్ కాంబ్లే, తెలంగాణ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు మామిడి నారాయణ, భీంవిషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల భాస్కర్‌తో పాటు మండల, జిల్లా నాయకులు, మాల, మాల ఉపకులాల బంధువులు, ఉద్యోగులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



దళిత జనగర్జన సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

న్యూస్ బాక్స్

నేటి నుంచి సహస్ర చండీ యాగం

వరంగల్ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిని కాంక్షిస్తూ ఈనెల 21 నుంచి 25 వరకు సహస్ర చండీ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు టి.వంశీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ అర్చకుడు శ్రీకాంత్ అడిగ ఆధ్వర్యంలో ఈ యాగం నిర్వహించనున్నారు. పోతన రోడ్డు రామన్నపేటలోని మణిదీప్ గార్డెన్‌లో సోమవారం కలశ స్థాపన, గణపతి హోమం, యోగిని హోమం చేయనున్నట్లు తెలిపారు. 25న మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమంలో 60 మంది అర్చకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

సంకటహర చతుర్థి వేడుకలు



గణపతికి అభిషేకం చేస్తున్న పూజారి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం పలు గణపతి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు రోడ్‌లోని దత్తక్షేత్రంలో మహాగణపతి హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. అలాగే గణపతి స్వామికి పంచామృతాలతో అర్చకుడు గోపీకృష్ణ శర్మ క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఎంజీఎం సెంటర్‌లోని శృంగేరి శంకర మఠం, భద్రకాళి, వాసవీ కన్యకా పరమేశ్వరి, రామన్నపేటలో రత్నగర్భ గణపతి దేవాలయాల్లో ఆదివారం అభిషేకాలు, పూజలు, ప్రసాద వితరణ జరిగాయి.

కాంగ్రెస్‌కు త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారు



ఖిలావరంగల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, బీఆర్ఎస్ నేతలు



కాజీపేట చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

▸ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలావరంగల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల జీవితాలతో ఆడుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చేప్పే రోజుల దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం ఖిలావరంగల్‌లోని అమరవీరుల స్థూపం వద్ద రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరానికి రూ.15వేలు ఇవ్వని కాంగ్రెస్‌కు రైతులు తగిన బుద్ధి చెబుతారన్నారు. రైతులకు రుణమాఫీ, మద్దతు ధర, రైతు బీమా, ఎరువులు ఇవ్వకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో వునాస, యాసంగి పంటలకు ఎకరానికి రూ.10,000 ఇచ్చామన్నారు. రైతుల గోస మంత్రి కొండా సురేఖకు కనిపించడంలేదు కానీ.. సినీఇండస్ట్రీ వారిగురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తూర్పు నియోజకవర్గంలోని రైతుల గురించి మంత్రి ఆలోచించాలన్నారు. లేకుంటే రైతులు, అన్నివర్గాల ప్రజలతో కలిసి పోరాడతామన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే నరేందర్ అమరవీరుల స్థూపం, అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, మార్కెట్ మాజీ చైర్మన్ టి.రమేష్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ హరిరమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న రేవంత్

కాజీపేట: సీఎం రేవంత్ రెడ్డి ప్రజావ్యతిరేక పాలనతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తాలో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ పేరుతో డ్రామాలాడుతోందన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, అందించారన్నారు. హామీల పేరుతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ఇప్పటికైనా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతులకు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నయాముద్దీన్, సుంచు కృష్ణ, దువ్వ కనకరాజు, గబ్బెట శ్రీనివాస్, ఎండీ అఫ్జల్, శిరుమల్ల దశరథం, బరిగెల వినయ్, బస్వ యాదగిరి, కోండ్ర శంకర్, గబ్బెట కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే అమలు చేయాలి

హసన్‌పర్తి: రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులు హసన్‌పర్తి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ మాజీ చైర్మెన్ కందుకూరి చంద్రమోహన్, బీఆర్ఎస్ నాయకులు నాగరాజు, భిక్షపతి, చేరాలు, శరత్, యుగందర్, రాకేష్, ప్రశాంత్‌రెడ్డి, జన్ను కిషన్, సాంబయ్య, రవి, ఎల్లస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ బియ్యం పంపిణీ

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల గోదాముల నుంచి రేషన్ డీలర్లకు బియ్యాన్ని పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు ఆ శాఖ డీఎం సంధ్యారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ నెల రేషన్ బియ్యాన్ని ఈ-పాస్ యంత్రం ద్వారా డీలర్ వేలిముద్రలు తీసుకున్న అనంతరమే రవాణా చేస్తున్నామన్నారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని స్పష్టం చేశారు. బియ్యం పంపిణీ ఆలస్యం చేసినా, తేడాలు ఉన్నా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వర్సిటీలో చెట్ల నరికివేతపై విచారణ

కేయూ క్యాంపస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అక్రమంగా చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. వర్సిటీ గ్రౌండ్‌లో కాంట్రాక్టర్ 50 చెట్ల నరికివేతకు వర్సిటీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొంది సుమారు 100కుపైగా చెట్లను నరికివేసినట్లు విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో చెట్ల నరికివేత వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాగా, వర్సిటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతుండటంతో గోడకు అడ్డంగా ఉన్న చెట్లను నరికివేసే పనిని వర్సిటీ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే కాంట్రాక్టర్ వర్సిటీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందిన చెట్ల కంటే అత్యధికంగా చెట్లను నరికివేయడం వర్సిటీలో ఫిర్యాదులందాయి. దీనిపై అటవీశాఖ అధికారులు స్పందించి వర్సిటీలో చెట్ల నరికివేతపై విచారణ చేపట్టారు. ఎన్ని చెట్ల నరికివేతకు అనుమతి పొందారు? ఎన్ని చెట్లను నరికివేశారు? వాల్టా చట్టం మేరకు నిబంధనలు ఎలా ఉల్లంఘించారనే విషయంపై విచారణ చేపట్టారు. వర్సిటీలో ఎక్కువ చెట్లను నరికివేసినట్లు నిర్ధారించారు. అయితే యూకలిప్టస్ చెట్లు, ఇతర చిన్న పనికిరాని చెట్లను కూడా నరికివేసి వాహనాల్లో తరలించినట్లు విద్యార్థులు ఆరోపించారు. అయితే 20 ఏళ్లుగా అదే కాంట్రాక్టరు పాత విధానంలో వర్సిటీ చెట్లను తొలగించి అమ్ముకుంటారని, దీనిపై ఎలాంటి వివాదం లేదని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఎక్కువ చెట్లను నరికివేసినట్లు విచారణలో తెలితే నిబంధల మేరకు అపరాధ రుసుం చెల్లించే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఐదు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. 2023 జులై నుంచి పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మనోజ్, అశోక్, మల్లికార్జున్, భిక్షపతి, వెంకటేశ్వర్లు, రమేష్, రాజు, కమలాకర్, సురేష్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో ఉజ్వల భవిష్యత్

ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు

మట్టెవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌తో నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. ఆదివారం వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని యూనిక్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఓపెన్ స్కూల్‌లో చేరిన విద్యార్థులకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌తో అన్ని ఉద్యోగాలు, ఉన్నత చదవులకు అవకాశం లభిస్తుందని చెప్పారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు అక్టోబరు 30 వరకు గడువు ఉందని యూనిక్ హైస్కూల్ ఏ-1 కోఆర్డినేటర్ సమీ ఉల్లా బేగ్ తెలిపారు. ఆసక్తి కల్గిన వారు 7396135390 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శంకర్‌రావు, ఉపాధ్యాయులు

మట్టెవాడ ఉన్నత పాఠశాలలో క్లాసులు షురూ

మట్టెవాడలోని ఉన్నత పాఠశాల ఏఐ స్టడీ సెంటర్ ఈ ఏడాది ఓపెన్ స్కూల్ ప్రత్యేక తరగతులను ఆదివారం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు, ఇంటర్ ఇన్‌చార్జి వి. శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఓపెన్ స్కూల్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ విజయ్‌బాబు, వి.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రవీందర్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ అధిక ప్రాధాన్యం ఇస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న అంతర కళాశాలల క్రీడా పోటీల్లో రెండోరోజు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగినచర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. మంచి క్రీడాకారులను తయారు చేసేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. కేయూ పరిధిలో క్రీడాకారుల తయారికి కావాల్సిన ప్రతిపాదనలు అధికారులు పంపిస్తే వాటిని పరిశీలించి అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయిస్తానన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీతో పాటు సర్టిఫికేట్లును అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి, కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ వెంకయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, ఇవి.శ్రీనివాస్, పీడీ భాస్కర్ పీఆర్వో ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో అతిథులు

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు

కాశిబుగ్గ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ 9వ అంతర్ జిల్లాల పోటీలు ఆదివారం ముగిశాయి. ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల జట్లు నిలిచాయి. పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ విజేత జట్లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. పోటీల నిర్వాహకులను గౌరవ అతిథి సీఐ రాఘవేందర్ అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియే షన్ అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, కార్యదర్శి అశోక్‌బాబు, నవీన్ కుమార్, జాయింట్ సెక్రటరీ శోభన్‌బాబు, కోశాధికారి ముఖర్జీ, డీఎస్‌వో సత్యవాణి, రాజేందర్, స్వప్న, భవాని, ఈశ్వర్, ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో సెల్‌ఫోన్లు చోరీ జరిగినట్లు వ్యాపారులు తెలిపారు. ఆదివారం ఇంతెజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బీహార్‌కు చెందిన బాలుడిని విచారణ చేశారు. ఆ బాలుడు చోరీ చేయలేదని అతడి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉన్నారని వారు రాగానే బాలుడిని వారికి అప్పగించనున్నట్లు సీఐ షుకూర్ తెలిపారు. సెల్‌ఫోన్ చోరీపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ఖిలావరంగల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ ఆదివారం రూ.7,000 ఆర్థికసాయం చేశారు. ఖిలావరంగల్ 38వ డివిజన్ ప్రాంతానికి చెందిన బాలెల్లి నాగరాజు అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ కార్యక్రమంలో బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్, 38వ డివిజన్ అధ్యక్షుడు అంకాల జనార్దన్, సుంకరి రాజు, రాళ్లబండి స్వర్ణ, తోటకూరి రాజేశ్వరి, రాళ్లబండి మున్నా, ఇనుముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలిన నాయకులు

కాజీపేట, అక్టోబరు 20: హసన్‌పర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళనానికి కాజీపేట నుంచి మాలలు భారీగా తరలివెళ్లారు. అంతకుముందు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని తెలంగాణ మాల మహానాడు కాజీపేట పట్టణ అధ్యక్షుడు మర్యాల కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కనుసన్నల్లోనే ఎస్సీ వర్గీకరణ జరుగుతోందన్నారు. రిజర్వేషన్‌ల పేర మాలలకు అన్యాయం చేస్తే ఊరుకోమన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు మాలలు గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, మాల మహానాడు నాయకులు పప్పుల గోవర్ధన్, కోండ్ర నర్సింగరావు, జి. కుమారస్వామి, కాందారి రాజమౌళి, ఈ.సత్యనారాయణ, కాలమల మహేందర్, పి. శంకర్, తండమల్ల వేణు, తోపాటు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మర్యాల కృష్ణ

విలువలున్న నిజమైన జర్నలిస్టు సుభాష్

▸ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

▸ భీమారంలో సంతాప సభ



మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హసన్‌పర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నిబద్ధతతో పనిచేసే విలువలున్న జర్నలిస్టు నాయకుడు సుభాష్‌గౌడ్ అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గ్రేటర్ 55వ డివిజన్ భీమారం ప్రాంతానికి చెందిన టీయూడబ్ల్యూజేహెచ్-143 హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా ఆదివారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్ అధ్యక్షతన సుభాష్‌గౌడ్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కడియం శ్రీహరి జర్నలిస్టు నాయకుడు సుభాష్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. సుభాష్‌గౌడ్ అంకితభావమున్న జర్నలిస్టు అని కొనియాడారు. భీమారంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేసేవాడన్నారు. కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, భీమారం వాసుల కోరిక మేరకు సుభాష్ పేరు మీద కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం ఎంపీ కోటా కింద రూ.20లక్షల మంజూరు చేయిస్తానని ప్రకటించారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ మాట్లాడుతూ.. సుభాష్ మరణం యూనియన్‌కు తీరని లోటన్నారు. జర్నలిస్టు వృత్తికి న్యాయం చేస్తూ ప్రజల సమస్యలపై పని చేశాడన్నారు. ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ తడక రాజ్‌నారాయణ మాట్లాడుతూ.. ముక్కుసూటిగా మాట్లాడే తత్వం కలిగిన సుభాష్‌ను కోల్పోవడం లోటన్నారు.

ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్, స్థానిక కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లుతో పాటు పలువురు జర్నలిస్టు నాయకులు సుభాష్‌గౌడ్‌తో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సుభాష్‌గౌడ్ లేని లోటు తీర్చలేనిదని, ఆయన కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్ వరంగల్ ప్రతినిధి నవీన్, యూనియన్ నాయకులు బీఆర్. లెనిన్, సీహెచ్.సుధాకర్, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, సుభాష్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమాజంలో కళల స్థానం మహోన్నతం

▸ వైభవంగా గుమ్మడి జనార్దన్ అమృతోత్సవం

▸ మీరా సంగీత వేడుకల్లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో కళల స్థానం మహోన్నతమైనదని, ప్రాచీన కళలను అంతరించిపోకుండా కాపాడుకోవల్సిన బాధ్యత సమాజంపై ఉందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఏబీవీపీ భవన్‌లో నిర్వహించిన మీరా సంగీత వేడుకలను, ప్రముఖ సీతార్ విద్వాంసుడు గుమ్మడి జనార్దన్ అమృతోత్సవ వేడుకలను వారు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. మీరా సంగీత మండలి అధ్యక్షుడు పింగిళి వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో కవులు, కళాకారులకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. కళలకు కాణాచి అయిన వరంగల్ నగరం ఎందరో కళాకారులకు పుట్టినిల్లు అని పేర్కొన్నారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా, ప్రముఖ సంగీత విద్వాంసుడిగా గుమ్మడి జనార్దన్ సంగీత సేవలను ఆయన కొనియాడారు. కవులు, కళాకారులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తానని స్పష్టం చేశారు.

పింగిళి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వరంగల్‌కు పండిత్ హరి ప్రసాద్ చౌరాస్యా లాంటి అనేక మంది ప్రముఖ సంగీత విద్వాంసులను రప్పించి కార్యక్రమాలను నిర్వహించుటలో మీరా సంగీత మండలి పాత్ర ఎంతో ప్రముఖమని కొనియాడారు. మూడు దశాబ్దాలుగా తమ సంగీత మండలి వైవిధ్య కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. సహృదయ అధ్యక్షుడు గిరిజ మనోహర్ బాబు, ప్రముఖ కళాకారుడు వనం లక్ష్మీకాంతరావు, భద్రకాళి ఆలయ చైర్మన్ భద్రకాళి శేషు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ రావు, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు నిర్వహించిన సంగీతోత్సవం ఆహుతులను అలరింపచేసింది. గుమ్మడి జనార్దన్‌ను ఘనంగా సత్కరించారు.



మీరా సంగీత వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

పోచమ్మమైదాన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వం స్వీకరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోపరేటీవ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని 13వ డివిజన్ ఎంహెచ్ నగర్‌లో ఆదివారం బీజేపీ శ్రేణులు సభ్యత్వ నమోదు చేశారు. ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్, డివిజన్ అధ్యక్షుడు జన్ను సుబ్రహ్మణ్యం, నాయకులు విప్ప సుధాకర్, గోకె వెంకటేష్, హరీష్, కిరణ్ పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వం అందజేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఎస్‌జీఎఫ్ఐ క్రీడా ఎంపికలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ క్రీడా ఎంపికలు ఎస్‌జీఎఫ్ఐ సెక్రెటరీ దస్రు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం హంటర్‌రోడ్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 14 సంవత్సరాల బాలబాలికలకు కోకో, 17ఏళ్ల బాలబాలికలకు తైక్వాండో ఎంపికలు నిర్వహించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ఐ ప్రతినిధులు

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

పోచమ్మమైదాన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సీకేఎం కళాశాల మైదానం నూతన కార్యవర్గం ఎన్నికైంది. దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో ఆదివారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ వాకర్స్ వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి, 303 ఏరియా గవర్నర్ పశ్చిమట్ల ఎల్లా గౌడ్, ఎలక్ట్ గవర్నర్ కూరాకుల భారతి, డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతం సాంరంగపాణి, ప్రధాన కార్యదర్శి తాటిపర్తి రఘునాథరావు, కోశాధికారి కడారి భద్రయ్య, గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, కంకల సదానందం, కానుగంటి అశోక్, సోల రవి, దేశబత్తుల రమేష్‌బాబు, గౌరవ సలహాదారులుగా గోనె సుదర్శన్‌రెడ్డి, చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, చింతం మధుసూదన్, అనంతుల కుమారస్వామి, లింగంపల్లి చందర్‌రావు, ఉపాధ్యక్షులు సూరం ప్రభాకర్‌రెడ్డి, ఎర్రం ప్రభాకర్, నూనె వేణు ప్రసాద్, గవ్వల జంపయ్య, సంయుక్త కార్యదర్శులు కొత్త నాగేష్, శ్రీరాముల యాదగిరి, పర్శబోయిన గజేందర్, పత్తిపాక శోభన్, తౌటి సమ్మయ్య, ఆర్గనైజర్లు కూరాకుల రాజు, చీర్ల నర్సింహారెడ్డి, జూలూరి చిరు, ఆడిటర్స్ బోడకుంట గణేష్, కుమ్మరి రాజు, నర్సింహాచారి, కొత్తవాడ రమేష్ ఎన్నికయ్యారు.



ఎన్నికైన ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



పోలీసు అమరవీరుల కుటుంబాన్ని కదిలించినా హృదయం ద్రవించే కన్నీటి గాథలే వినిపిస్తాయి. తల్లిగర్భంలో ఉండగానే తండ్రిని కోల్పోయిన వారు కొందరైతే.. ఊహ తెలియని వయసులోనే కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పిల్లలు మరెందరో.. పెళ్లయిన మూణ్ణాళ్లకే ఐదోతనాన్ని కోల్పోయిన అభాగ్య మహిళలు కొందరైతే.. భర్తను కోల్పోయి భార్య, తండ్రిని కోల్పోయి పిల్లలు జీవితాలను వెళ్లదీస్తున్నారు. కష్టాలను ఎదుర్కొంటూ, కన్నీళ్లను దిగమింగుతూ భర్త ఆశయాల కోసం, పిల్లల భవిష్యత్తు కోసం బతుకు బండిని ఎందరో మహిళలు లాక్కొస్తున్నారు. పోలీసు ఉద్యోగుల జీతాలు పెరుగుతున్నా అమరులైన పోలీసుల కుటుంబాలకు ఇస్తున్న జీతాల్లో మాత్రం ఏ మాత్రం మార్పు లేదు. వచ్చే వేతనం ఏమూలకు సరిపోక అమరుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

వీరులారా.. వందనం..

- శాంతి భద్రతల పరిరక్షణలో సమిధలు పోలీసులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 మంది అమరులు
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

హనుమకొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఈనెల 21 నుంచి 31 వరకు పదిరోజుల పాటు నేషనల్ యూనిట్ డేగా నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు కమిషనరేట్ పరిధిలో పలు కార్యక్రమాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ, సైక్లింగ్ పోటీలను, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోజు జరిగే కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబాలను ఆహ్వానించి స్మృతివనంలోని పోలీసు అమర వీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పిస్తారు. అమరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందచేస్తారు.

64 మంది అమరులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారు. కానిస్టేబుల్ స్థాయినుంచి డీఎస్పీ వరకు 59 మంది వరకు పోలీసులు, 5గురు హోంగార్డులు అమరులైనవారిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లు, మందుపాతరలలో వీరంతా అసువులు బాశారు. ప్రధానంగా 1996లో ములుగు జిల్లా జాకారం వద్ద జరిగిన మందు పాతరలో ఏడుగురు పోలీసులు బలయ్యారు. వారి కుటుంబాల్లో చీకట్లు అలముకున్నాయి. ఇంకా ఏటూరునాగారం, మంగపేట తదితర ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనలో పోలీసులు ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారు.

సంక్షేమ సంఘం

2005లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమ సంఘం ఏర్పడింది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంఘం ద్వారా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు. 2006లో కమిషనరేట్ కార్యాలయంలో సొంత కార్యాలయం ఏర్పాటైంది. నాటి ఎస్పీ స్టీఫెన్ రవీంద్ర ప్రోత్సాహంతో ఏర్పడిన పోలీసు అమరవీరుల సంక్షేమ సంఘం నేడు పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నది. పోలీసు అమరుల కుటుంబాలకు నీట్‌లో రెండు శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతో పోలీసు అమర వీరుల కుటుంబాల పిల్లలు మెడిసిన్ చదవడానికి అవకాశం ఏర్పడింది.

సంస్మరణ కార్యక్రమాలు

పోలీసు అమరవీరుల సంస్మరణను పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్, 31న ఫ్లాగ్ డే తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసు అమరుల కుటుంబాలకు బాసటగా నిలవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు.

- రక్తదాన శిబిరాలు : రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలో 21న, కాజీపేటలో 22న, వరంగల్‌లో 23న, మామునూరులో 24న పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో 25న, జనగామలో 26న, వర్ధన్నపేటలో 27న, స్టేషన్ ఘన్‌పూర్‌లో 28న, నర్సంపేటలో 29న, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తారు.
- వ్యాసరచన పోటీలు: 8వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు 'విచక్షణతో కూడిన సెల్ వినియోగం' అనే అంశంపై అలాగే డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న యువతీ యువకులకు 'తెలంగాణ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. ఉత్తమంగా రాసిన మూడు వ్యాసాలకు మూడు భాషల్లో జిల్లాల వారిగా బహుమతులు ప్రదానం చేస్తారు.
- ఫొటోగ్రఫీ పోటీలు: ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు కమ్యూనిటీ పోలీసింగ్, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవలతో పాటు ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు కిందటేడు 2022 అక్టోబర్ నుంచి ఈ యేడు 2023 అక్టోబర్ 24వ తేదీ మధ్యకాలంలో తీసిన మూడు ఫొటోలను పంపాల్సి ఉంటుంది.
- షార్ట్‌ఫిలిమ్స్: ఔత్సాహిక ఫొటో, వీడియోగ్రాఫర్లకు సైతం పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపేలా ఉండే ఈ మధ్య కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్‌చేసిన పెన్‌డ్రైవ్ 10 ఇంటు 8 సైజ్ ఫొటోలను వరంగల్ పోలీపు కమిషనరేట్ పీఆర్‌వోకు అందచేయాలి. ఈ పోటీలకు నావినేషన్లు పంపించే ఔత్సాహికులు, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాలు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందిచే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2023 అక్టోబరు నుంచి ఈ యేడు అక్టోబరు నెల వరకు తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లు మాత్రమే పంపించాల్సి ఉంటుంది.
- ఓపెన్ హౌస్ : పోలీసుల పనితీరుతో పాటు పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఆన్‌లైన్ ద్వారా పోలీసు ఓపెన్ హౌస్‌లను ఏర్పాటు చేస్తారు.
- ప్రత్యేక ప్రదర్శనలు: పోలీసు బ్యాండ్ ఆధ్వర్యంలో ట్రైసిటీ పరిధిలో వివిధ జంక్షన్లలో పోలీసు అమర వీరులను స్మరిస్తూ ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.
- కళాప్రదర్శనలు: వరంగల్ పోలీసు కమిషనరేట్ జాగృతి కళాబృందంలోని కళాకారులు వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

మా ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయాలి

సిలివేరు రమాదేవి, పోలీసు అమరుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షురాలు



పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఇప్పటికీ రెగ్యులరైజ్ కాకపోవడం సమస్యగా ఉంది. 67 మంది పోలీసుల అమరుల కుటుంబాలకు మడికొండ, గుండ్ల సింగారంలో 200 గజాల చొప్పున 2009లో నివేశన స్థలాలు ఇచ్చింది. ఇందులో అమరుల కుటుంబాలు ఇళ్లు కట్టుకున్నారు. అయితే ఈస్థలాలు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ కాలేదు. వాల్యుయేషన్ జరగలేదు. రెగ్యులరైజ్ కాలేదు. దీంతో అమరుల కుటుంబాల పిల్లల ఉన్నత చదువుల కోసం లేదా కుటుంబ అవసరాల కోసం ఈ ఇళ్లు, లేదా స్థలాలపై బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడానికి వీలుకావడం లేదు. రెగ్యులరైజ్ కానుందువల్ల బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. అమరులైన పోలీసుల కుటుంబాలకు వారి బ్యాచ్‌మేట్ అయిన ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడం లేదు. అమరులైననాటికి ఉన్న మూలవేతనాన్నే (బేసిక్) ఇప్పటికీ చెల్లిస్తున్నారు. దీనివల్ల అమరుల కుటుంబాలు చాలీచాలని ఈ వేతనంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను మాజీ సైనికులతో సమానంగా పరిగణించి మాజీ సైనికులకు వర్తించే అన్ని ప్రయోజనాలను అమలు చేయాలి, వారి పిల్లలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉన్నాం..



- స్వయం ఉపాధితోపాటు విద్య, ఉద్యోగాల కల్పనలో సహకరిస్తున్నాం..
- ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయిస్తున్నాం..
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాంతిభద్రతలను కాపాడే క్రమంలో, నక్సలిజాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. విధి నిర్వహణలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 61మంది పోలీసుల తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఈ క్రమంలో ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాలను కాపాడే బాధ్యతను పోలీసుశాఖ తీసుకుందని, వారి కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా చెబుతున్నారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం పురస్కరించుకుని ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో అనేక విషయాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: పోలీసు అమరవీరు సంస్మరణ దినోత్సవం ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు..?

సీపీ అంబర్ కిషోర్‌ఝా: 1959 అక్టోబరు 21న భారత్, టిబెట్ సరిహద్దులోని లడక్‌లో గల ఆక్సాయ్‌చిన్ వద్ద పది మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో మనదేశ సరిహద్దులోకి చొచ్చుకువచ్చారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు వారిని ఎదురించేందుకు చివరి రక్తపు బొట్టును ధారపోసి దేశం కోసం ప్రాణాలు వదిలారు. అప్పటి నుంచి ఏటా అక్టోబరు 21నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా పాటిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో ఎంతమంది అమరులయ్యారు? ప్రధాన సంఘటనలు ఏమి ఉన్నాయి..?

సీపీ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టులతో జరిగిన ప్రతిఘటనల్లో 56మంది పోలీసులు, ఐదుగురు హోంగార్డులు అమరులయ్యారు. వీరిలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 మంది పోలీసులు, ఒక హోంగార్డు ప్రాణాలను త్యాగం చేశారు. 1985లో కాజీపేట ఎస్ఐ యాదగిరిరెడ్డిపై అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు రైల్వేస్టేషన్ వద్ద కాల్పులు జరపటంతో మృతి చెందారు. వరంగల్ జిల్లాలో ఇదే తొలి దుర్ఘటన. పోలీసు కమిషనరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌కు యాదగిరిరెడ్డి పేరు పెట్టడంతో పాటు వారి కుటుంబానికి పోలీసులు, ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ములుగు జిల్లా జాకారం వద్ద జరిగిన మందుపాతర పేలుడులో ఏడుగురు పోలీసులు మృతి చెందారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సలైట్లతో జరిగిన పోరాటంలో 61మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు.

ఆంధ్రజ్యోతి : అమరవీరు కుటుంబాలకు ఏ విధంగా అండగా నిలుస్తున్నారు..?

సీపీ : మావోయిస్టులతో జరిగిన పోరాటంలో అసువులు బాసిన పోలీసుల అమరవీరులకు ప్రభుత్వం ప్రోత్సాహంతో అన్ని విధాలుగా అండగా ఉంటున్నాం. గతంలో వరంగల్ ఓఎస్‌డీగా పనిచేసిన సమయంలో స్వయంగా అమరవీరుల కుటుంబాలను ప్రతీనెల కలిశాను. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన వారు అనేక సమస్యలును ఎదుర్కొనేవారు. సాధ్యమైనంత వరకు పరిష్కార మార్గం చూపించాం. వరంగల్ రూరల్ ఎస్పీగా, ప్రస్తుతం వరంగల్ సీపీగా పనిచేసే అవకాశం వచ్చింది. దీంతో 30 ఏళ్ల కిందట ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోలీసుశాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. అమరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వటం, నివేశన స్థలాలు కూడా ఇచ్చాం. వారి పిల్లల చదువులకు సహకారాన్ని అందించాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులో ఒక శాతం రిజర్వేషన్‌ను తీసుకువచ్చాం. ఈ రిజర్వేషన్ కోటాలో పోలీసు అమరవీరుల పిల్లలు ఐదుగురు వరకు మెడికల్ సీట్లు పొందారు.. చాలామంది ఇంజనీరింగ్ పూర్తి చేశారు. పిల్లలు ఇతర ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. మరికొంత మందికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాం. ప్రజలకు ప్రాణాలను త్యాగం చేసిన ప్రతీ పోలీసు కుటుంబానికి అండగా పోలీసుశాఖ నిలుస్తోంది.

ఆంధ్రజ్యోతి: అమరవీరుల కుటుంబాలను ఆదుకునేందుకు ఏమైనా ప్రత్యేక సెల్ నిర్వహిస్తున్నారా..?

సీపీ : గతంలో మావోయిస్టుల ఉద్యమం వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఎక్కువగా ఉండేది. ఈ ప్రాంతంలోనే జరిగే ఎన్‌కౌంటర్‌లు, బ్లాస్టింగుల్లో చాలామంది పోలీసులు ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసేవారు. ఆ సమయంలో ఓఎస్‌డీలు ఎప్పటికప్పుడు అమరవీరుల కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సమీక్షించేవారు. ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. గతంలో వరంగల్ ఓఎస్‌డీగా పని చేసిన అనుభవం నాకుంది. ఇక్కడ ప్రతీ వారం, పదిహేను రోజులకోసారి అమరవీరుల కుటుంబాలను కలిసి సమస్యలు తెలుసుకునేవాళ్లం. ప్రస్తుతం నక్సలిజం లేదు. పైగా వరంగల్ కమిషనరేట్ కావటంతో ఓఎస్‌డీ పోస్టు లేదు. అయినప్పటికీ ఎప్పుడో 20-30 ఏళ్ల కిందట ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాలను యోగక్షేమాలు తెలుసుకుంటున్నాం. వారికి ఎలాంటి ఇబ్బంది వచ్చిన పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టుల కదిలికలు ఎలా ఉన్నాయి..?

సీపీ : తెలంగాణలో మావోయిస్టుల ఉనికే లేదు. కొద్దిగా భద్రాద్రి కొత్తగూడెం అటవీప్రాంతంలో కనిపించేంది. 2016లో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా పని చేసిన కాలంలో మావోయిస్టు సానుభూతిపరుల్లో మార్పుతీసుకు వచ్చాం. చాలామంది ప్రభుత్వానికి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రస్తుతం చత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టులు ఉనికి కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తెలంగాణ పోలీసులు దేశంలో బెస్ట్ పోలీసులు. గోదావరి దాటి మావోయిస్టులు రాష్ట్రంలో అడుగుపెట్టే అవకాశాలు లేవు. ప్రజలు అలాంటి వారికి ఎట్టి పరిస్థితుల్లో సహకరించవద్దు.

ఆంధ్రజ్యోతి: ఈ పది రోజులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు..?

సీపీ : అక్టోబరు 21వ తేదీ నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన జాతీయ సమైక్యతా దినోత్సవం 31వ తేదీ వరకు పోలీస్ కమిషనరేట్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రధానంగా పోలీసు కుటుంబాలకు హెల్త్ క్యాంపు ఇప్పటికే నిర్వహించాం. నేటి నుంచి రక్తదాన శిబిరాలు, ఛాయాచిత్రాల పోటీలు, షార్ట్ ఫిలిమ్ పోటీలు, విద్యార్థులకు వ్యాస రచన, పాటలు, నృత్యం తదితర పోటీలను నిర్వహిస్తున్నాం. అమరవీరుల సంస్మరణ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో పోలీసులతో పాటు ప్రజలను భాగస్వాములను చేస్తున్నాం. ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.



నాటి అమరుల గాథ

పోలీసు అమరవీరులను స్మరించుకునే రోజుకు మహోన్నత చరిత్ర ఉంది. 1959 అక్టోబర్ 21 భారత్ - టిబెట్ సరిహద్దుల్లోని లడక్‌లో గల అక్సాయ్‌చిన్ వద్ద భారత్‌కు చెందిన కేంద్ర రిజర్వు పోలీసులు (సీఆర్‌పీఎఫ్) రక్షణగా ఉన్నారు. విపరీతమై చలిలో 10 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా చైనా సైనికులు భారీ సంఖ్యలో మన దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చారు. వారిని ఈ పది మంది పోలీసులు ధైర్యంగా ఎదరించారు. చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి దేశం కోసం అసువులు బాశారు. భారత దేశ రక్షణ కోసం పోలీసులు ప్రాణాలు వదిలిన తొలి సందర్భమది. ఇందుకుగాను అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు 1960 జనవరి 9న సమావేశమయ్యారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తీర్మానించారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. అమర పోలీసుల త్యాగాన్ని స్మరించుకొని వారి కుటుంబాలకు సానుభూతిని, సహకారాన్ని ప్రకటించి వారికి ఘనమైన నివాళులర్పిస్తున్నారు.



చరిత్రకు సాక్ష్యాలు ఈ వృక్షాలు..

మూడు తరాల జ్ఞాపకాలకు వారధిగా నిలుస్తున్న వైనం

ఆ మూడు వేప చెట్లే అడ్డా..

దామెర గ్రామంలో ప్రజాదర్బార్, పంచాయితీలకు కేంద్రం

ఎల్కతుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రజాకార్ల కాలంలో రచ్చబండ నిర్వహణ కోసం రెడ్డి దొరలు నాటిన మొక్కలు.. నేడు భారీ వృక్షాలై గ్రామ కూడలిలో దర్శనమిస్తున్నాయి. రజాకార్ల రచ్చబండ పంచాయితీలు, నక్సలైట్ల కాలంలో ప్రజా దర్బార్‌లుగా, నేడు పంచాయితీలకు, ప్రజా సమావేశాలకు నిలయంగా మారాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో సుమారు 150 యేళ్ల కిందట చింతలపాణి వెంకటరాంరెడ్డి అనే రెడ్డి దొర నాటిన నాలుగు వేప మొక్కల్లో మూడు పెద్ద పెరిగి భారీ వృక్షాలుగా మారి గ్రామానికే తలమానికంగా నిలిచాయి.

రచ్చబండగా..

రజాకార్ల హయాంలో ఆ గ్రామానికి చెందిన రెడ్డి దొర చింతలపాణి వెంకటరాంరెడ్డి గ్రామంలో సమస్యల పరిష్కారానికి వేదిక కోసం తన ఇంటి ఆవరణలో నాలుగు వేప మొక్కలు నాటినట్లు గ్రామస్థులు తెలిపారు. అందులో మూడు వేప చెట్లు భారీ వృక్షాలుగా పెరిగి నేటికి దర్శనమిస్తున్నాయి. నాడు రజాకార్లతో పాటుగా రెడ్డి దొరలు పంచాయితీల నిర్వహణను ఈ వేప చెట్ల కిందనే రచ్చబండ వేదికగా నిర్వహించే వారని చెపుతున్నారు.

ప్రజా దర్బార్‌కు వేదికగా..

20 ఏళ్ల కిందట దామెర గ్రామంలో అడుగుపెట్టాలంటే పోలీసులకు, అటు ప్రజాప్రతినిధులకు సవాలుగా ఉండేది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా దామెరకు పెట్టింది పేరు. ఆ పార్టీలో కేంద్ర, రాష్ట్ర కమిటీలకు చెందిన ప్రముఖులకు నిలయంగా నిలిచింది. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా గ్రామకూడలిలో ఉన్న ఆ వేప చెట్ల కిందనే ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేవారని చెబుతున్నారు. చెట్ల కింద ఎన్ని విపత్తులు, దాడులు జరిగినా వేపచెట్లకు మాత్రం ఎవరూ ఎలాంటి హాని తపపెట్టలేదు. దీంతో చెట్లు ఏపుగా పెరిగి విశాలంగా విస్తరించాయి.

ఏ కార్యం చేపట్టినా ఈ చెట్ల కిందనే..

గ్రామంలో ఏ కార్యక్రమం చేపట్టినా ఈ చెట్ల కింద నుంచే ప్రారంభిస్తారు. ప్రభుత్వ కార్యకలాపాలు, గ్రామ సమావేశాలే కాకుండా చివరకు వివాహాల్లో వరుడికి విడిదిగా కూడా ఈ చెట్లనే వాడుకుంటారు. ఇక వేసవి కాలంలో ఇళ్లల్లో కన్న ఎక్కువగా ఈ చెట్ల కిందనే గ్రామస్థులు ఎక్కువగా సేదతీరుతారు. కులమతాలకతీతంగా ఉగాది పర్వదినం రోజున ఎక్కడాలేని విధంగా ఫకీర్ షా వలి జాతర జరుపుకోవడం అక్కడి ప్రసిద్ధి. ఆ రోజు గ్రామస్థులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఈ చెట్ల నీడన సేదతీరాకే జాతరకు వెళతారు. అనంతరం చెట్ల కింద నిర్వహించే పంచాంగ శ్రావణాన్ని వినడానికి వేలల్లో చేరుకుంటారు. దసరా రోజున దుర్గమ్మ పూజ సైతం ఒక్కడే నిర్వహిస్తారు. రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని వచ్చి మధ్యాహ్నం వేళ ఈ చెట్ల నీడన సేదతీరుతారు. ఎలాంటి టెంట్లు వేయకుండా ఒకేసారి 1000 మంది ఈ చెట్ల కింద ఆశ్రయం పొందవచ్చని స్థానికులు చెబుతున్నారు.

రోజుకోసారైనా చెట్ల కిందకు వస్తా..

మద్దె చిన్న రాజమౌళి గ్రామస్థుడు, దామెర




నా చిన్న వయస్సు నుంచి రోజుకు ఒక్కసారైనా వేప చెట్ల కిందకు వచ్చి వెళతా.. వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం వచ్చిన తరువాత ఇంటి దగ్గర కన్నా ఈ చెట్ల కిందనే ఎక్కువగా ఉంటా. ఈ ఊరి రెడ్డి దొర నాటి చెట్లు నేటికి పచ్చగా ఉన్నాయి. చల్లటి గాలి ఈ చెట్ల కింద లభిస్తుంది.

మూడు వేప చెట్లు ఆదర్శం

మంతుర్తి కొమురయ్య, దామెర



వాతావరణంలో కాలుష్య నివారణకు నాటి పెద్దలు నాటిన మొక్కలు నేడు మహావృక్షంగా దర్శనమిస్తున్నాయి. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడంవల్ల ముందుతరాలకు అవి దోహదపడుతాయని చెప్పుకోవడానికి ఇవి నిదర్శనం. ఈ వేపచెట్లు కాలుష్యాన్ని నివారించడంతో పాటు చల్లని గాలిని అందిస్తున్నాయి. ఈ వేపచెట్ల చరిత్రను నేటి విద్యార్థులకు వివరించి వాటి వల్ల కలిగే ఉపయోగాలను పట్ల వారిని చైతన్య వంతులను చేయాలి.



కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొన్ని చెట్లు 60, 70ఏళ్లు బతకడం చూస్తుంటాం. కానీ ఇక్కడ మాత్రం వందేళ్లకుపైగా నిటారుగా నిలబడి పలువురిని ఆశ్చర్యచకితులను చేస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దామెరకుంట ప్రాథమిక పాఠశాల, వైద్య, ఆరోగ్యశాఖ సబ్ సెంటర్ ఆవరణలో సుమారు 120ఏళ్ల నాటి చింతచెట్టు భారీ కాండంతో ఉండటం విశేషం. చెట్టు కాండం చుట్టుకొలత సుమారు 25ఫీట్లకు పైగా ఉండటం గమనార్హం. ఆరుగురు వ్యక్తులు ఒకరిచేతులు ఒకరుపట్టుకుని చెట్టును అలుముకున్నా పూర్తిగా చేతులు అందకపోవడం సంభ్రమాశ్చర్యం కలిగిస్తోంది. గ్రామం మధ్యలో ఉన్న చింత చెట్టు ప్రజలకు నీడనివ్వడమే కాకుండా మాట ముచ్చట్లకు వేదికగా, పిల్లలు, గృహిణులకు అందించి బహుళ ప్రయోజనకారిగా ఉంటూ పలుతరాల జ్ఞాపకాలకు ఆనవాలుగా ఉంది. గ్రామానికి చెందిన నక్కయ్య అనే 98ఏళ్ల పెద్దమనిషి తాను 10ఏళ్ల పిల్లాడిగా ఉన్నప్పుడేఈ చింతచెట్టు వృక్షంగా ఉండేదని తన జ్ఞాపకాలను పంచుకున్నాడు.

ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు తన జీవితకాలంలో ఏదో ఒక సమయంలో భర్త చేతిలో శారీరక, మానసిక, లైంగిక హింసకు గురవుతున్నారు. చాలా మంది మహిళలు తమపట్ల అమానుషాన్ని బయటకు చెప్పడం లేదు. అందులో 14 శాతం మంది మహిళలు మాత్రమే హింసను అరికట్టేందుకు సహాయం కోరుతూ బయటకు వస్తున్నారు. గృహహింసను ఎదుర్కొన్న మహిళలకు బాసటగా నిలుస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపేందుకు ప్రయత్నిస్తున్నారు **డా.ప్రసన్న గెట్టు**. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్ అనే సంస్థను స్థాపించి గృహహింసను రూపుమాపేందుకు కృషిచేస్తున్నారు.



ఆ మహిళల జీవితాల్లో వెలుగు కోసం...

పద్దెనిమిది నుంచి ముప్పైతొమ్మిదేళ్ల మధ్య వయస్సున్న పెళ్లయిన ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు గృహహింసను ఎదుర్కొంటున్నట్టు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు, గృహహింస బారినపడిన మహిళలకు ఆసరాగా నిలిచేందుకు కృషిచేస్తున్నారు డా.ప్రసన్న గెట్టు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్ అనే సంస్థ ద్వారా ఆమె సేవలందిస్తున్నారు. క్రిమినాలజిస్టుగా, విక్టిమాలజిస్టుగా మహిళల కోసం అవిశ్రాంత కృషి చేస్తున్నారామె. 2001లో మహిళల రక్షణ కోసం ఆమె ఈ సంస్థను స్థాపించారు. "మద్రాసు యూనివర్సిటీలో క్రిమినాలజీ డిపార్టుమెంటులో పీహెచ్‌డీ చేశాను. ఆ తరువాత జపాన్‌లోని టోకివా యూనివర్సి



టీలో పోస్ట్ డాక్టరేట్ డిప్లొమా ఇన్ విక్టిమాలజీ కోర్సు పూర్తి చేశాను. దీన్ని వరల్డ్ సొసైటీ ఆఫ్ విక్టిమాలజీ నిర్వహించింది. మొదటి బ్యాచులో నాతోపాటు మరో ఇద్దరు భారతీయులు ఉన్నారు. కోర్సులో భాగంగా మేం విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్స్‌ను సందర్శించాం. అది నాకు చాలా ఆసక్తిని కలిగించింది. ఇండియాకు తిరిగొచ్చాక ప్రయోగాత్మకంగా చెన్నైలో విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్‌ను ప్రారంభించాం. మా దగ్గరకు వచ్చిన కేసులన్నీ గృహహింసకు సంబంధించినవే. ఆ సమయంలో గృహహింసను ఎదుర్కొన్న మహిళలకు ఆశ్రయం ఇచ్చేందుకు ఎక్కడా కూడా షెల్టర్ హోమ్స్, కమ్యునిటీ షెల్టర్స్ గానీ లేవు. అది గమనించిన మేం మా సేవలను ప్రారంభించాం. అమెరికాకు వెళ్లి అధ్యయనం చేశాం. షెల్టర్ హోమ్స్‌లో బస చేసి అవి ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకున్నాం. శిక్షణ తీసుకున్నాం. ఆ తరువాతే హెల్ప్ లైన్ సెంటర్, షెల్టర్ సర్వీస్ ప్రారంభించాం" అని సంస్థను ప్రారంభించిన తీరును వివరిస్తారు డా. ప్రసన్న గెట్టు. ఏ రకమైన హింసను ఎదుర్కొంటున్న మహిళలైనా సరే ఈ సంస్థ సేవలను పొందవచ్చు. 23 ఏళ్ల క్రితం ప్రారంభమైన హెల్ప్‌లైన్, ఇప్పుడు 'ధ్వని' పేరుతో నేషనల్ డొమెస్టిక్ వయొలెన్స్ హాట్‌లైన్‌గా మారి సేవలందిస్తోంది. "మహిళలు, వారి బంధువులు, స్నేహితులు ఎవరైనాసరే 24/7 కాల్ చేసి వారి సమస్యలు చెప్పుకోవచ్చు. వారు చెప్పేది పూర్తి గోప్యంగా ఉంచుతాం. వారు మాతో స్వేచ్ఛగా సమస్యల గురించి చెప్పుకునే వాతావరణాన్ని కల్పిస్తాం. ఆ తరువాత కౌన్సెలింగ్ ఇస్తాం. వాళ్లను హింసకు గురి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో వివరిస్తాం" అని అంటారు డా.గెట్టు.


అందరి బాధ్యత...

ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్ సంస్థ ఎమర్జెన్సీ షెల్టర్, లాంగ్ టర్మ్ షెల్టర్, ట్రాన్సిషన్ షెల్టర్ పేరుతో మూడు రకాల ఆశ్రయాలను అందిస్తోంది. "గృహహింస మహిళలకు సంబంధించిన సమస్యగానే చూడకూడదు. పురుషులు కూడా ఈ సమస్యపై మాట్లాడాలి. కంపెనీలు, ఇనిస్టిట్యూషన్లు బాధ్యత తీసుకోవాలి. ఇందులో దాచాల్సింది ఏమీ లేదు. అందరిపై బాధ్యత ఉంది. గృహహింస బారినపడిన ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే వాళ్లు ఒంటరి వాళ్లు కాదు. మంచి జీవితం గడిపేందుకు వాళ్లకూ అవకాశం ఉంది. వాళ్లకు సహాయసహకారాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి" అని భరోసా ఇస్తారు డా.గెట్టు. గృహహింసకు ఎలాంటి సరిహద్దులు లేవు. బీద, ధనిక తారతమ్యాలు లేవు. మనం ప్రేమించాల్సిన వ్యక్తులు చేస్తున్న హింస గురించి మాట్లాడుతున్నాం. గృహహింసను రూపుమాపేందుకు కొన్ని అంశాలను పాటించాలని ఆమె అంటున్నారు. "ప్రతి కుటుంబం బాధ్యత తీసుకోవాలి. పిల్లల ముందు తల్లిదండ్రులు వాదించుకోవడం ఆపేయాలి. లేదంటే ఈ హింస కొనసాగుతూనే ఉంటుంది.
ఆ చక్రాన్ని బ్రేక్ చేయాల్సిన అవసరం ఉంది. అలాగే పాఠశాల విద్యలో గృహహింస గురించి చెప్పాలి. పిల్లలను ఎడ్యుకేట్ చేయాలి. గృహహింసను సాధారణ నేరంగా పరిగణించకుండా వెంటనే చర్యలు తీసుకునేలా మార్పులు చేయాలి. గృహహింస జరిగినప్పుడు చుట్టుపక్కల వాళ్లు మాకెందుకు అని వదిలేయకుండా స్పందించాలి" అని అంటారు డా.గెట్టు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే గృహహింస కనుమరుగవుతుంది అనడంలో సందేహం లేదు.

ఇల్లు చిన్నదైనా వస్తువులను క్రమపద్ధతిలో అమర్చుకుంటే విశాలంగా కనిపిస్తుంది. అనవసరమైన వస్తువులకు చోటివ్వకుండా కాస్త ఓపికతో సర్దుకుంటే చాలు. గది చిన్నగా ఉన్నా విశాలంగా కనిపించేలా చేసుకోవచ్చు. ఇల్లు విశాలంగా కనిపించాలంటే నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి.

విశాలంగా కనిపించాలంటే!

- ఇంటి గోడలకు ముదురు రంగులు కాకుండా తెలుపు, బేబీ పింక్, కాపర్ పింక్ వంటి లేత రంగులు వేస్తే గదులు విశాలంగా కనిపిస్తాయి.
- కర్టెన్స్ వాడడం వల్ల ఇల్లు చిన్నదిగా కనిపిస్తుంది. అవసరమైనంత వరకు లేత రంగులో ఉండే పలుచని కర్టెన్లను కిటికీలకు, గుమ్మం ముందు వేసుకోవచ్చు. ప్రతి గదికీ కర్టెన్ వేయకూడదు. వీలైనంత వరకు కిటికీలు తెరచి ఉంచాలి. సూర్యరశ్మి లోపల పడితే గది ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఇంట్లో అద్దాలు పెట్టడం వల్ల కూడా కాంతి పరావర్తనం చెంది ఇల్లు పెద్దగా కనిపిస్తుంది.
- ఇంట్లో మనకి పనికిరాని వస్తువులు చాలా వచ్చి చేరుతుంటాయి. వాటన్నింటినీ అవసరమైనవారికి ఇచ్చేస్తే చాలా స్పేస్ కలసి వస్తుంది.
- ఇంటి పరిమాణాన్ని అనుసరించి ఫర్నిచర్ ఏర్పాటు చేసుకోవాలి. వివిధ రకాలుగా ఉపయోగించుకొనే మల్టీపర్పస్ ఫర్నిచర్‌ను ఎంచుకోవాలి. హాల్ చిన్నగా ఉన్నప్పుడు పెద్ద సోఫాలకు బదులు ఫోల్డింగ్ బెడ్ కొనుక్కోవచ్చు. ఇది సోఫాలా, బెడ్ మాదిరిగా కూడా ఉపయోగపడుతుంది.
- హాల్లో కానీ, బెడ్ రూమ్‌లో కానీ షెల్ఫ్‌లను సామాన్లతో నింపేయకూడదు. అవసరమైనవాటిని మాత్రమే అందంగా సర్దుకోవాలి. పిల్లలు ఆడుకొనే బొమ్మలు, ఫొటోఫ్రేమ్‌లు, టెడ్డీబేర్స్, గాజు సామాన్లు, పింగాణి వస్తువులను చక్కగా అమరిస్తే చూసేందుకు ఆకర్షణీయంగా, విశాలంగా కనిపిస్తుంది.



శాస్త్రీయ నృత్యానికి సామాజిక గాథలను మేళవించి జన రంజకమైన రూపకాలను రూపొందించడంలో నిష్ణాతురాలు ప్రఖ్యాత నాట్యాచారిణి **అలేఖ్య పుంజాల**. ఆమె ప్రదర్శించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు 'చాకలి ఐలమ్మ నృత్యరూపకం' ఎంతోమంది కళాభిమానుల నీరాజనాలు అందుకుంది. ఒకవైపు నృత్య ప్రదర్శనలు, మరోవైపు తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలిగా బాధ్యతలు, ఇంకోవైపు నృత్య శిక్షణతో భిన్న పాత్రలు పోషిస్తున్న అలేఖ్య నృత్య రూపకల్పన అనుభవాలను 'నవ్య'తో చెబుతున్నారిలా..!



అది నాకు దక్కిన అదృష్టం

"తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు... ఇది నాకు దక్కిన హోదా లేదా పదవి కాదు, కేవలం బాధ్యత మాత్రమే. ఈ కుర్చీలో కూర్చున్నప్పుడు పదిమందికి మంచి చేయాలి. మనం చేసే పని మిగతా వారిలా కాకుండా, ఒక కళాకారిణిగా భిన్నంగా నిర్వర్తించాలి. కళలకు, కళాకారులకు చేయూత అందించాలి. తద్వారా నేను స్వీకరించిన ఈ బాధ్యతకు సార్థకత చేకూర్చడమే నా కర్తవ్యం. ఈ మధ్య కాలంలో నాకు వృత్తిరీత్యా అత్యంత సంతృప్తి కలిగించింది 'చాకలి ఐలమ్మ' నృత్య రూపకాన్ని రూపొందించడం. ఇప్పటివరకు పురాణ ఇతిహాసాలలోని మండోదరి, దుస్సల, నాయకి, ద్రౌపది, సత్యభామ లాంటి ఎన్నో స్వాభిమానానికి ప్రతీకలైన పాత్రల్లో అభినయించాను. లకుమ, రుద్రమ తదితర చారిత్రక పాత్రలు ఇతివృత్తంగా సాగిన రూపకాలు ప్రదర్శించాను. అలాంటిది వాటన్నింటికన్నా భిన్నంగా మొట్టమొదటిసారిగా సాంఘిక నేపథ్యం కలిగిన ఓ వీరోచిత మహిళ పాత్రను ఎంచుకొన్నాను. అది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు 'చాకలి ఐలమ్మ' గాథ. ఆ ధీర జీవితాన్ని నృత్య రూపకంగా ప్రదర్శించడం నాకు దక్కిన అదృష్టం. రవీంద్రభారతి వేదికగా 45నిమిషాలకుపైగా ప్రదర్శితమైన ఈ రూపకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో పాటు ఇతర మంత్రులు కూడా ఆద్యంతం తిలకించడం నాకు గొప్ప విషయం. 'ఎంతో నిబద్ధత, కృషి ఉంటేకానీ ఇలాంటి ఒక నృత్య రూపకాన్ని ప్రదర్శించడం సాధ్యం కాదు" అని ఎంతోమంది ప్రశంసించారు.

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా...

నాకు ఈ నృత్య రూపకం చేయాలన్న ఆలోచన రావడానికి ప్రధాన కారణం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు. "తెలంగాణలో భూపోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ గారి జీవితం మీద నృత్యరూపకం చేయచ్చు కదా" అని ఒక సందర్భంలో ఆయన నాకు సూచించారు. యాభై ఏళ్ళ నా నృత్య జీవితంలో ఇప్పటి వరకు నేను ఆత్మస్థైర్యం, స్వాభిమానం కలిగిన ఎన్నో మహిళల పాత్రలు పోషించాను. కానీ సాంఘిక పాత్ర ఒక్కటి కూడా చేయలేదు. మలిదశ తెలంగాణ ఉద్యమం సమయంలో ఐలమ్మ ధైర్యసాహసాల గురించి విన్నాను. కనుక ఆ మహనీయురాలి జీవితగాథ మీద ఒక వైబ్రెంట్ ప్రొడక్షన్ చేయాలి అని నిర్ణయించుకున్నాను. ఐలమ్మ జీవితంమీద అధ్యయనం ప్రారంభించాను. మొదటగా ఆ వీరనారి జీవితంమీద వచ్చిన పుస్తకాలు చదివాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై పరిశోధన చేసిన కొంతమంది విద్యార్థులతో సంభాషించాను. ప్రముఖ రచయిత వడ్డేపల్లి కృష్ణ గారిని సంప్రదించి, రూపకాన్ని రాసివ్వాల్సిందిగా కోరగానే అందుకు ఆయన అంగీకరించారు. ముఖ్యంగా గ్రాంథిక భాష వాడకుండా, అలా అని మరీ పలుచన కాకుండా సమకాలీన తెలంగాణ భాష, సంస్కృతులను ఎత్తిపట్టేలా రూపకాన్ని ప్రేక్షకులకు అందించాలన్నది నా అభిమతం. అనుకున్నట్టుగానే నా ఆలోచనలకు తగ్గట్టుగా స్క్రిప్ట్ వచ్చింది. వాస్తవానికి కాస్త భిన్నంగా కథకు మరింత బలాన్ని చేకూర్చడానికి బతుకమ్మ, బోనాలు ఉత్సవాలను జోడించాం. తెలంగాణ పల్లె వాతావరణాన్ని, ఆనాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా రూపకాన్ని తీర్చిదిద్దాం.

> "చాకలి ఐలమ్మ నృత్యరూపకాన్ని రూపొందిస్తున్న సమయంలో నాకు ఆ వీరనారి వారసులు పాలకుర్తిలో ఉన్నారన్న విషయం తెలిసింది. ఆ వెంటనే వారిని కార్యక్రమానికి ఆహ్వానించాం. అలా ఐలమ్మ గారి మునిమనుమడి భార్య శ్వేత ఐలమ్మ మా కార్యక్రమానికి రావడం, అదే వేదికపై ఆమెను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా సీఎం ప్రకటించడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. నా కార్యక్రమం ద్వారా ఆ కుటుంబం వెలుగులోకి రావడం, వారికి ప్రభుత్వం నుంచి సముచిత గౌరవం లభించడం నాకూ గర్వకారణమే కదా.! పైగా అదే వేదికపై నేను చదివిన ఆనాటి కోఠి మహిళా కళాశాల, ఈనాటి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడం... అలా ఆ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయింది. అందులో నేను భాగం కావడం నా అదృష్టం."

మరెన్నో ప్రయోగాలు చేయాలనుంది...

నాట్య శాస్త్రంలో లోకధర్మి, నాట్యధర్మి అని ఉంటాయి. మరీ ముఖ్యంగా ఈ రూపకాన్ని లోకధర్మిని అనుసరిస్తూ ప్రదర్శించాను.



మా మామయ్య శివశంకర్ గారి అమ్మ సత్తెమ్మ నోట రజాకార్ల ఆగడాల గురించి గతంలో ఎన్నోసార్లు విన్నాను. పాటల రూపంలో గాథల రూపంలో నిజాం కాలం నాటి పరిస్థితులను ఆమె మాకు చెబుతుండేవారు. సత్తెమ్మ అమ్మమ్మ చనిపోయి చాలాకాలం అవుతున్నా, ఆమె మాటలు, రూపం నా మనోఫలకంమీద అలాగే ఉండిపోయాయి. కనుక ఈ రూపకానికి ఆహార్యం, వస్త్రధారణ ఎలా ఉండాలి అన్నవిషయంపై నాకంటూ ఒక అవగాహన మొదటి నుంచి ఉంది. ఇదివరకటి నా పాత్రలకు భిన్నంగా పాత్రకు తగినట్టుగా నేత చీర కట్టు, బొట్టు, దండ కడియాలు లాంటి వాటితో చాలా సాధారణమైన ఆహార్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాను. ఆ సహజత్వమే నాకు చాలామంచి పేరు తెచ్చింది. దీన్ని ఒక శాస్త్రీయ నృత్యరూపకంగా నేను ఎక్కడా చెప్పలేదు. నా నాట్యానుభవాన్ని జోడించి మొత్తంగా జానపద శైలిలో ప్రదర్శించాను. ఐలమ్మ లాంటి మరెంతో మంది పోరాట యోధురాళ్ల జీవితాలు ఆధారంగా ఇలాంటి ప్రయోగాత్మక నృత్యరూపకాలు మరెన్నో చేయాలి అనుకుంటున్నాను.

తెలంగాణ అస్తిత్వాన్ని మరింత చాటేలా...

జానపద కళలకు ఆలవాలం తెలంగాణ రాష్ట్రం. ఇక్కడ కళాకారుల సంఖ్య తక్కువేమీ లేదు. అయితే దురదృష్టవశాత్తు కొన్ని కళారూపాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మరికొన్ని కళారూపాలను నేర్చుకొనే వారు లేక, ప్రదర్శించే వారూ లేక ఒక దయనీయ స్థితి మన కళ్లముందు కనిపిస్తోంది. అలాంటి కళలను గుర్తించి, వాటిని ప్రోత్సహించడమే తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలిగా నా ముందున్న కర్తవ్యం. కనుమరుగవుతున్న కళారూపాలకు ఒక సపోర్టు సిస్టం నెలకొల్పాలి. దాంతో పాటు వాటిని ప్రమోట్ చేయడం కోసం పండుగలు, ప్రత్యేక సందర్భాలలో నిరంతరం ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లాంటి వినూత్న కార్యక్రమాలు రూపకల్పన చేయాలన్నది నా ఆలోచన. అరుదైన కళారూపాలు కొత్తతరం నేర్చుకొనేలా శిక్షణా శిబిరాలు నిర్వహించడం, కళాకారులకు ఉపకారవేతనాలు అందించడం లాంటి పనులు కూడా నా దృష్టిలో ఉన్నాయి. తద్వారా మన కళలు, సంస్కృతిని బతికించుకోవడంతో పాటు తెలంగాణ అస్తిత్వాన్ని మరింతగా చాటాలన్నది నా కోరిక. అందుకు నా సాయశక్తులా ప్రయత్నిస్తాను.

• కేవీ



ముప్పై అయిదేళ్ళ వయసులో సోకిన అరుదైన వ్యాధితో కంటిచూపు శాశ్వతంగా పోయినా... **భూమిక సుదర్శన్** ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. సవాళ్ళన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. యూట్యూబ్ వీడియోల్లో తన వంట నైపుణ్యాలను పరిచయం చేస్తూ, ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు.

చూపులేకపోయినా... వండి చూపిస్తున్నారు!

ఎవరైనా "మీ వంట చాలా రుచిగా ఉంది" అని చెబితే... "కంటికి ఇంపుగా కనిపిస్తోందా?" అని వెంటనే అడుగుతారు భూమిక సుదర్శన్. ఎందుకంటే వాటిని ఆమె చూడలేరు. చిన్న తలనొప్పితో ప్రారంభమైన అరుదైన వ్యాధి 35 ఏళ్ళ వయసులో ఆమె అంధత్వానికి కారణమయింది. "మాది బెంగళూరు. భర్త, పిల్లలతో హాయిగా సాగిపోతున్న జీవితం నాది. కొన్నేళ్ళ క్రితం... తరచూ తలనొప్పి వస్తూ ఉండడంతో డాక్టర్‌ను కలిశాను. వైద్య పరీక్షలు చేయించి "మీకు ఆప్టికల్ న్యూరోసిస్ ఉంది" అని చెప్పారు. ఆ పేరు అంతకుముందు ఎప్పుడూ నేను వినలేదు. అది అయిదు లక్షల మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధి అనీ, దానివల్ల క్రమంగా చూపును కోల్పోవాల్సి వస్తుందనీ తెలిసింది. ఆ తరువాత ఎన్నో ఆసుపత్రులు తిరిగాం.. కానీ ఫలితం లేకపోయింది. చివరకు నా కళ్ళు పూర్తిగా కనిపించడం మానేశాయి" అని చెప్పారు భూమిక. హఠాత్తుగా చీకటి మయమైపోయిన జీవితాన్ని కొనసాగించడానికి ఆమె ఎన్నో ఇబ్బందులు పడ్డారు. "ఆ వేదనను తట్టుకోవడం కష్టమయింది. ఎవరి సాయం లేకుండా నడవ లేను. ఏదీ చదవలేను, రాయలేను. మా ఇల్లు కూడా నాకు అపరిచితంగా అనిపించేది. అగాధంలో పడిపోయిన భావన. ఆ సమయంలో నేను డిప్రెషన్‌లోకి వెళ్ళిపోకుండా నా భర్త, కుటుంబం అండగా నిలిచింది" అని గుర్తు చేసుకున్నారామె.

నిరర్థకంగా మిగిలిపోకూడదని...

కొత్త జీవితానికి భూమిక క్రమంగా అలవాటుపడ్డారు. అయితే ఖాళీగా కూర్చోవడం ఆమెకు నచ్చలేదు. ఆమె ఏదైనా పని చేస్తానంటే "మేం ఉన్నాం కదా! నీకెందుకు శ్రమ" అనేవారు ఇంట్లో వారు. 'ఇలా నిరర్థకంగా మిగిలిపోకూడదు' అని ఆమె అనుకున్నారు. వంటపనిలో సాయం చెయ్యాలనుకున్నారు. వంట చెయ్యడం, అందరికీ వడ్డించడం, ఆ వంటల్ని వాళ్ళు సంతృప్తిగా తింటే



> "చూపు పోయిందని బాధపడుతూ... నాలుగు గోడల మధ్యకే పరిమితమైపోవలసిన నాకు ఆ వీడియోలు ఎన్నడూ ఊహించని గుర్తింపు తెచ్చాయి. ఆదాయం కూడా వస్తోంది. ఎంతోమంది "మీరే నాకు స్ఫూర్తి" అని చెబుతున్నారు. కాబట్టి కష్టమైనా... నాకు ఇష్టమైన ఈ పనిని కొనసాగిస్తూనే ఉంటాను"

ఆనందించడం ఆమెకు ఇష్టం. "అయితే ఏ వస్తువు ఏదో అర్థమయ్యేది కాదు. వాటిని చేతిలోకి తీసుకొని, వాసన చూసి తెలుసుకొనేదాన్ని. కాయగూరల్లో పాడైన భాగాలు ఎక్కడున్నాయో తెలుసుకోవడమూ కష్టమయ్యేది. అప్పుడే అంధులకు ఆడియో సలహాలతో సాయపడే ఒక వాట్సాప్ గ్రూప్ గురించి తెలిసింది. దాని ద్వారా చాలా విషయాలు నేర్చుకున్నాను" అని చెప్పారు భూమిక. చూపు లేకపోయినా భూమిక ఏమాత్రం తడబడకుండా వంట చేయడం, రుచులు కూడా అద్భుతంగా ఉండడం గమనించిన ఆమె భర్త సుదర్శన్... వాటిని వీడియోలు తీశారు. ఆ వీడియోలను ఎడిట్ చేసి యూట్యూబ్‌లో పెట్టాలనే ఆలోచన మాత్రం భూమికదే. "మా బంధువు ఒకరికి యూట్యూబ్ ఛానెల్ ఉంది. ఎంతో పేరు వచ్చింది. డబ్బు కూడా వస్తోంది. నా వంటల వీడియోలను కూడా యూట్యూబ్‌లో పెడితే బాగుంటుందనుకున్నాను. నా భర్తకు ఆ ఆలోచన బాగా నచ్చింది. మరికొన్ని వీడియోలు రికార్డ్ చేశారు. 'భూమిక కిచెన్' అనే పేరుతో ఒక యూట్యూబ్ ఛానెల్‌ను 2018లో ప్రారంభించాం" అని చెప్పారు భూమిక.

గాయాలవుతూ ఉంటాయి...

భూమిక కిచెన్... భారతదేశంలో అంధురాలైన ఒక మహిళ ప్రారంభించిన తొలి యూట్యూబ్ ఛానల్. దానికి కొద్ది రోజుల్లోనే వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. "కొత్తగా వంట నేర్చుకుంటున్నవారు, బ్యాచిలర్స్ సులువుగా చేసుకోగలిగే వంటలే ఎక్కువగా పోస్ట్ చేస్తాను. అన్నీ శాకాహార వంటలే. నాలాంటివారు తమ నైపుణ్యాలను ఇతరులతో పంచుకోవడానికి యూట్యూబ్ లాంటి వేదికలు ఎంతో ఉపకరిస్తున్నాయి" అని చెబుతున్న భూమిక 1,300కు పైగా వంటల్ని పోస్ట్ చేశారు. ఆమె ఛానల్‌కు దాదాపు 88 వేలమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. "ఇది అంత సులువుగా సాగే ప్రయాణం కాదు. వంట అంటేనే నిప్పుతో చెలగాటం. ప్రతి రోజూ ఒక యుద్ధంలాంటిది. నా భర్త, కుటుంబం అనుక్షణం సహాయంగా ఉంటారు. కానీ నాకు చూపు లేదు కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి. వంటకాలు ప్రతిసారీ అనుకున్నట్టు కుదరవు. కూరగాయలు కోసేటప్పుడు, వంట చేసేటప్పుడు గాయాలు అవుతూ ఉంటాయి. నా భద్రత గురించి నా చుట్టూ ఉన్నవారు ఎప్పుడూ ఆందోళనతోనే ఉంటారు. నేను చేసే పనిలో అపాయం ఉందని నాకూ తెలుసు. అయితే చూపు పోయిందని బాధపడుతూ... నాలుగు గోడల మధ్యకే పరిమితమైపోవలసిన నాకు ఆ వీడియోలు ఎన్నడూ ఊహించని గుర్తింపు తెచ్చాయి. ఆదాయం కూడా వస్తోంది. వేలాదిమంది మెచ్చుకుంటున్నారు. ఎంతోమంది "మీరే నాకు స్ఫూర్తి" అని చెబుతున్నారు. కాబట్టి కష్టమైనా... నాకు ఇష్టమైన ఈ పనిని కొనసాగిస్తూనే ఉంటాను" అంటున్నారు భూమిక.

మెగ్నీషియం లోపిస్తే...

మన శరీరానికి అత్యవసరమైన ఖనిజం మెగ్నీషియం. దీనివల్ల మనకు శక్తి లభిస్తుంది. ఇది శరీరంలోని ఎంజైమ్‌ల పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. హార్మోన్స్ సమతుల్యాన్ని కాపాడుతుంది. చక్కని నిద్ర వచ్చేలా చేస్తుంది. ఎముకలు బలంగా ఉండాలన్నా, నాడీ వ్యవస్థ చక్కగా పనిచేయాలన్నా శరీరానికి మెగ్నీషియం కావాలి.

- శరీరంలో మెగ్నీషియం లోపిస్తే ఆకలి ఉండదు. వికారంగా ఉంటుంది. గుండె కొట్టుకునే వేగంలో మార్పులు వచ్చి నీరసంగా అనిపిస్తుంది. కంటిచూపు మందగిస్తుంది. కండరాలు పట్టేసినట్లు అనిపిస్తాయి. రక్తపోటు పెరుగుతుంది.



- మనం తీసుకునే ఆహార పదార్థాల నుంచే మెగ్నీషియం లభిస్తుంది. అలా లభించనప్పుడు మూత్రపిండాలు తమ వద్ద వున్న మెగ్నీషియంను వినియోగిస్తాయి. కానీ ఇది అంత శ్రేయస్కరం కాదు.
- తృణధాన్యాలు, పప్పులు, గింజలు, జీడిపప్పు, బాదం, గుమ్మడి గింజలు, వేరుశనగ, పచ్చి బఠాణీలు, ఖర్జూరాల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. కాయగూరలు, ఆకుకూరలు, అత్తిపండ్లు, అరటి పండ్లు, అవకాడో, క్యాబేజీ, బ్రౌన్ రైస్, ఓట్స్, సీ ఫుడ్, మొలకలు వంటివి తరచూ తినడం వలన మెగ్నీషియం లోపాన్ని అధిగమించవచ్చు.
- శరీరంలో మెగ్నీషియం స్థాయి ఎక్కువైతే డయేరియా, కడుపునొప్పి వంటివి బాధిస్తాయి. ఒక రోజుకి పురుషులకు 400 మిల్లీగ్రాములు, మహిళలకు 300 మిల్లీగ్రాముల మెగ్నీషియం సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
సోమవారం • 21 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



సెట్స్‌లోకి స్వాగతం

హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే' సీజన్ 4 త్వరలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన తొలి ఎపిసోడ్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా కనిపించనున్నారు. దీనికి సంబంధించిన షూటింగ్ ఆదివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. చంద్రబాబునాయుడుకు బాలకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సెట్స్‌లోకి ఆహ్వానించారు. గతంలో అన్‌స్టాపబుల్ సీజన్ 3లో సైతం చంద్రబాబు పాల్గొన్నారు. ఇప్పుడు మరోసారి తన వ్యక్తిగత, రాజకీయ జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలను ఆయన పంచుకోనున్నారు. 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే' సీజన్ 4లో తొలి ఎపిసోడ్ ఈ నెల 25న స్ట్రీమింగ్ అవనుంది.



చాలా నమ్మకంతో ఉన్నాను

విష్వక్‌సేన్

విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నవంబర్ 22న విడుదలవుతోంది. ఆదివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ సాగిన ట్రైలర్ ఆద్యంతం వినోదం పంచింది. విష్వక్‌సేన్ స్టైలిష్ నటనతో కట్టిపడేశారు. విలన్ పాత్రలో సునీల్ పలికించిన క్రౌర్యం అలరించింది. ఈ కార్యక్రమంలో విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'నన్ను ఇక్కడివరకూ తీసుకొచ్చింది ప్రేక్షకుల అభిమానమే. సినిమాపై చాలా నమ్మకంతో ఉన్నాను. సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా సినిమా ఉండబోతోంది. శ్రద్ధా శ్రీనాథ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని చెప్పారు. రవితేజ ముళ్లపూడి మాట్లాడుతూ 'ట్రైలర్‌లో కొంతే చూశారు. సినిమాలో చాలా కంటెంట్ ఉంది. ఇక నుంచి వరుస అప్డేట్స్ ఇస్తాం. ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'ప్రేక్షకులకు ట్రైలర్ నచ్చినందుకు ఆనందంగా ఉంది. సినిమా కూడా మాస్ కా దాస్ రేంజ్‌లో ఉంటుంది. థియేటర్లలో మాస్ జాతర ఖాయం' అన్నారు. కథలో కీలకమైన పాత్ర నాది, దర్శకుడు సినిమాను తెరకెక్కించిన తీరు అద్భుతం అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

ఆ తప్పులన్నీ మోహన్‌లాల్‌కు తెలుసు



నటి, పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక సుకుమారన్ హేమ కమిటీ నివేదిక, నటుడు మోహన్‌లాల్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. "అమ్మ (మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్)లో ఏ సమస్యపై నోరు మెదపని వారికే ప్రాముఖ్యత ఎక్కువ. పేదరికంలో ఉన్న కళాకారులకు ఇచ్చే పథకాల్లోనూ అవకతవకలు జరిగాయి. ఈ సంస్థలో జరిగే తప్పులన్నీ మోహన్‌లాల్‌కు తెలుసు. అమ్మలో పక్షపాతం రాజ్యమేలుతోంది" అని ఆరోపించారు. అలాగే లైంగిక వేధింపులు ఎదుర్కొన్న నటి భావన గురించి మాట్లాడుతూ "ఆమె లైంగిక వేధింపులు ఎదుర్కొన్న విషయం నూటికి నూరు శాతం వాస్తవం. ఏడేళ్లు గడిచినా ఈ విషయంలో ఆమెకు ఇంకా న్యాయం ఎందుకు జరగట్లేదు. ఆమెకు సత్వర న్యాయం జరగాలి" అని డిమాండ్ చేశారు.

హీరో లేకుండా హిట్ కోసం

ఓ పక్క హీరోలతో ఆడిపాడుతూనే.. వారికి ధీటైన పాత్రల్లోనూ నటిస్తున్నారు నేటితరం కథానాయికలు. మహిళా ప్రాధాన్య కథలతో వచ్చే సినిమాల సంఖ్య ఇండస్ట్రీలో గతంలో కన్నా ఎక్కువగానే ఉంది. దర్శకులు కూడా హీరోయిన్ల కోసం సరికొత్త పాత్రలు సృష్టిస్తున్నారు. లీడ్ రోల్‌లో నటిస్తూ సినిమా భారాన్నంతా తమ భుజాలపైనే మోస్తున్న టాలీవుడ్ కథానాయికల గురించి తెలుసుకుందాం.













ఒకప్పుడు వరుస సినిమాలు చేసి అగ్రనటిగా వెలుగొందిన నటి సమంత. ఇప్పుడు ఆమె నటించిన వెబ్‌సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీబన్నీ' స్ట్రీమింగ్ అవనున్న సంగతి తెలిసిందే. అలానే ఆమె ఓ నూతన ప్రాజెక్ట్‌లోనూ నటిస్తున్నారు. మహిళా ప్రాధాన్యమున్న 'మా ఇంటి బంగారం' అనే సినిమాలో ఓ శక్తిమంతమైన ఇల్లాలి పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాతో సామ్ నిర్మాతగా కూడా మారారు. సమంత పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆమె ఇది వరకే మహిళా ప్రాధాన్యం ఉన్న 'యశోదా', 'శాకుంతలం' చిత్రాల్లో నటించారు.

ప్రతీకారంతో స్వీటీ

సినిమాల్లో మహిళా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఊపు తెచ్చారు అనుష్క శెట్టి. 'బాహుబలి'లో దేవసేన, 'వేదం'లో సరోజ పాత్రలు అలాంటివే. ఆమె అలాంటి పవర్‌ఫుల్ పాత్రలు పోషిస్తూనే 'అరుంధతి', 'రుద్రమదేవి', 'భాగమతి' 'సైజ్ జీరో' లాంటి మహిళా ప్రాధాన్య చిత్రాల్లోనూ నటించారు. ఆమె ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో 'ఘాటి' అనే సినిమాలో నటిస్తున్నారు. ఓ మహిళ జీవితంలో తనకెదురైన గడ్డు పరిస్థితులను ఎలా ఎదుర్కొన్నారనేది ఆసక్తికరంగా ఉండనుంది. ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

రివాల్వర్ తో 'మహానటి'

'మహానటి' చిత్రంతో అందరి చేత శభాశ్ అనిపించుకోవడమే కాక జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అవార్డును సొంతం చేసుకున్నారు కీర్తి సురేశ్. ఆ తర్వాత ఆమె 'మిస్ ఇండియా', 'గుడ్ లక్ సఖి', 'రఘు తాత' వంటి మహిళా ప్రాధాన్య చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో వరుణ్ ధావన్ సరసన 'బేబీ జాన్' చిత్రంలో నటిస్తున్నారు. దీంతోపాటు 'రివాల్వర్ రీటా'లో నటిస్తున్నారు. ఇటీవలే ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టీజర్‌లో ఆమె పూర్తి మాస్ పాత్రలో కనిపించారు.

ఒకేసారి రెండు చిత్రాల్లో...

హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాల విషయంలో రష్మిక మందన్న ఓ అడుగు ముందే ఉన్నారు.ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'గర్ల్ ఫ్రెండ్, రెయిన్‌బో' చిత్రాలు రెండూ ఆ కోవకు చెందినవే. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రాలతో పాటు 'కుబేర', 'సికందర్', 'ఛావా' వంటి సినిమాల్లో కథానాయికగా వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారీ బ్యూటీ. మరోవైపు 'పుష్ప 2'లో ఆమె పోషిస్తున్న శ్రీవల్లి పాత్ర కూడా మొదటి భాగం కంటే మరింత శక్తిమంతంగా ఉండనున్నదట.

తొలిసారి...

'సార్' సినిమాలో 'మాస్టారు మాస్టారు' అంటూ యువకుల హృదయాలను కొల్లగొట్టిన నటి సంయుక్త. ఆమె తొలిసారి ఓ మహిళా ప్రాధాన్యం ఉన్న సినిమాలో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించారు. సామాజిక, రాజకీయ అంశాలే ప్రధానంగా తెరకెక్కుతోందీ సినిమా.

ట్రావెల్ నేపథ్యంలో..

ఇటీవలే 'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఆమె 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో 'పరదా' అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ ట్రావెల్ బేస్డ్ చిత్రంలో 'హృదయం' ఫేమ్ దర్శనా రాజేందర్ కూడా కీలక పాత్రలో మెరుస్తున్నారు.

పంథా మార్చి...

ఇప్పటివరకూ గ్లామర్ పాత్రలతో ప్రేక్షకులను అలరించిన తమన్నా.. తన పంథా మార్చి మొదటి సారి మహిళా ప్రాధాన్యత ఉన్న ఓ పాత్రను పోషిస్తున్నారు. 'ఓదెల 2' చిత్రంలో ఆమె శివశక్తి అనే నాగసాధువు పాత్రను పోషిస్తున్నారు. ఈ మధ్యే విడుదలైన ఆమె లుక్ అందర్నీ ఆకట్టుకుంది.

ఎనిమిదేళ్ల ప్రయాణం..

'మ్యాడ్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్నారు అనంతిక సనీల్‌కుమార్. ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వంలో ఆమె ఓ విమెన్ ఓరియెంటెడ్ చిత్రం '8 వసంతాలు'లో నటిస్తున్నారు. ఇందులోని 'శుద్ధి అయోధ్య' పాత్ర కోసం ఆమె మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందారు.

వీరితో పాటు మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఆది పర్వం'.. శ్రద్ధాదాస్ నటిస్తున్న 'త్రికాల'.. ప్రియమణి నటిస్తున్న 'క్యూజీ గ్యాంగ్'.. హన్సిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న హారర్ థ్రిల్లర్ 'గాంధారీ'.. వంటి చిత్రాలు కూడా కథానాయిక ప్రాధాన్యం ఉన్నవే.

తెలుగులో కొత్త టైటిల్?

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తున్న హిందీ చిత్రం వార్-2. ఇప్పటికే ఎన్టీఆర్‌పై కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. మరో కొత్త షెడ్యూల్ కోసం ఎన్టీఆర్ ముంబై వెళ్లారు. ఈసారి హృతిక్, ఎన్టీఆర్‌లపై ఓ పాట చిత్రీకరించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.



ఈ పాట ఇండియన్ స్క్రీన్‌పై ఓ అద్భుతం అనుకొనే రీతిలో ఉండబోతున్నట్లు టాక్. కాగా, ఈ సినిమాకు సంబంధించి మరో వార్త చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రానికి తెలుగులో ఓ కొత్త టైటిల్‌ని నిర్ణయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 'యుద్ధభూమి' అని పేరు పెడతారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యన పాన్ ఇండియా సినిమాలకు దేశ వ్యాప్తంగా ఒకే టైటిల్ చెలామణిలో ఉంటోంది. ఒకే టైటిల్ ఉంటే, అన్ని భాషల్లోనూ త్వరగా రీచ్ అవుతుందన్నది దర్శక నిర్మాతల ఆలోచన. అందుకే కొన్ని తమిళ సినిమాలు తమిళ టైటిల్‌తోనే దేశ వ్యాప్తంగా విడుదల అవుతున్నాయి. ఇలాంటి తరుణంలో 'వార్-2' కు తెలుగులో వేరే టైటిల్ పెడతారా? అన్నది వేచి చూడాలి.

ఎవర్నీ కలవకూడదనుకున్నా



గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి వరుస బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో భారీ భద్రత మధ్య బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ బిగ్ బాస్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ షూట్‌కి సంబంధించిన ఒక ఎపిసోడ్ శనివారం ప్రసారమైంది. ఈ సందర్భంగా సల్మాన్ ఖాన్ చేసిన కొన్ని కీలక వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'నేను ఈ రోజు ఇక్కడికి రాకూడదనుకున్నా. అస్సలు రావాలనిపించలేదు. మీతో పాటు ఎవరినీ కలవకూడదనుకున్నా. వృత్తి పట్ల ఉన్న నిబద్ధత వల్ల ఇక్కడికి వచ్చాను' అని సల్మాన్ అన్నారు. అయితే ముందు ఉన్నంత యాక్టీవ్‌గా ఈ ఎపిసోడ్‌లో సల్మాన్ కనిపించలేదు.

ఆ ప్రచారంలో నిజం లేదు

సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో విలన్‌గా నటించడం కోసం కొంత కాలం నుంచి సైఫ్ అలీఖాన్‌తో పాటు ఆయన భార్య కరీనాని మూవీ మేకర్స్ సంప్రతించారని, దానికి వారు కూడా సానుకూలంగా స్పందించారని వార్తలొచ్చాయి. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కరీనా మాట్లాడుతూ..అవి జస్ట్ రూమర్స్ అని కొట్టి పారేశారు. తమదైన విలక్షణ నటనతో బాలీవుడ్‌ని దశాబ్దాల నుంచి ఏలుతున్న ఈ జంట..సందీప్ రెడ్డి సినిమాలో చేయడం లేదని క్లారిటీ రావడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు.



శంకరన్ నాయర్ పాత్రలో అక్షయ్ కుమార్



బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్, దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ కాంబినేషన్‌లో మూడో చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ కేరళకు చెందిన ప్రముఖ రాజకీయ నేత, బారిస్టర్, సంస్కర్త అయిన సి.శంకరన్ నాయర్ పాత్రలో నటించనున్నారు. 'ద కేస్ దట్ షూక్ ద ఎంపైర్' నవల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. జలియన్ వాలా భాగ్ మారణకాండ నేపథ్యంలో సాగే చిత్రమిది. కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ సినిమా పోస్టర్‌ని షేర్ చేస్తూ, విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రానికి కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహించనున్నారు. అక్షయ్ కుమార్‌తోపాటు ఆర్. మాధవన్, అనన్య పాండే నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 14న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

ఇన్ ప్రోగ్రెస్

పెళ్లి పుస్తకం అంత హిట్ అవుతుందన్నారు

రమేశ్ చెప్పాల



'ప్రతి మనిషి జీవితంలో పుట్టుక, పెళ్లి, మరణం మూడు ప్రధాన ఘట్టాలు. పెళ్లి కుదిర్చేటపుడు రెండువైపులా కుటుంబాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాన్ని లగ్గం సినిమా ద్వారా చూపించబోతున్నాం' అని దర్శకుడు రమేశ్ చెప్పాల అన్నారు. సాయిరోనక్, ప్రగ్యా నగ్ర జంటగా నటించిన ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. ఈనెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రమేశ్ చెప్పాల సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతిలో 'లగ్గం' అనేదానికి ప్రత్యేక స్థానం ఉంది. దీనిచుట్టూ ఉన్న భావోద్వేగాలను తెరపైకి తీసుకురావాలనుకున్నాను. 'లగ్గం' అనే టైటిల్ చెప్పగానే అందరూ బావుందన్నారు. రాజేంద్ర ప్రసాద్ 'ఇది 'పెళ్లి పుస్తకం' అంత పెద్ద హిట్ అవుతుంద'న్నారు. క్లైమాక్స్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. లగ్గం అరిటాకులో విందు భోజనంలా ఉండబోతోంది' అని చెప్పారు.

హాస్యం అలరిస్తోంది

రామ్ కార్తీక్, కశ్వి హీరో హీరోయిన్లుగా మనోజ్ పల్లేటి దర్శకత్వం వహించిన 'వీక్షణం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం యూనిట్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. మనోజ్ పల్లేటి మాట్లాడుతూ "వీక్షణం' చిత్రానికి వస్తున్న ఆదరణతో చాలా సంతోషంగా ఉంది. కామెడీ సన్నివేశాలను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. మేం ఊహించిన దానికన్నా పెద్ద విజయాన్ని ప్రేక్షకులు అందించారు' అని చెప్పారు. రామ్ కార్తీక్ మాట్లాడుతూ 'నా తొలి చిత్రానికి ఇంత మంచి స్పందన దక్కడం ఆనందాన్నిచ్చింది. మా సినిమాకు మంచి రివ్యూలు వచ్చాయి. వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అన్నారు. ప్రేక్షకులకు మా సినిమా నచ్చితే మరో నలుగురికి చెప్పి ప్రోత్సహించండి అని నిర్మాత కోరారు.



ఏక్తా కపూర్‌పై పోక్సో కేసు



ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్‌పై పోక్సో కేసు నమోదైంది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆల్ట్ బాలాజీలో ప్రసారమవుతోన్న 'గందీ బాత్ సీజన్-6'కు సంబంధించి ముంబయి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సిరీస్‌ను బాలాజీ టెలిఫిల్మ్ లిమిటెడ్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ఇందులో మైనర్ బాలికలకు సంబంధించిన అసభ్యకరమైన దృశ్యాలను చూపించారన్న ఆరోపణలతో పోక్సో కింద ఆమెతోపాటు తల్లి శోభా కపూర్‌పై కేసు నమోదైంది. కాగా, ఏక్తాకపూర్ ఈ ఏడాది లవ్, సెక్స్ ఔర్ ధోఖా-2 సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు.

'ఆటో' ఎగుమతుల్లో 14% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో భారత్ నుంచి ఆటోమొబైల్ ఎగుమతులు 14% పెరిగి 25,28,248కి చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఎగుమతైన వాహనాల సంఖ్య 22,11,457 యూనిట్లు. ప్రధానంగా ప్రయాణికుల వాహనాలు, ద్విచక్ర వాహనాల ఎగుమతులు మొత్తం ఎగుమతుల్లో వృద్ధికి దోహదపడ్డాయి. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు కరెన్సీ విలువ క్షీణత ప్రభావం నుంచి బయటపడడంతో ఎగుమతులు పునరుజ్జీవం సాధించాయని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	515
వరంగల్	502	గోదావరి	515
చిత్తూరు	548	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	120	అనంతపురం	129
గోదావరి	130		

రూ.6,000 కోట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూకి గ్రీన్‌సిగ్నల్

రిలయన్స్ ఇన్‌ఫ్రా

న్యూఢిల్లీ: ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ.6,000 కోట్లు సమీకరించేందుకు అనిల్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రా సిద్ధమైంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జరిగిన ఓటింగ్‌లో 98 శాతానికి పైగా వాటాదారులు ఇందుకు ఆమోదం తెలిపారు. ప్రిఫరెన్షియల్ ఇష్యూ, క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) మార్గంలో షేర్లు, వారెంట్లు జారీ చేయడం ద్వారా కంపెనీ ఈ నిధులు సమీకరించనుంది. గత నెల 19న జరిగిన భేటీలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.3,014 కోట్లు ప్రిఫరెన్షియల్ ఇష్యూ/వారెంట్ల ద్వారా, రూ.3,000 కోట్లు క్యూఐపీ ద్వారా సేకరిస్తారు.

వాల్యూ ఫండ్స్‌తో మెరుగైన రిటర్నులు..



స్టాక్ మార్కెట్లు రికార్డు గరిష్ఠాల నుంచి పడిపోయాయి. దీంతో మదుపరులు కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. మార్కెట్లు పతనబాటలో సాగుతున్నప్పటికీ వాల్యుయేషన్స్ ఇంకా గరిష్ఠాల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటి ఆటుపోట్ల మార్కెట్లలో ఇన్వెస్టర్లు నష్టపోకుండా ఉండేందుకు వాల్యూ ఫండ్స్ చక్కగా ఉంటాయని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ లిమిటెడ్ ఈడీ,సీఐఓ ఎస్ నరేన్ అంటున్నారు. దీర్ఘకాలంలో మదుపరులు మెరుగైన రిటర్నులు అందుకోవాలంటే ఈ ఫండ్స్ ఎంపిక చేసుకోవటం మంచిదన్నారు. ఇందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వాల్యూ డిస్కవరీ ఫండ్ మంచి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. గడచిన ఇరవై ఏళ్లలో ఈ ఫండ్ ఏటా సగటున 21.2 శాతం మేర రిటర్నులు అందించిందని తెలిపారు. ఎప్పుడో కొన్ని సందర్భాల్లో మాత్రం ఆశించిన ప్రదర్శించకపోయినప్పటికీ మొత్తంగా చూస్తే మాత్రం నిలకడగా రిటర్నులను అందించిందని నరేన్ పేర్కొన్నారు. 2013 నుంచి 2024 సెప్టెంబరు కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాల్యూ డిస్కవరీ ఫండ్ 15.4 శాతం రిటర్నులు ఇచ్చిందని తెలిపారు.

ఆరు నెలల్లో మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.30,350 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలు మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు పెద్దగా కలిసి రాలేదు. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో మదుపరులు ఈ ఫండ్స్‌లో రూ.30,350 కోట్లు మదుపు చేశారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.2,582 కోట్లు తక్కువని మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తెలిపింది. ఈ ఫండ్స్‌లో ఏదో గూడుపుఠానీ జరుగుతోందని సెబీ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. గత ఆరు నెలల్లో మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడుల్లో రూ.14,756 కోట్లు మిడ్ క్యాప్ ఫండ్స్‌లోకి, రూ.15,586 కోట్లు స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మిడ్ అండ్ స్మాల్ క్యాప్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలతో పోలిస్తే 20 నుంచి 24 శాతం అధికంగా పెరిగాయి. దీంతో సెబీ జర జాగ్రత్త అని హెచ్చరించినా, ఇన్వెస్టర్లు మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇంకా భారీగానే మదుపు చేస్తున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్లో దిద్దుబాటు జరిగితే తప్ప ఈ పెట్టుబడుల జోరుకు బ్రేక్ పడదని భావిస్తున్నారు.

నవంబరు 1న ముహూరత్ ట్రేడింగ్

ఈ సంవత్సరం దీపావళి రోజు జరిగే 'ముహూరత్' ట్రేడింగ్ సమయం ఖరారైంది. ఆ రోజు అంటే నవంబరు 1న సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఈ ట్రేడింగ్ జరుగుతుందని స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. ఆ రోజు నుంచి హిందూ కాలమానం ప్రకారం కొత్త సంవత్సరం 'సంవత్ 2081' ప్రారంభం కానుంది. ఆ రోజు జరిగే ముహూరత్ ట్రేడింగ్.. మదుపరులు, బ్రోకర్లకు భోగ, భాగ్యాలు ప్రసాదిస్తుందని మార్కెట్ వర్గాల నమ్మకం. ఏటా దీపావళి రోజు మార్కెట్లకు సెలవైనా, ఆ రోజు సాయంత్రం ఒక గంట సేపు ముహూరత్ ట్రేడింగ్ పేరుతో లాంచనప్రాయంగా ట్రేడింగ్ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం దీపావళి రోజు సాయంత్రం 5.45 నుంచి 6 గంటల వరకు ప్రీఓపెనింగ్ సెషన్ ఉంటుంది. ఆ రోజు సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య ఈక్విటీ, కమోడిటీ డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, ఈక్విటీ ఎఫ్ అండ్ ఓ సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ విభాగాల్లో ముహూరత్ ట్రేడింగ్ జరగనుంది.

పీఎస్‌యూ షేర్లలో ట్రేడింగ్ వద్దు

» అధికారులకు దీపమ్ ఆదేశాలు

ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) షేర్లు వేటిలోనూ ట్రేడింగ్ చేపట్టరాదని ప్రభుత్వ పెట్టుబడులు, నిర్వహణ శాఖ (దీపమ్) తన అధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించి ఒక అంతర్గత నోట్ జారీ చేసింది. పీఎస్‌యూలకు సంబంధించిన కీలక సమాచారం ఈ అధికారులకు అందుబాటులో ఉండే అవకాశం ఉన్నందున దీపమ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. దీపమ్‌లో చేరే అధికారులు తమ పోర్టుఫోలియోలోని పీఎస్‌యూ కంపెనీల షేర్ల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని కూడా కోరింది. ఈ కంపెనీల షేర్లను వీరు దీపమ్ ఉన్నతాధికారుల అనుమతి పొందిన తర్వాత మాత్రమే విక్రయించాలని కూడా స్పష్టం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పనిచేసే దీపమ్.. పీఎస్‌యూల్లో ప్రభుత్వ ఈక్విటీ మూలధన నిర్వహణ, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణను పర్యవేక్షిస్తుంటుంది. ఈ నేపథ్యంలో దీపమ్ ఉన్నతాధికారులు ఈ సర్క్యులర్ జారీ చేయడం విశేషం.

25,200 ఎగువన బుల్లిష్

(అక్టోబరు 21-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ గైడ్

నిఫ్టీ గత వారం 25,212-24,568 పాయింట్ల మధ్యన కదలాడి 110 పాయింట్ల నష్టంతో 24,854 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,200 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,830, 24,954, 25,039, 25,381 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50, 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 25,200 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 24,550
నిరోధ స్థాయిలు : 25,050, 25,150, 25,250 (24,950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 24,650, 24,550, 24,450 (24,750 దిగువన బేరిష్)

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బ్లూకౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్.. రూ.2 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేరును రూ.1 ముఖ విలువతో కూడిన షేరుగా విభజిస్తున్నట్లు ప్రకటించింది. రెగ్యులేటరీ సంస్థలతో పాటు కంపెనీ వాటాదారుల ఆమోదానికి లోబడి ఈ షేరు విభజన ఉంటుందని కంపెనీ తెలిపింది.
- కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ (గతంలో కర్దా కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్).. కన్వర్టబుల్ ప్రిఫరెన్షియల్ వారంట్ల జారీ ద్వారా రూ.99.50 కోట్లు సమీకరించింది. పతంజలి ఫుడ్స్, హెర్బల్ పార్క్, ఫాల్కన్ పీక్ ఫండ్ లిమిటెడ్ సహా మరికొందరు ఇన్వెస్టర్ల నుంచి ఈ మొత్తాలను సేకరించింది. నాన్ ప్రమోటర్లకు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన వారంట్లను జారీ చేసి 45.23 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) పండగ సీజన్‌ను పురస్కరించుకుని టయోటా గ్లాంజా లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసింది. 13 టయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టీజీఏ) ప్యాకేజీలతో పాటు మరింత స్టైల్, కంఫర్ట్‌తో ఈ లిమిటెడ్ ఎడిషన్ గ్లాంజాను తీసుకువచ్చింది. ఈ ప్యాకేజీల విలువ రూ.20,567గా ఉంది.

25,000 స్థాయి కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో మరింత కరెక్షన్‌ను కొనసాగించినప్పటికీ శుక్రవారం బలమైన రికవరీ సాధించి ముందు వారం కన్నా 110 పాయింట్ల నష్టంతో 24,850 వద్ద ముగిసింది. శుక్రవారం 250 పాయింట్ల మేరకు ఇంట్రాడే రికవరీ సాధించడం దిగువ స్థాయిలో మార్కెట్ మద్దతు సాధించిందనేందుకు సంకేతం. మిడ్‌క్యాప్-100 సూచీ కూడా గత శుక్రవారం 1,000 పాయింట్ల మేరకు బలమైన రికవరీ సాధించి వారం మొత్తం మీద నష్టాన్ని 560 పాయింట్లకు కుదించుకుంది. స్మాల్‌క్యాప్-100 సూచీ సైతం కనిష్ఠ స్థాయిల నుంచి రికవరీ సాధించి వారం మొత్తం మీద 70 పాయింట్ల లాభంతో ముగిసింది. గత రెండు వారాలుగా కనిష్ఠ స్థాయిల్లో రికవరీ సాధిస్తూ వస్తున్నా వారం రేంజికి మధ్యస్థంగా ముగుస్తూ ఉండడం ట్రెండ్‌లో అనిశ్చితిని సూచిస్తోంది. గత రెండు వారాలుగా 25,000 వద్ద ఊగిసలాడుతున్న నిఫ్టీ ఈ వారంలో కూడా ఆ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది. 25,000 వద్ద మార్కెట్ నిలదొక్కుకుని సానుకూల ట్రెండ్‌లో ప్రవేశించేది, లేనిది వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే ప్రధాన నిరోధం 25,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 25,250. స్వల్పకాలిక సానుకూల ధోరణి కోసం ఈ స్వల్పకాలిక నిరోధం వద్ద మార్కెట్ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది. మద్దతు స్థాయి 24,700. బలహీనతను నివారించేందుకు ఇక్కడ తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం 51,000 వరకు దిగజారిన బ్యాంక్ నిఫ్టీ చివరికి 800 పాయింట్ల లాభంతో 52,000 సమీపంలో ముగిసింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 52,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రస్తుత మద్దతు స్థాయి 52,000 వద్ద నిలదొక్కుకోలేక పోతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: మరింత సానుకూలత కోసం నిఫ్టీ 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. గత వారం నిఫ్టీ 100 డీఎంఏ వద్ద రికవరీ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. ఇప్పుడు 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏకు చేరువవుతోంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,940, 25,000
మద్దతు	24,770, 24,700

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశాలున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్లో నెగిటివ్ సెంటిమెంట్‌కు కారణంగా ఉన్నాయి. ఈ వారం నిఫ్టీకి 24,850 వద్ద మద్దతు, 25,000 వద్ద నిరోధం ఉన్నాయి. నిఫ్టీ.. మరికొన్ని సెషన్లు ఇదే శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది.

స్టాక్ రికమండేషన్స్

మజగాన్ డాక్: బలహీనమైన మార్కెట్ సెంటిమెంట్‌లోనూ బలంగా పుంజుకున్న షేరు ఇది. జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 34 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం భారీ వాల్యూమ్‌తో అక్యుములేషన్ కొనసాగుతోంది. రూ.4,000 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ కౌంటర్ గత శుక్రవారం 6.81 శాతం లాభంతో రూ.4,526 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.4,550/4,500 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,850/5,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,400 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: గత ఏడాది అక్టోబరు నుంచి మే నెల వరకు అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరులో ప్రస్తుతం దిద్దుబాటు కనిపిస్తోంది. రూ.206 స్థాయిలో మద్దతు తీసుకున్న తర్వాత హయ్యర్ హైస్ ఫామ్ ఏర్పడటం బలాన్ని సూచిస్తోంది. గత శుక్రవారం 3.31 శాతం లాభంతో రూ.231 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.230/220 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.265/290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బాటా ఇండియా: చాలా కాలంగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతున్నాయి. సెప్టెంబరు త్రైమాసికంలో ఈపీఎస్ 173 శాతం పెరగటం, మంచి ఫలితాలు విడుదల చేస్తుందన్న అంచనాలతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 2.09 శాతం లాభంతో రూ.1,464 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,450 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,550/1,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,420 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ పవర్: ప్రస్తుతం ఈ షేరు మంచి రిస్క్ రివార్డ్ రేషియోతో లభిస్తున్నాయి. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.75 శాతం లాభంతో రూ.1,973 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,950 శ్రేణిలో ఎంటరై రూ.2,050/2,110 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,910 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగ్గా రాణిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. బలహీనమైన మార్కెట్లోనూ ఈ షేరు అదరగొడుతోంది. గత శుక్రవారం 2.4 శాతం లాభంతో రూ.753 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.730/750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810/840 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించాలి. అయితే రూ.720 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్



36 ఏళ్ల తర్వాత..

భారత గడ్డపై టెస్టు నెగ్గిన కివీస్

8 వికెట్ల తేడాతో టీమిండియా ఓటమి



యంగ్ | రచిన్

బెంగళూరు: ఆశలు అడియాశలయ్యాయి.. భారత బౌలర్ల నుంచి అద్భుతాలేమీ జరుగలేదు. వరుస విజయాలతో దూసుకెళుతున్న టీమిండియాకు గట్టి ఝలక్ తగిలింది. ఆఖరి రోజు ఆదివారం 107 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని న్యూజిలాండ్ పెద్దగా కష్టపడకుండానే ఛేదించింది. దీంతో 8 వికెట్ల తేడాతో నెగ్గిన లాథమ్ సేన.. భారత గడ్డపై చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఎందుకంటే.. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 36 ఏళ్ల తర్వాత వారికి దక్కిన టెస్టు గెలుపిది. అప్పుడెప్పుడో 1988లో చివరిసారిగా వాంఖడే మైదానంలో కివీస్ నెగ్గింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే. కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 27.4 ఓవర్లలో 2 వికెట్లకు 110 పరుగులు చేసి గెలిచింది. విల్ యంగ్ (48 నాటౌట్), ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రచిన్ రవీంద్ర (39 నాటౌట్) అజేయంగా నిలిచారు. బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 46, రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేయగా, కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగులు చేసింది. రెండో టెస్టు పుణెలో 24 నుంచి జరుగనుంది.

'రెండో' బంతికే వికెట్ పడినా..: శనివారం సాయంత్రం నుంచి కురిసిన వర్షం ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. సరిగ్గా మ్యాచ్ సమయానికి ఆగినా.. మైదానాన్ని సిద్ధం చేసేందుకు సమయం పట్టింది. దీంతో గంట ఆలస్యంగా ఆట ఆరంభమైంది. అయితే పిచ్‌ను రాత్రంతా కప్పి ఉంచడంతో పాటు పగుళ్లు కూడా కనిపిస్తుండడం, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో భారత బౌలర్లు కివీస్‌ను ఇబ్బందిపెట్టగలరనిపించింది. దీనికి తగ్గట్టుగానే పేసర్లు చక్కటి బౌన్స్ రాబట్టారు. నాలుగోరోజు ఆట చివర్లో తొలి ఓవర్‌ను నాలుగు బంతులకే ముగించిన విషయం తెలిసిందే. ఇక, ఐదోరోజు ఆటలో బుమ్రా ఆ ఓవర్‌ను కొనసాగిస్తూ రెండో బంతి (ఆరోది)కే ఓపెనర్ లాథమ్ (0)ను ఎల్బీ చేశాడు. లాథమ్ డీఆర్ఎస్‌కు వెళ్లినా ఫలితం లేకపోయింది. అటు సిరాజ్ పకడ్బందీగా బంతులేస్తూ తన తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా ముగించాడు. ముఖ్యంగా బుమ్రా బంతులు కివీస్ బ్యాటర్లను తాకుతూ భయపెట్టాయి. కివీస్ తొలి పది ఓవర్లలో 21 రన్స్ చేసింది. 13వ ఓవర్‌లో కాన్వేను బుమ్రా ఎల్బీ చేసినా అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో భారత్ రివ్యూకు వెళ్లి ఫలితం సాధించింది. దీంతో 35/2 స్కోరుతో కివీస్ కాస్త ఇబ్బందుల్లో పడినట్టు కనిపించినా.. రచిన్ రాగానే రెండు ఫోర్లతో పరిస్థితిని మార్చేశాడు. దీనికితోడు చక్కగా వెలుతురు కూడా రావడం కివీస్‌కు కలిసొచ్చింది. అటు యంగ్ కూడా 14వ ఓవర్‌లో వరుస ఫోర్లతో ఎదురుదాడికి దిగాడు. కుల్దీప్ ఓవర్లలో యంగ్ సిక్సర్, రచిన్ 3 ఫోర్లు కొట్టడంతో పరుగులు వేగంగా వచ్చాయి. దీంతో ఇక భారత్‌కు ఎలాంటి ఆశలు లేకపోయాయి. 28వ ఓవర్‌లో సింగిల్‌తో యంగ్ తమ జట్టుకు అద్భుత విజయాన్నందించాడు.

2013 నుంచి సొంత గడ్డపై భారత్ ఓటములు

జట్టు	తేడా	వేదిక	ఏడాది
ఆసీస్	333 రన్స్‌తో	పుణె	2017
ఇంగ్లండ్	227 రన్స్‌తో	చెన్నై	2021
ఆసీస్	9 వికెట్లతో	ఇండోర్	2023
ఇంగ్లండ్	28 రన్స్‌తో	హైదరాబాద్	2024
కివీస్	8 వికెట్లతో	బెంగళూరు	2024

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46
కివీస్ తొలి ఇన్నింగ్స్: 402
భారత్ రెండో ఇన్నింగ్స్: 462
కివీస్ రెండో ఇన్నింగ్స్: టామ్ లాథమ్ (ఎల్బీ) బుమ్రా 0; కాన్వే (ఎల్బీ) బుమ్రా 17; యంగ్ (నాటౌట్) 48; రచిన్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం:** 27.4 ఓవర్లలో 110/2. **వికెట్ల పతనం:** 1-0, 2-35. **బౌలింగ్:** బుమ్రా 8-1-29-2; సిరాజ్ 7-3-16-0; జడేజా 7.4-1-28-0; కుల్దీప్ 3-0-26-0; అశ్విన్ 2-0-6-0.

1 ఓ ఇన్నింగ్స్‌లో ఎక్కువ పరుగులు (462) చేసినా ఓడడం భారత్‌కిదే తొలిసారి

మొదటి రోజు ఆట వర్షార్పణమైనా ఫలితం రావడం భారత గడ్డపై ఇది మూడోసారి.

3 గతంలో కివీస్ (1976లో), ఆసీస్ (2013)లపై భారత్ గెలిచింది.

భారత పర్యటనలో కివీస్ ఆడిన 37 టెస్టుల్లో కేవలం ఇది మూడో విజయం. 1969, 1988లో ఒక్కో టెస్టు నెగ్గింది.

ఆ 3 గంటల ఆటతో అంచనాకు రావద్దు

ఈ మ్యాచ్ ఫలితం గురించి సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే తొలి ఇన్నింగ్స్‌లో ఆ 3 గంటల ఆటతోనే భారత జట్టు స్థాయిని అంచనా వేయలేరు. రెండో ఇన్నింగ్స్‌లో మేం పుంజుకున్న తీరు కూడా గమనించాలి. కొన్ని పొరపాట్లు చేసి ఫలితం అనుభవించాం. కానీ ఆ మాత్రానికే అంతా అయిపోయిందని భావించవద్దు. గతంలోనూ ఇలాగే జరిగి అద్భుతంగా పుంజుకున్నాం. పంత్‌ను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది కాబట్టి కీపింగ్‌కు దించలేదు. - రోహిత్ శర్మ

ఓడినా టాప్‌లోనే..

న్యూజిలాండ్‌తో తొలి టెస్టును ఓడినా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో భారత జట్టు (98 పాయింట్లు) టాప్‌లోనే ఉంది. విజయాల శాతం మాత్రం 74.24 నుంచి 68.06కి పడిపోయింది. ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) టాప్-3లో ఉన్నాయి. ఈ గెలుపుతో కివీస్ ఆరో స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎగబాకింది. మరోవైపు భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే రాబోయే టెస్టులు కీలకంగా మారాయి. ఆడాల్సిన ఏడు టెస్టుల్లో కనీసం ఐదింటిని గెలిస్తే నేరుగా ఫైనల్‌కు వెళుతుంది.

అటు పురుషులు.. ఇటు మహిళలు
న్యూజిలాండ్ డబుల్ ధమాకా

న్యూజిలాండ్ పురుషులు, మహిళల జట్లు ఒకేరోజు చరిత్రాత్మక విజయాలతో మురిపించాయి. టామ్ లాథమ్ సారథ్యంలోని పురుషుల జట్టు 36 ఏళ్ల తర్వాత భారత గడ్డపై తొలి టెస్టు విజయాన్ని అందుకోగా.. సోఫీ డివైన్ నేతృత్వంలోని మహిళల బృందం ఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి తొలిసారి టీ20 ప్రపంచ కప్ చాంపియన్‌గా అవతరించింది.



మహిళల టీ20 వరల్డ్ కప్
చాంపియన్ కివీస్

ఫైనల్లో సఫారీలు చిత్తు

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్ జట్టు కొత్త చాంపియన్‌గా ఆవిర్భవించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఆ జట్టు 32 పరుగులతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 158/5 స్కోరు చేసింది. అమీలీ కెర్ (43), బ్రూక్ హాలీ డే (38), సుజీ బేట్స్ (32) సత్తా చాటారు. ఎంలాబా రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 126/9 స్కోరుకే పరిమితమై ఓడింది. వోల్వార్డ్ (33), బ్రిట్స్ (17), ట్రయన్ (14) మినహా అంతా విఫలమయ్యారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, 'సిరీస్' అమీలీ కెర్ మూడు వికెట్లు పడగొట్టింది. 2009, 2010 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ ఈసారి మాత్రం ట్రోఫీని దక్కించుకుంది. ఇది తొమ్మిదో టీ20 ప్రపంచ కప్‌కాగా.. గత 8 సార్లలో ఆసీస్ 6 సార్లు, ఇంగ్లండ్, వెస్టిండీస్ ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

ఒత్తిడికి చిత్తు: ఛేదనలో ఓపెనర్లు శుభారంభం ఇచ్చినా.. మిగతా బ్యాటర్లు ఒత్తిడికి చిత్తవడంతో సౌతాఫ్రికాకు ఓటమితప్పలేదు. కెప్టెన్ వోల్వార్డ్, బ్రిట్స్ ధాటిగా ఆడి మొదటి వికెట్‌కు 51 పరుగులు జోడించారు. ఏడో ఓవర్లో బ్రిట్స్ (17)ను జోనాస్ అవుట్ చేయగా, పదో ఓవర్లో కీలకమైన వోల్వార్డ్‌తోపాటు బాష్ (9)ను పెవిలియన్ చేర్చిన కెర్ సఫారీలకు డబుల్ షాకిచ్చింది. అప్పటికే కొండెక్కిన రన్‌రేట్‌ను అధిగమించలేక సౌతాఫ్రికా వరుస వికెట్లు చేజార్చుకుని ఓటమి పాలైంది. దాంతో వరుసగా రెండోసారి సఫారీలు రన్నరప్‌గానే నిలవాల్సి వచ్చింది. 2023లో ఆ జట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది.

ఆ ముగ్గురి దూకుడు: టాపార్డర్‌లో కెర్, బేట్స్, మిడిలార్డర్‌లో హాలీ డే దూకుడుగా ఆడడంతో కివీస్ పటిష్ఠ స్కోరు చేసింది. రెండో ఓవర్లో ప్లిమ్మెర్ (9)ను అవుటైనా బేట్స్, కెర్ వేగంగా ఆడి రెండో వికెట్‌కు 37 పరుగులు జత చేశారు. అనంతరం ధనాధన్ బ్యాటింగ్‌తో హాలీ డే, కెర్ నాలుగో వికెట్‌కు 57 పరుగులు జోడించారు.

సంక్షిప్తస్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 158/5 (కెర్ 43, హాలీ డే 38, బేట్స్ 32, ఎం లాబా 2/31).

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 126/9 (వోల్వార్డ్ 33, బ్రిట్స్ 17, ట్రయన్ 14, కెర్ 3/24, మెయిర్ 3/25).

హైదరాబాద్ 292 ఆలౌట్

● ఉత్తరాఖండ్‌తో రంజీ

డెహ్రాడూన్: హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్ మూడో రోజు ఆటలో ఉత్తరాఖండ్ పైచేయి సాధించింది. ఆదివారం ఆట ముగిసేసరికి ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 189 పరుగులు చేసింది. రవికుమార్ సమర్థ్ (57), కునాల్ చండేలా (57 నాటౌట్) రాణించారు. రోహిత్ 2, అనికేత్, మిలింద్, కార్తికేయ తలో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 244/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 292కు ఆలౌటైంది. వికెట్‌కీపర్ రాహుల్ రాధేష్ (94) రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 325 పరుగులకు ఆలౌటైంది.

2 గంటలు.. 21 కిలోమీటర్లు

కశ్మీర్ మారథాన్‌లో సత్తా చాటిన సీఎం ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కశ్మీర్ మారథాన్‌ను ఆదివారం ఇక్కడ ప్రారంభించారు. అయితే, కశ్మీర్ లోయలో తొలిసారి జరిగిన ఈ అంతర్జాతీయ రేసులో సీఎం కూడా పాల్గొన్నారు. అంతేకాదు.. ఆయన రెండు గంటల్లోనే 21 కిలోమీటర్లు పరిగెత్తడం విశేషం. అంతర్జాతీయ రన్నర్లకు దీటుగా పరిగెత్తి అందరి దృష్టిని సీఎం ఆకర్షించారు. ఈ రేసులో దాదాపు 2వేల మంది అథ్లెట్లు పోటీపడ్డారు.

ఉత్కంఠ పోరులో జైపూర్ గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11లో జైపూర్ పింక్ పాంథర్స్ శుభారంభం చేసింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 39-34తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. జైపూర్ కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 15 రైడ్ పాయింట్లతో చెలరేగడంతో ఆ జట్టు విజయాన్ని అందుకుంది. కాగా, మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 36-32తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది.

వాషింగ్టన్‌కు పిలుపు

చివరి రెండు టెస్టులకు ఎంపిక



న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో 8 వికెట్లతో ఓడిన నేపథ్యంలో జాతీయ సెలెక్టర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. కివీస్‌తో జరిగే చివరి రెండు టెస్టులకు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు అదనంగా చోటు కల్పించారు. దాంతో జట్టు సభ్యుల సంఖ్య 16కు చేరింది. రెండో టెస్ట్ ఈనెల 24 నుంచి పుణెలో జరగనుంది. ఢిల్లీతో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో తమిళనాడు ఆటగాడు సుందర్ 152 రన్స్ చేశాడు.

రిత్విక్ జోడీకి 'అల్మాటీ' టైటిల్



రిత్విక్ | అర్జున్

న్యూఢిల్లీ: తెలుగు టెన్నిస్ ఆటగాడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి అంతర్జాతీయ టోర్నీలో సత్తా చాటాడు. భారత్‌కే చెందిన అర్జున్ ఖడే జతగా అల్మాటీ ఓపెన్ టైటిల్ గెలిచాడు. ఆదివారం కజకిస్థాన్‌లో జరిగిన ఫైనల్లో రిత్విక్-అర్జున్ ద్వయం 3-6, 7-6, 14-12తో నికోలస్ (కొలంబియా)-స్కందర్ మన్‌సౌరి (ట్యునీషియా) జోడీని ఓడించింది.

హాకీ కుర్రాళ్ల రెండో గెలుపు

జొహర్ బహ్రు (మలేసియా): భారత హాకీ కుర్రాళ్లు సుల్తాన్ జొహర్ కప్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేశారు. ఆదివారం జరిగిన పోరులో భారత్ 6-4 గోల్స్ తేడాతో గ్రేట్ బ్రిటన్‌ను చిత్తుచేసింది. భారత జట్టులో దిల్‌రాజ్ సింగ్, శర్దానంద్ తివారి చెరో రెండు గోల్స్‌తో విజృంభించగా.. మహ్మద్ కొనైన్ దాడ్, మన్‌మీత్ సింగ్ చెరో గోల్ కొట్టారు.



ఆలయ ఉద్యోగుల విరాళం చెక్కును ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు అందజేస్తున్న ఈవో భాస్కరరావు

గోపురం స్వర్ణ తాపడానికి విరాళాలివ్వండి

» భక్తులకు ప్రభుత్వ విప్ ఐలయ్య వినతి

భువనగిరి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన రాజగోపురం స్వర్ణ తాపడానికి విరాళాలు ఇవ్వాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు. ఆదివారం యాదగిరికొండపై విరాళాల సేకరణ కేంద్రం, వృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గాలి గోపురానికి బంగారు తాపడం పనులు దసరా నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. కొత్తగా అఖండ దీపారాధన అందుబాటులోకి వచ్చిందని, 3 నెలల్లో కొండపైన 200 వసతి గదుల నిర్మాణం, 2 వేల వాహనాలకు పార్కింగ్ సదుపాయంతో పాటు కొండకింద 5 వేల మంది ఒకేసారి భోజనం చేసేందుకు అన్నదాన సత్రం కూడా అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి బంగారు తాపడానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. నిత్యాన్నదానం కోసం ఆలయ సిబ్బంది 285 మంది అందజేసిన ఒకరోజు వేతనం రూ. 5,30,000 విరాళం చెక్కును ఈవో భాస్కరరావు ఐలయ్యకు అందజేశారు.

డిప్యుటేషన్‌పై ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

హైదరాబాద్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పరిపాలనా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లను ప్రభుత్వం డిప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న ఎ.విజయజ్యోతిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్‌గా, నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న కె.వేణుగోపాల్ రెడ్డిని కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్, కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన రెవెన్యూ చట్టం ప్రజలకు వరం

» వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నూతన రెవెన్యూ చట్టం రాష్ట్ర ప్రజలకు వరం లాంటిదని వీఆర్వోల సంఘం(ట్రోవా) రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు గ్రామస్థాయిలో మళ్లీ రెవెన్యూ అధికారులను నియమించాలన్న రేవంత్ సర్కార్ ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్లో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి హాజరైన ఉపేంద్రరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో 5,139 మంది వీఆర్వోలకు తీవ్ర అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం కల్పిస్తుందని, ఫలితంగా రాష్ట్రంలో చనిపోయిన 178 మంది వీఆర్వోల కుటుంబాల్లో వెలుగులు నింపినట్లవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఒక్కడి వల్లనే తెలంగాణ రాలేదు

» అందరూ ఉద్యమిస్తేనే సాధ్యమైంది: కోదండరాం



నిజామాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేసీఆర్ ఒక్కడి వల్లనే తెలంగాణ రాష్ట్రం రాలేదని, ప్రజలంతా ఐక్యంగా ఉద్యమిస్తేనే రాష్ట్రం సిద్ధించిందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది ఉద్యమించారని, ఎన్నో సంఘాలు పని చేశాయని అన్నా రు. ఎంతో మంది బలిదానాల వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ నేత కేసీఆర్ తన స్వలాభం కోసమే ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని, బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని, అరెస్టులు చేసి నిరుద్యోగులపై నిర్బంధాలను అమలు చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు తమ స్వార్థం కోసం ప్రస్తుతం గ్రూప్-1 అభ్యర్థులను బీఆర్ఎస్ నేతలు వాడుకుంటున్నారని విమర్శించారు.

పాలించడం చేతకాకపోతే రాజీనామా చెయ్

» సీఎం రేవంత్ రెడ్డిపై కేఏ పాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పరిపాలించడం చేతకాకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల దాడిని ఖండించారు. హైడ్రా డ్రామా మాదిరిగా తయారైందని విమర్శించారు. నాగార్జునకు ఒక న్యాయం, రేవంత్‌రెడ్డి తమ్ముడికి ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పు చేస్తే, రేవంత్ కూడా అదే దారిలో నడుస్తున్నారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న తనను చంపుతామంటూ బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని.. దీన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

పేదల మాటున ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

» ప్రతిపక్షాలతో సీఎం జాగ్రత్తగా ఉండాలి: కూనంనేని



హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర చేస్తున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. పేద ప్రజల భుజాలపై తుపాకులు పెట్టి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోయాలని ఆ పార్టీలు చూస్తున్నాయని ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రా పేదలు, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూలుస్తోందంటూ బడాబాబులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండడమే కాక హైడ్రా చర్యలను కూడా కనిపెట్టుకొని ఉండాలని సూచించారు. చీకటి ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్, బీజేపీలు పైకి విమర్శించుకున్నట్లు నాటకమాడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పేదల జోలికి వస్తే సీపీఐ ఉపేక్షించదని, మిత్రపక్షంగా ఉన్నా సరే పేదల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై అభ్యర్థుల అనుమానాలను ప్రభుత్వమే నివృత్తి చేయాలని కూనంనేని సూచించారు.

చికెన్ బిర్యానీలో కప్ప!

» గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ మెస్‌లో ఘటన

రాయదుర్గం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీలోని కదంబమెస్‌లో విద్యార్థులకు వడ్డించిన బిర్యానీలో కప్ప దర్శనమిచ్చింది. ఈనెల 16న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాంమనోహర్ అనే విద్యార్థి క్యాంపస్‌లోని మెస్‌లో బిర్యానీ తింటుండగా చికెన్‌తో పాటు చనిపోయిన కప్ప కనిపించడంతో అందరూ నివ్వెరపోయారు. వెంటనే క్యాంపస్, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేశారు. మెస్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఇప్పటివరకు సిబ్బందిపై ఏ చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థుల మండిపడుతున్నారు.

మెట్రో పోలిస్ హోటల్ యజమాని, మేనేజర్ అరెస్ట్

» పరారీలో వ్యక్తిత్వ వికాస శిక్షకుడు మునావర్

» లాఠీచార్జీలో గాయపడిన వారికి ఎంపీ ఈటల పరామర్శ

» భక్తులు సంయమనం పాటించాలని వినతి

» ముత్యాలమ్మ ఆలయం వద్ద భారీ భద్రత

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలు రెచ్చగొట్టే కార్యకలాపాలను నిర్వహించిన సికింద్రాబాద్ మెట్రో పోలిస్ హోటల్ యజమాని రషీద్, మేనేజర్ రహమాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రషీద్‌ను ముంబైలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిత్వ వికాస శిక్షకుడు మునావర్ కోసం గాలిస్తున్నారు. మెట్రో పోలిస్ హోటల్‌లో వ్యక్తిత్వ వికాస శిక్షణ కోసం వచ్చిన యువకుడు కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. దీంతో హోటల్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు హోటల్‌ను సీజ్ చేశారు. ప్రాథమికంగా లభ్యమైన ఆధారాల మేరకు మెట్రో పోలిస్ హోటల్ మత విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలకు వేదికగా మారిందని, ఈ కార్యక్రమాలకు పోలీసుల అనుమతి కూడా లేదని పోలీసులు గుర్తించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసానికి నిరసనగా చేపట్టిన ర్యాలీలో పోలీసులపై దాడి ఘటనకు సంబంధించి 5 కేసులు నమోదయ్యాయి. మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో 4, గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. దాడులకు పాల్పడిన నిందితులను గుర్తించడానికి పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. బారికేడ్‌లు ఏర్పాటు చేసి స్థానికులను మాత్రమే అనుమతించారు. ఇతరులను అటు వైపు రాకుండా కట్టడి చేశారు. మీడియాను కూడా అనుమతించలేదు. ఆలయం సమీపంలో ఉన్న దుకాణాలను మూసి వేయించారు.

కార్యకర్తలకు ఈటల, బండి పరామర్శ

సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగిన లాఠీ చార్జీలో గాయపడిన బీజేపీ కార్యకర్తలు సాయికుమార్‌గౌడ్, వెంకటేష్‌లను కేంద్రహోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజెందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ రెండు నెలలుగా వరుసగా దేవాలయాల మీద దాడులు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ అడ్డాగా ముంబై, ఢిల్లీ, మధ్యప్రదేశ్ నుంచి వందల సంఖ్యలో ట్రైనింగ్ పేరిట ఉన్మాదాన్ని పెంచుతున్నారని అన్నారు. ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ధ్వంసం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కేంద్ర హోంమంత్రికి, రాష్ట్ర డీజీపీకి లేఖ రాసినట్లు ఈటల వెల్లడించారు. భక్తులు ఆగ్రహావేశాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలని కోరారు.

ప్రైవేటు ఆస్పత్రుల 'ఛీ'టింగ్!

(మొదటి పేజీ తరువాయి)



విధించారు. రాష్ట్రంలో అత్యధికంగా.. 2,788 ప్రైవేటు క్లినిక్కులు, ఆస్పత్రులు రాజధాని హైదరాబాద్‌లో ఉన్నాయి. వీటిలో నిబంధనలు, కనీస ప్రమాణాలు పాటించని 242 ఆస్పత్రులకు వైద్యశాఖ నోటీసులు జారీ చేసింది. వాటిలోనూ రెండు ఆస్పత్రులను మూసివేసింది. 52 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులిచ్చారు. షోకాజ్ నోటీసులందుకున్న ఆస్పత్రుల్లో కొన్ని అసలు రిజిస్ట్రేషనే చేయించుకోలేదు. మరికొన్ని.. ఆయుష్ వైద్యుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. మిగతా జిల్లాల విషయానికొస్తే.. ఆదిలాబాద్ జిల్లాలో 45% ఆస్పత్రులు నిబంధనలు పాటించట్లేదు. ఆ జిల్లాలో అనుమతులు పునరుద్ధరించుకోని 60 ఆస్పత్రులకు అధికారులు నోటీసులిచ్చారు. మరో 3 ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ లేండానే నడుస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో వైద్యశాఖ అనుమతి లేకుండా నడుస్తున్న 19 ఆస్పత్రులకు తాళాలు వేశారు. ఆ జిల్లాలో 593 ఆస్పత్రులుండగా.. వాటిలో నిబంధనలు పాటించని 56 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు. 38 ఆస్పత్రులకు రూ.3.18 లక్షల జరిమానా విధించారు.

ఇష్టారాజ్యంగా..

రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రోగుల చికిత్సకయ్యే వ్యయ పట్టికలను ప్రదర్శించడం లేదు. కొన్నిచోట్ల ఆయుష్ వైద్యులే అల్లోపతి వైద్యం చేస్తున్నారు. ముఖ్యంగా చాలా ఆస్పత్రులు అగ్నిమాపక నిబంధనలను పాటించడం లేదు. అలాగే ఆస్పత్రుల యాజమాన్యం మారినప్పటికీ ఆ విషయాన్ని వైద్యశాఖకు తెలియజేయడం లేదు. కొన్ని ఆస్పత్రులు పేరుకు స్పెషాలిటీ ఆస్పత్రులుగా చలామణీ అవుతున్నా.. అక్కడ రిజిస్టర్డ్ డాక్టర్స్ లేకపోవడం (ఎంబీబీఎస్ పూర్తయినా వైద్యమండలి వద్ద రిజిస్టర్ చేసుకోని వారు వైద్యం చేస్తున్నారు), జీవ వ్యర్థాల నిర్వహణ విధానాలను సరిగా పాటించకపోవడం, తమ ఆస్పత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్స్ ఉన్నట్లు చూపి.. ఎంబీబీఎస్ డాక్టర్స్‌తోనే రోగులకు చికిత్స అందించడం, మెటర్నిటీ ఆస్పత్రులుగా అనుమతులు పొంది మిగతా అన్ని రకాల వైద్య సేవలందించడం వంటి వాటికి పాల్పడుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఇక జగిత్యాల, సిరిసిల్ల లాంటి జిల్లాల్లో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులైతే వంద శాతం సిజేరియన్ ఆపరేషన్స్ చేస్తున్నాయి. పలు ఆస్పత్రుల్లోని ల్యాబుల్లో కనీస సౌకర్యాలు, ప్రమాణాలు పాటించట్లేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రియాంక ఆస్పత్రిలో ఓ గర్భిణీ ఈ ఏడాది జూన్ 2న మరణించింది. అక్కడ గైనకాలజిస్టు లేకున్నా.. పారా మెడికల్ సిబ్బందే ఆమెకు చికిత్స అందించినట్లు తేలింది. దాంతో ఆ ఆస్పత్రిని సీజ్ చేయడంతోపాటు రూ.50 వేలు జరిమానా కూడా విధించారు.

మరికొన్ని..

- మేడ్చల్ జిల్లాలో 2664 ఆస్పత్రులు ఉండగా.. వాటిలో రిజిస్ట్రేషన్ లేకుండానే నడుస్తున్న 57 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు. రూ.4 లక్షల పెనాల్టీ వేశారు. మరో 18 ఆస్పత్రుల అనుమతులను రద్దు చేశారు.
- సిద్దిపేట జిల్లాలో 240 ఆస్పత్రులుండగా.. 36 ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ లేకుండానే నడుస్తున్నాయి. 49 ఆస్పత్రుల్లో అర్హులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది లేరు. 35 ఆస్పత్రులకు రూ.3లక్షల జరిమానా విధించారు. మరో మూడింటిని మూసేశారు.
- భద్రాద్రి జిల్లాల్లో 381 ఆస్పత్రులుంటే వాటిలో 28 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు. వీటిలో 12 ఆస్పత్రులకు రూ.91,900 జరిమానా విధించగా, ఒక ఆస్పత్రిని మూసేశారు.
- హన్మకొండలోని 699 హాస్పిటల్స్‌లో.. 83 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు. 11 హాస్పిటల్స్‌కు రూ.63 వేలు జరిమానా వేశారు. 14 ఆస్పత్రులను యాజమాన్యాలే మూసేశాయి.
- జగిత్యాలలో 263 ఆస్పత్రులుండగా.. వాటిలో 41 హాస్పిటల్స్‌కు నోటీసులిచ్చారు. ఒక ఆస్పత్రిని మూసేశారు.
- జనగామలో 122 ఆస్పత్రులకుగాను.. పదిహేడింటికి నోటీసులిచ్చారు. రెండింటి లైసెన్స్‌లను రద్దు చేశారు. భూపాలపల్లిలో 46కుగాను.. 12 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు.
- కరీంనగర్ జిల్లాలో 554కు..162 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు. ఏడింటికి రూ.3లక్షల జరిమానా వేశారు. 9ఆస్పత్రులు మూతపడ్డాయి.
- ఖమ్మంలో 520 ఆస్పత్రులకుగాను.. ఐదింటికి నోటీసులివ్వగా, మరో ఐదింటిని మూసేశారు. ములుగులో పదిహేనింటికి నోటీసులిచ్చారు.
- నల్గొండలో 555 ఆస్పత్రులుంటే పదింటికి షోకాజ్ నోటీసులిచ్చారు. ఆరింటికి రూ.1.07 లక్షల ఫైన్ వేశారు. ఐదింటిని మూసేశారు.
- నారాయణపేటలో 135 ఉంటే ఐదింటికి నోటీసులిచ్చారు. నిర్మల్‌లో 101 ఆస్పత్రులకుగాను పదింటికి నోటీసులిచ్చారు. మరో మూడు ఆస్పత్రులకు ఫైన్ వేశారు.
- పెద్దపల్లి జిల్లాలో 137 ఆస్పత్రులకుగాను.. 26 హాస్పిటల్స్‌కు నోటీసులివ్వగా, మరో నాలుగింటిని మూసేశారు.
- సిరిసిల్ల జిల్లాలో 138 ఆస్పత్రులకుగాను 39 హాస్పిటల్స్‌కు నోటీసులిచ్చారు. మూడింటిని మూసేశారు.
- సూర్యాపేటలో 477 ఆస్పత్రులకుగాను.. వాటిలో రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న 15 ఆస్పత్రులకు రూ.5.08 లక్షల జరిమానా వేశారు. మరో ఎనిమిదింటిని మూసివేశారు.
- వరంగల్ జిల్లాలో 217 హాస్పిటల్స్‌కుగాను.. 40 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు. యాదాద్రి జిల్లాలో 14 ఆస్పత్రులకు నోటీసులిచ్చారు.



శ్రీనివాస్ శెట్టిని సన్మానిస్తున్న ఎంపీ మల్లు రవి తదితరులు

సామాజిక బాధ్యతల నిర్వహణలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందే

» ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాస్ శెట్టి

వనపర్తి, రాజీవ్ చౌరస్తా, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక బాధ్యతల నిర్వహణలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాస్ శెట్టి అన్నారు. ఆదివారం ఆయన వనపర్తి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కల్యాణ్ సాయి గార్డెన్స్‌లో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి జిల్లాలో ఎస్‌బీఐకి 55 శాతం బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయని, 45 శాతం మార్కెట్ షేర్ ఉందని చల్లా శ్రీనివాస్ శెట్టి తెలిపారు. పీఎం విశ్వకర్మ రుణాలు ఇవ్వడంలో తెలంగాణ ఎస్‌బీఐ టీం దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. ఫౌండేషన్ తరఫున దేశంలో వెయ్యి ప్రభుత్వ పాఠశాలలు, వెయ్యి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద తెలంగాణవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలకు చల్లా శ్రీనివాస్‌శెట్టి శ్రీకారం చుట్టారు. కాగా, చల్లా శ్రీనివాస్‌కు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, వనపర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల కలెక్టర్లు ఘనంగా స్వాగతం పలికి, ఆయనను సన్మానించారు.

రూ.వెయ్యి పెన్షన్ చెల్లింపు సిగ్గు చేటు

» రూ.7,500 పెన్షన్ సిఫారసును మోదీ ప్రభుత్వం తొక్కిపెట్టింది

» కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

» సామాజిక భద్రతకు ఉద్యమించాలి

» టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభలో వక్తల పిలుపు

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడంతోపాటు రూ.26 వేల కనీస వేతనం, సామాజిక భద్రత కోసం ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)లో ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం విలీన సభ జరిగింది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో టీయూసీఐ ఆలిండియా ఉపాధ్యక్షుడు అలీక్ చక్రవర్తి (బెంగాల్), టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షులు ఉమాకాంత్ (ఢిల్లీ), ఎన్‌టీయూఐ ఆలిండియా కార్యదర్శి దేవబ్రత శర్మ (అసోం), టీయూసీఐ మహారాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ నట్కర్, ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్.ఎల్. పద్మ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రెబ్బ రామారావు తదితరులు మాట్లాడారు. కార్మికులు జమచేస్తున్న ప్రావిడెంట్ ఫండ్‌కు రూ.వెయ్యిలోపు పెన్షన్ చెల్లించడం సిగ్గు చేటు అని, కార్మిక వర్గానికి సరైన సామాజిక భద్రత కల్పించడంలో కేంద్రం విఫలమైందని కృష్ణ విమర్శించారు. ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ బోర్డు.. రిటైర్ అయిన కార్మికులకు నెలకు రూ.7,500 పెన్షన్ ఇవ్వాలనే సిఫారసును గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం తొక్కి పెట్టడాన్ని తీవ్రంగా నిరసించారు. కార్మికులు మరింత పట్టుదలతో ఉద్యమించి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను నవీకరిస్తున్నామనే సాకుతో 29 కార్మిక, ప్రయోజన సంక్షేమ చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కేంద్ర ప్రభుత్వం గత కార్మిక హక్కులను హరించే చర్యలు చేపట్టిందని అలీక్ చక్రవర్తి అన్నారు. దేశంలో కార్మికవర్గం మరింతగా ఐక్యం కావాలన్నారు. కార్మిక సంఘ నిర్మాణ చట్టం అమల్లోకి వచ్చి 98 ఏళ్ల గడుస్తున్నా కార్మిక సంఘాన్ని నిర్మించుకుంటే సహించని యజమాన్యం ఇప్పటికీ దేశంలో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో అనేక రంగాల్లో పనిచేస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ టీయూసీఐలో చేరడాన్ని ఉమాకాంత్ ఆహ్వానించారు. శ్రమజీవులకు సరైన భద్రత, వేతనాలు, హక్కుల అమలుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మిక సంక్షేమ బోర్డు కనీస పెన్షన్ రూ.7,500 ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.హన్మేష్, ఎం.నరేందర్, కె.రాజన్న, సి.వెంకటేష్, జి.రామయ్య, పి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

షర్మిలతో రాయ బేరం!

(మొదటి పేజీ తరువాయి)



ఆమె కత్తి దూయడంతో జగన్‌కు దిమ్మతిరగడం మొదలైంది. తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె ఊరూవాడా ఎలుగెత్తి చెబుతూ, జగన్ నిజ స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేయగలిగారు. మరోవైపు చిన్నాన్న కుమార్తె సునీత విషయంలోనూ జగన్ అదే మొండి వైఖరితో వ్యవహరించి, బాబాయ్ హంతకులకే మద్దతిచ్చారు. దీంతో ఇద్దరు చెల్లెళ్లు ఏకమయ్యారు. సొంత జిల్లాలో జగన్‌కు వ్యతిరేక పవనాలు ప్రారంభమవడం పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెప్పింది. గడచిన ఐదేళ్లు జగన్‌కు మద్దతిచ్చిన బీజేపీ.. ఎన్నికల వేళ ఆయన్ను వదలి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి కట్టింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. దాంతో జగన్‌కు చుక్కలు కనిపించడం ఆరంభమైంది. మరోవైపు తన మీద ఉన్న కేసుల విషయంలో ఇన్నాళ్లు కేంద్రంలోని ప్రభుత్వం అండతో ఢిలాసాగా నెట్టుకొచ్చిన జగన్‌కు.. ఒక్కసారిగా సీన్ రివర్స్ అయింది. మొత్తంమీద రాష్ట్రంలో అధికారం పోయింది. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలోనూ వ్యతిరేక ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. కేంద్రంలో పెద్దల అండా దూరమైంది. ఇక ఎవరూ కరుణించే పరిస్థితి లేదు. మిగిలింది.. కాంగ్రెస్‌తో కాళ్లబేరానికి వెళ్లడమే! కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వంటి వాళ్లు జగన్ విషయంలో కొంత సాఫ్ట్‌గా ఉన్నారన్న వాదన ఉంది. కానీ ప్రధాన సమస్య షర్మిలే. ఇప్పుడు ఆమె చిన్నా చితకా నాయకురాలేమీ కాదు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు. ఆమెతో ఘర్షణ కొనసాగిస్తే తనకు కాంగ్రెస్ వైపు చూసే చాన్స్ ఉండదని జగన్‌కు అర్థమైంది. కాంగ్రెస్ అండ లేకపోతే భవిష్యత్తు శూన్యమని ఆయన గ్రహించారు. దాంతో గత్యంతరం లేక చెల్లితో రాయబేరాలు నడపడం మొదలెట్టారు. గత కొద్దిరోజులుగా ఆయన తరచూ బెంగళూరు వెళ్లి, షర్మిలతో ఆస్తుల పంపకాలకు సంబంధించి మంతనాలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, షర్మిల కోరిన విధంగా ఆస్తుల్లో వాటా ఇవ్వడానికి జగన్ ఓకే అన్నారన్నది సమాచారం. ఈ విషయంలో జగన్ మాట నిలబెట్టుకుంటే ఆయనను కాంగ్రెస్‌కు దగ్గర చేయడానికి షర్మిల కూడా సానుకూలంగా ఉన్నారని తెలుస్తోంది. వాస్తవానికి వైసీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తారన్న ప్రచారం కూడా ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ పార్టీతో సయోధ్యకే జగన్ పరిమితమయ్యే అవకాశముంది.

ఆ దెబ్బతో వణుకు..

ఎన్నికల వేళ 'వైనాట్ 175' అన్న ధీమాతో ఉన్న జగన్‌కు ఎవరు ఎన్ని హితోక్తులు చెప్పినా చెవికెక్కలేదు. సొంత చెల్లెళ్లకు అన్యాయం చేయడం సరికాదన్న మాటలను ఏ మాత్రం పట్టించుకోలేదు. పైగా, తన కూలి మీడియాతో షర్మిలపై అసభ్యకరమైన దూషణలతో దాడి కూడా చేయించారు. తీరా ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడం, ఆ తర్వాతి పరిణామాలు జగన్‌కు వెన్నులో వణుకు పుట్టించాయి. ఓటమి తర్వాత సొంత పార్టీలోని కీలక నేతలందరూ ఒక్కొక్కరుగా దూరమవడం ప్రారంభించారు. భజన బృందం తప్ప విగతా తటస్థులూ, కాస్తో కూస్తో పద్ధతిగా ఉండేవారు వెళ్లిపోవడం మొదలెట్టారు. మరోవైపు జగన్ ఉస్కో అనగానే రెచ్చిపోయి విచ్చలవిడిగా వ్యవహరించిన వారిపై చంద్రబాబు సర్కారు చర్యలకు శ్రీకారం చుట్టింది. దాంతో జగన్ దాదాపు ఏకాకి అయిపోవడం మొదలైంది. ఈ పరిస్థితిలో పార్టీ మనుగడ సాగించాలన్నా, తనకు రాజకీయ భవిష్యత్తు ఉండాలన్నా ఏదో ఒక జాతీయ పార్టీ సహకారం అవసరమన్న వాస్తవం జగన్‌కు అవగతమైంది.

సాములోరికి స్టార్ హోటల్

» దీని మర్మమేమి స్వరూపానంద?

» ఆధ్యాత్మిక సేవ అంటూ భీమిలీలో భూమి ఆనక.. ఆదాయార్జనకు భారీ ఏర్పాట్లు

» జగన్ హయాంలో గుట్టుగా భూదందా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్వాములు అంటే సర్వసంగ పరిత్యాగులు. ఆడంబరాలు, విలాసాలకు దూరంగా ఉంటారు.. అయితే, స్వాములందు ఈ స్వామి వేరయా అన్నట్లు శారదా పీఠం సాములోరు అవతరించారు. తొలుత వేద విద్య కోసం అంటూ గత ప్రభుత్వాన్ని భూమిని కోరారు. ఆ తర్వాత ఆ భూమిని మార్పించుకొని నచ్చిన భూమిని తీసుకున్నారు. అక్కడితో ఆగకుండా ఆధ్యాత్మికం పేరిట భారీగా సొమ్ములు సంపాదించుకునేందుకు, బోర్డింగ్ హౌస్‌ల పేరిట సముద్రతీరం కనిపించేలా భారీ స్టార్ హోటల్ నిర్మించుకునేందుకు సకల అనుమతులు పొందారు. తీసుకునే అనుమతి రికార్డుల్లో ఒకటి ఉంటుంది. ఆచరణలో దాన్ని మరో రేంజ్‌కు తీసుకెళ్తారు. ఇది ఆయన ఆచరణే. ఇలా సాములోరికి అడ్డగోలు మేలుచేయడానికి వీల్లేదని, ప్రజల ఆస్తులను సాములోరికి సమర్పించకూడదన్న కనీస స్పృహ నాటి రెవెన్యూ అధికారులకు లేకుండా పోయింది. నాటి సీఎం జగన్‌కు సాములోరు గురువు సమానులు కాబట్టి వారికి సందేహాలు వచ్చే చాన్స్ కూడా లేదు. అందుకే చకచకా చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ మరో నెల రోజుల్లో రావచ్చన్న సంకేతాలుండటంతో రెవెన్యూశాఖ పోటీపడి సాములోరి సేవలో ఆనాడు తరించింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం ఈ ఏడాది ఫిబ్రవరి 6న రెవెన్యూశాఖ ఇచ్చిన జీఓ 47.

ఆధ్మాత్మికత ముసుగులో..

శారదాపీఠం శ్రీ శంకరచార్యుల బోధనలకు అనుగుణంగా ప్రజల్లో వేద విద్య, వేద సంస్కృతిని పెంపొందిస్తామని కారణాలు చెప్పి పీఠం ప్రభుత్వం నుంచి 2021లో 225 కోట్ల విలువైన 15 ఎకరాలను విశాఖ జిల్లా భీమిలీ మండలం కొత్తవలసలో పొందింది. ఇక భూ కేటాయింపులో రెవెన్యూశాఖ ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని ఇదివరకే 'ఆంధ్రజ్యోతి' ఆధారాలతో సహా బయటపెట్టింది. ఇప్పుడు, కొత్త విషయమేమంటే, తమకు కేటాయించిన భూమిలో ముందు చెప్పినట్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతోపాటు ఆదాయార్జన పనులు కూడా చేపడుతామని, కాబట్టి, అందుకు అనుమతివ్వాలని పీఠం 2023 నవంబరు 20న విశాఖ కలెక్టర్‌ను కోరింది. దీన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకోలేదు. నాటి సీఎం కార్యాలయంలో పనిచేసిన అధికారి విశాఖ కలెక్టర్‌పై ఒత్తిడి తేగా, పీఠం రాసిన లేఖపై తన రిమార్క్‌లు ప్రస్తావిస్తూ ఈ ఏడాది జనవరి 19న రెవెన్యూశాఖకు నివేదిక పంపారు. అంతే, 24 గంటల్లో శారదాపీఠం పంపిన లేఖను ఆంధ్రప్రదేశ్ భూనిర్వహణా వ్యవస్థ (ఏపీఎమ్ఏ)లో ఆమోదించి, రెవెన్యూశాఖకు పంపించారు. ఆ తర్వాత ఫిబ్రవరిలో రెవెన్యూశాఖ సాములోరి విన్నపాల మేరకు జీవో జారీ చేసింది.

బోర్డింగ్ హౌస్ పేరిట..

బోర్డింగ్ హౌస్ పేరిట సాములోరు కొత్తవలసలో తనకిచ్చిన భూమిలో స్టార్ హోటల్ కట్టేందుకు సకల సన్నాహాలు చేస్తున్నట్లు అధికారవర్గాలు గుర్తించాయి. దీనిపై ఓ రెవెన్యూ అధికారి పీఠం ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. మీరు స్టార్ హోటల్ కట్టకూడదు. అది తప్పు అని వారించినట్లు తెలిసింది. 'ఆదాయార్జనకు భూమిని వినియోగించుకోవచ్చని (జగన్) ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది ఉల్లంఘనా..? అనుమతిచ్చి, వద్దంటారా? ఇదెక్కడి న్యాయం?' అని పీఠానికి చెందిన ఓ వ్యక్తి.. ఆ అధికారికి చెప్పినట్లు తెలిసింది. దీంతో పీఠానికి ఇచ్చిన అనుమతుల ఉత్తర్వుల ఫైలు, వాటికి సంబంధించిన నోట్‌ఫైల్స్‌ను తెప్పించి పరిశీలన చేశారు. ఇందులోనూ పెద్ద గోల్‌మాలే నడిచినట్లు తెలిసింది.

గుట్టుగా కానిచ్చేశారు

ఆదాయార్జనకు అనుమతి ఇవ్వాలని తొలుత శారదాపీఠం ప్రతినిధులు నాటి సీసీఎల్‌ఏ జి.సాయిప్రసాద్‌ను కలిసి విన్నవించారు. ఇందుకు ఆయన తిరస్కరించారు. ఆదాయార్జనకు అనుమతి ఇవ్వలేమని తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఎల్ఎమ్ఏలోనూ దీన్ని అజెండాగా చేర్చాల్సిన అవసరం లేదని తేల్చారని తెలిసింది. ఇదంతా ఈ ఏడాది జనవరి తొలివారంలో జరిగింది. అయితే, సాయిప్రసాద్ జనవరి రెండోవారంలో సెలవు పెట్టారు. దాన్ని అదే నెల 25 వరకు పొడిగించుకున్నారు. అప్పుడు ఓ జూనియర్ అధికారికి ఇన్‌చార్జి సీసీఎల్‌ఏ పదవిని కట్టబెట్టారు. సరిగ్గా ఇదే సమయం అనుకున్న పెద్దలు ఆ ఇన్‌చార్జి సీసీఎల్‌ఏ ద్వారా మంత్రాంగం నడిపించారు. జనవరి 19న కలెక్టర్‌తో లేఖ తెప్పించుకొని, 20వ తేదీన ఆదాయార్జనకు అనుమతి ఇవ్వాలన్న పీఠం డిమాండ్‌కు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వానికి ఫైలు పంపించారు. ఇది జరిగిన ఐదు రోజుల తర్వాత సాయిప్రసాద్ సెలవు ముగించుకొని వచ్చి ఉద్యోగంలో చేరారని తెలిసింది. ఇదంతా ఇప్పుడు బయటపడటంతో రెవెన్యూ అధికారులు విస్తుపోతున్నారు.



సభలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బీఆర్ఎస్ హయాంలో రూ.25వేల కోట్ల దుర్వినియోగం

» సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు: తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సాగులో లేని భూములకు కూడా రైతుబంధు ఇచ్చి రూ.25వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసిన ఖ్యాతి మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పథకాల పేరుతో రూ.7,600 కోట్ల అప్పులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో పెట్టిందన్నారు. గత ప్రభుత్వంలో చేసిన వందల కోట్ల అప్పులను తాము తీరుస్తున్నామన్నారు. రైతుబంధు పథకం పేరుతో వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ యాంత్రీకరణ, పంటల బీమా, డ్రిప్ ఇరిగేషన్ పథకాలను బీఆర్ఎస్ బొందపెట్టిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండదండగా నిలుస్తుందని తుమ్మల చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో మొదటి ఏడాదిలోనే రైతులకు రూ.27వేల కోట్లు సంక్షేమానికి చెల్లించామన్నారు. సన్న వడ్లకు క్వింటాళ్లకు రూ.500 బోనస్‌తో ఎకరానికి రూ.8-10వేల వరకు ప్రోత్సాహకం అందుతుందన్నారు. వరంగల్‌లో చేసిన రైతు డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని, డిసెంబర్ 9 నాటికి పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ అమలు చేస్తామని తుమ్మల స్పష్టం చేశారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ అభ్యర్థుల జాబితా సిద్ధం

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కాలేజీల్లోని లెక్చరర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

అటవీ శాఖ అదనపు కార్యదర్శిగా ప్రశాంతి

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి బదిలీపై వచ్చి ఏపీలో రిపోర్ట్ చేసిన ఐఏఎస్ అధికారిణి ఎం.ప్రశాంతికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అటవీ శాఖలో అదనపు కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 నుంచి ఆమె ఏపీలో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంగ్లీషు రాక ఒకరు.. హాస్టల్ నచ్చక మరొకరు

» ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2 విద్యార్థులు మృతి

చిలుకూరు, మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదివి... ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమంలో మార్కులు తక్కువ వస్తుండటంతో మనస్తాపం చెంది హాస్టల్ గదిలో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిలుకూరులోని కవిత కళాశాలలో ఫస్ట్‌ఇయర్ చదువుతున్న భీమన వినయ్(17) దసరా సెలవులకు వెళ్లి ఆదివారమే వచ్చి టవల్‌తో ఉరేసుకున్నాడు. మరో ఘటనలో... హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి చెందింది. మిర్యాలగూడ గురుకుల విద్యార్థిని శిరీష (14) పండుగ సెలవులకు వెళ్లి వచ్చేముందే గడ్డిమందును తాగి వచ్చి హాస్టల్‌లో అస్వస్థతకు గురైంది. మూడు రోజులుగా వెంటిలేషన్‌పై చికిత్స పొందుతూ జిల్లా ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందింది.

నేడు రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకతలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ సోమవారం రాత్రి హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నెలాఖరు వరకు ఆయన హైదరాబాద్‌లో ఉండి అధికారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియను కొనసాగించనున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, రిటైర్డ్ అధికారుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ఈ దఫా పూర్తి చేసే అవకాశం ఉంది. తర్వాతి దఫాలో గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులను ఆయన విచారించే అవకాశం ఉంది. మరోవైపు కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా, మరో రెండు నెలలు పొడిగించే అవకాశం ఉంది.

అనుమతులుంటే కూల్చం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించి సాధారణ పౌరులకు విక్రయించినవే. ఇందులో కొన్ని అనుమతులు ఉన్నవి కాగా.. ఇంకొన్ని అనుమతులిచ్చి అనంతరం రద్దు చేసినవి. కొన్ని నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఇందులో అనుమతులున్న భవనాలను హైడ్రా కూల్చివేయడంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోయారు. అయితే, చెరువుల వద్ద ఉన్నా అనుమతులుంటే ఆ నిర్మాణాలను కూల్చమని హైడ్రా తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో గతంలో పర్మిషన్ ఉన్నా కూల్చివేతలు చేపట్టడంతో నష్టపోయిన సామాన్యుల పరిస్థితి ఏంటి ? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిజానికి ఏదైనా నిర్మాణానికి అనుమతులిచ్చి రద్దు చేస్తే... నిర్మాణ పనులు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. కానీ, నిర్మాణదారులతో కుమ్మక్కైన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అనుమతుల రద్దు సంగతి తెలియక, పాత పత్రాలను చూసి ఇళ్లు కొనుగోళ్లు చేసిన వారు ఇప్పుడు నష్టపోయారు. ఈ బాధితుల అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

పదోన్నతులకు మోక్షమెప్పుడు?

డీఎంఈ పరిధిలో నత్తనడకన నిర్ణయాలు.. ఇన్‌చార్జిల పాలనలోనే మెడికల్ కాలేజీలు

» సూపరింటెండెంట్ల భర్తీలోనూ తీవ్ర జాప్యం

» డైటీషియన్, బయోకెమిస్ట్, లైబ్రేరియన్ వంటి పోస్టులన్నీ పదోన్నతులతో భర్తీ చేయాల్సినవే

» పదేళ్లుగా మారని తీరు.. కోర్టుకెక్కిన ఉద్యోగులు

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య సంచాలకుల(డీఎంఈ) పరిధిలో నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. పదోన్నతులు, పదవుల భర్తీ.. వంటి నిర్ణయాలన్నీ నత్తనడకను తలపిస్తున్నాయి. సర్కారు మారినా తమ తలరాతలు మారలేదని, బీఆర్ఎస్ సర్కారు హయాం నాటి పరిస్థితే ఇప్పటికే కొనసాగుతోందని చిరుద్యోగులు వాపోతున్నారు. ముఖ్యంగా డైటీషియన్స్, బయోకెమిస్ట్, లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉన్నా.. ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణంతో వాయిదా వేస్తున్నారు. ఏటా హడావుడిగా పదోన్నతుల ఫైలు పెట్టడం, ప్యానెల్ ఇయర్ ముగిసే దాకా సాగదీయడం, ఆ తర్వాత మళ్లీ పక్కన పెట్టడమనేది ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా డీఎంఈ అధికారులు అదే తంతు కొనసాగించారు. దీంతో ఈ విషయమై పది మంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో డీఎంఈ వాణికి వ్యక్తిగతంగా నోటీసులు అందే అవకాశం ఉందని బాధితులు చెబుతున్నారు. వాస్తవానికి డీఎంఈ పరిధిలో 34 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆస్పత్రులు ఉన్నాయి. హైదరాబాద్‌లోని నీలోఫర్, పేట్ల బురుజు, చెస్ట్, మానసిక ఆస్పత్రులు డీఎంఈ పరిధిలోకే వస్తాయి. ఈ మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆస్పత్రులకు ఇప్పటి వరకు రెగ్యులర్ ప్రిన్సిపాల్స్, సూపరింటిండెంట్స్‌ను నియమించలేదు. ఈ పోస్టులను అడిషనల్ డీఎంఈ హోదా ఉన్న వారితోనే భర్తీ చేయాల్సి ఉండగా.. ఇన్‌చార్జిల పాలనతోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం అడిషనల్ డీఎంఈలు 17 మందే ఉన్నారు. మరో 47 మందికి అడిషనల్ డీఎంఈలుగా పదోన్నతి కల్పించాల్సి ఉన్నా.. ఆ ఫైలు నెలలుగా పెండింగ్‌లోనే ఉంది. బోధనాస్పత్రుల్లోని డైటిషీయన్స్ పోస్టులను పదోన్నతులతోనే భర్తీ చేయాల్సి ఉంది. కానీ, తెలంగాణ ఏర్పాటు నుంచి నేటి వరకు ఆ పోస్టుల జోలికి వెళ్లలేదు. 34 బోధన ఆస్పత్రులు ఉంటే... ఇద్దరు, ముగ్గురు డైటీషియన్స్ మాత్రమే పని చేస్తున్నారు. ప్రస్తుతం 42 డైటీషియన్స్, 27 బయోకెమిస్టు, 44 లైబ్రేరియన్, 22 అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా.. పదేళ్లుగా నాన్చుతున్నారు. ఈ విషయమై అర్హులైన అభ్యర్థులందరూ ఇప్పటికే వైద్య మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి.. ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన వెంటనే పదోన్నతులు చేపట్టాలని డీఎంఈను ఆదేశించారు. కానీ, నెలలు గడుస్తున్నా.. ఆ ఆదేశాలను పట్టించుకున్న వారే లేరన్న వాదన వినిపిస్తోంది. పదోన్నతుల జాబితాలో ఉన్న వారి స్టడీ సర్టిఫికెట్లు నకిలీవని, విభాగాధిపతుల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోలేదన్న కారణం చూపుతూ ఇన్నేళ్లుగా పదోన్నతులను నిరాకరిస్తూ వస్తున్నారు. ప్రస్తుత డీఎంఈ కూడా అదే పద్ధతిలో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధైర్యం ఉంటేనే ఎదుగుతాం

గొప్ప పనులు చేయాలంటే రిస్క్ తీసుకోవాలి.. త్యాగానికి సిద్ధంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు

» ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమిట్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంలో శ్రీనిరాజు, ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ధైర్యం ఉండి, త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉంటే.. ఏదైనా సాధించవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రజలతో నిత్యం సంబంధాలు పెట్టుకోవాలని, పేదలు-ధనికులు, బలవంతుడు-బలహీనుడు, చిన్నా-పెద్దా అన్న భేదం లేకుండా అందరికీ సమాన గౌరవం ఇస్తూ అందరిని కలుపుకొని పోవాలని చెప్పారు. గొప్ప నాయకులు త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నిర్వహించిన లీడర్‌షిప్ సమిట్‌లో ముఖ్యమంత్రి పాల్గొని 'లీడర్‌షిప్ ఇన్ న్యూ ఇండియా' అనే అంశంపై ప్రసంగించారు. "కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన వారసత్వం ఉంది. మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి నాయకులే దీనికి ఉదాహరణ. వీరందరి నుంచి మనం చాలా నేర్చుకోగలం. ఎంతటి గొప్ప నాయకుడికైనా ధైర్యం చాలా ముఖ్యం. తెలివితేటలు, నైపుణ్యం, కష్టపడి పనిచేయడంతోపాటు కొన్నిసార్లు అదృష్టం కూడా అవసరం. గొప్ప పనులు చేయడానికి రిస్క్ తీసుకోవాలి. రిస్క్ తీసుకోకుండా కొన్ని సాధించలేం. మన పోరాటంలో మనం చాలా కోల్పోవచ్చు. దేశంలోని గొప్ప కాంగ్రెస్ నాయకులు, ప్రజల కోసం తమ వృత్తిని, డబ్బును, సుఖాలను, స్వేచ్ఛతో పాటు వారి జీవితాన్ని కూడా త్యాగం చేశారు" అని ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్ నగరం దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం తనకు ఇష్టం లేదని, ప్రపంచస్థాయి నగరాలతో పోటీ పడాలని అన్నారు. న్యూయార్క్, లండన్ పారిస్, టోక్యో, సియోల్ లాంటి అంతర్జాతీయ నగరాలతో హైదరాబాద్ పోటీపడాలన్నది తన ఆకాంక్ష అని తెలిపారు. ఇది కష్టం కావచ్చునేమో గానీ.. అసాధ్యం కాదని పేర్కొన్నారు.

ఎక్కడికెళ్లినా తెలంగాణ గురించి చెప్పండి..

"ఐఎస్‌బీ విద్యార్థులుగా మీరు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్‌లు. తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే హైదరాబాద్‌ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాలి. దీనికి మీలాంటి అందరి సహకారం కావాలి. తెలంగాణను ప్రపంచంలోని ప్రతి భాగానికి తీసుకెళ్లడానికి మీ సహాయం కావాలి. మీరు ఎక్కడికి వెళ్లినా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలతో తెలంగాణ గురించి, హైదరాబాద్ గురించి మాట్లాడండి. మీరు ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల్లో పనిచేయవచ్చు. సొంతంగా కంపెనీలు స్థాపించవచ్చు. ఎక్కడికెళ్లినా, ఏ హోదాలో ఉన్నా.. జీవితంలో రెండు మూడేళ్లు తెలంగాణకు కేటాయించండి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయండి. కార్పొరేట్ కంపెనీల్లాగా ప్రభుత్వం మీకు పెద్ద పెద్ద వేతనాలు ఇవ్వకపోవచ్చు. కానీ, మీలాంటి యువ మేధస్సులకు గొప్ప సవాళ్లు, అనేక అవకాశాలు మాత్రం ఇవ్వగలను" అని రేవంత్ చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. దీనికి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర చైర్మన్‌గా, శ్రీనిరాజు కో చైర్మన్‌గా ఉన్నారని చెప్పారు. అలాగే ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను రాష్ట్రంలోని ఇతర నగరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే తన ఆలోచన అని, దీనికి అందరి సహాయ సహకారాలు కావాలని కోరారు.

వ్యవసాయానికి విజ్ఞానం తోడు కావాలి

» 'రైతునేస్తం' పురస్కారాల ప్రదానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విజయవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధనా ఫలాలు కేవలం ల్యాబొరేటరీలకు పరిమితం కాకుండా అవి మరింత విస్తృత స్థాయిలో రైతులకు చేరాలని, అప్పుడే నిజమైన రైతు విప్లవం జరుగుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. పరిశోధనల ఫలితాలను రైతుల దరికి చేర్చటానికి పత్రికలు, ప్రసార మాధ్యమాలు ఎంతో దోహదపడతాయని, వాటిని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో 'రైతునేస్తం' వ్యవసాయ మాసపత్రిక 20వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులకు రైతునేస్తం పురస్కారాలు-2024 అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓవైపు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు, మెరుగైన పరిశోధనా ఫలితాలు వస్తున్నాయని, ఇదే సమయంలో మరోవైపు రైతుల సమస్యలను చూస్తుంటే బాధేస్తోందన్నారు. మన పండగలు, ఆచార వ్యవహారాలన్నీ వ్యవసాయంతో ముడిపడి ఉంటాయన్నారు. రైతులు లేకపోతే ఎవరూ బతకలేరన్న విషయాన్ని గుర్తుంచుకుని అందరూ వ్యవసాయానికి, అన్నదాతలకు మద్దతు పలకాలన్నారు. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత లేకుండా చేయగలిగే శక్తి రైతులకు ఉందన్నారు. వ్యవసాయం మరింత విస్తృతం కావాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత వ్యవసాయ రంగంలోకి అడుగులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

జీవో 317పై నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ముందు ప్రభుత్వ కొలువుల కేటాయింపులో కొత్త జోనల్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలోని పది జిల్లాలు కలిపి జోన్5, జోన్ 6 కింద ఉండేవి. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి జిల్లాల సంఖ్య పెరిగిన తర్వాత రాష్ట్రం మొత్తాన్ని ఏడు జోన్లుగా, రెండు మల్టీ జోన్లుగా చేశారు. దీనికి కేంద్రం 2021లో ఆమోదం తెలిపింది. అలాగే జిల్లాలు, జోన్లు, మల్టీజోన్లుగా మూడంచెల కేడర్లను రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల పోస్టులను కేటాయిస్తూ సర్కారు జీవో జారీ చేసింది. కొత్త జోన్ల వ్యవస్థ ఏర్పాటుకావడంతో వాటికి ఉద్యోగాలను, ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియలో భాగంగా 2021 డిసెంబరు 6న జీవో నంబరు 317ను విడుదల చేశారు. పాత జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లలోని ఉద్యోగులు, ఆ పాత జిల్లాల పరిధిలోని కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లలో తాము కావాలనుకున్న స్థానానికి వెళ్లేందుకు అవకాశం ఇచ్చారు. ఉద్యోగులు ఇచ్చిన ఆప్షన్స్ మేరకు సీనియారిటీ ప్రకారం అక్కడున్న ఖాళీల ఆధారంగా ఉద్యోగులను బదిలీ చేశారు. అయితే, ఏదైనా జిల్లాలో తగినన్ని ఖాళీలు లేకపోతే.. ఆ జిల్లాకు ఆప్షన్ ఇచ్చినప్పటికీ ఖాళీలు ఉన్న మరో జిల్లాకు ఉద్యోగులను బదిలీ చేశారు. దీంతో స్థానికత, స్పౌజ్ కోటా తదితర అంశాలు తెరపైకి రాగా జీవీ317కి వ్యతిరేకంగా ఉద్యోగులు ఆందోళనలు చేశారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే జీవో 317 బాధితుల సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చిన రేవంత్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపసంఘాన్ని వేశారు.

రేవంత్.. హిందూ వ్యతిరేకి

హిందువుల తలలు పగలగొడతారా

ఇది కాంగ్రెస్ దురహంకారానికి నిదర్శనం

పరీక్షలూ సక్రమంగా పెట్టలేరా..?: కిషన్‌రెడ్డి



చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్/కుషాయిగూడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఒక వర్గాన్ని మచ్చిక చేసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హిందూ వ్యతిరేక వైఖరిని అనుసరిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడికి నిరసనగా హిందూ సంఘాలు ఆందోళన చేస్తే.. వారిపై పోలీసుల చేత ఎందుకు పాశవిక దాడికి ఆదేశించారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్‌లో వందలాది మంది కార్యకర్తలు తలలు పగిలాయని.. చేతులు, కాళ్లు విరిగాయని మండిపడ్డారు. ఆలయంపై దాడి జరిగితే నిరసన తెలిపే హక్కు లేదా? అని నిలదీశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందూ సంఘాలపై పోలీసుల దమనకాండ, అశోక్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ కాంగ్రెస్ ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పూర్తి హిందూ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. వినాయకచవితి, బోనాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా అనేకమందిపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. కొన్ని ప్రార్థనా కేంద్రాల్లో ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వస్తున్న శబ్దాలు పోలీసులకు, ముఖ్యమంత్రికి వినబడవా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఓట్ల కోసం రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు అశోక్‌నగర్ లైబ్రరీకి వెళ్లి కాకమ్మ కబుర్లు చెప్పారని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పులే కాంగ్రెస్ హయాంలోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. జీవో 29 విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

చర్లపల్లి స్టేషన్ సందర్శన..

చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను త్వరలోనే ప్రారంభిస్తామ కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. స్టేషన్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రధానంగా కనెక్టివిటీ, అప్రోచ్ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందని, ఈ విషయమై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవ తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. కాగా, చర్లపల్లి రైల్వే టర్మినల్ ఉత్తరం వైపు రోడ్డు విస్తరణను వ్యతిరేకిస్తూ మహాలక్ష్మినగర్ కాలనీ మహిళలు కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. రోడ్డు విస్తరణతో తాము ఇళ్లను కోల్పోతామని.. ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని విన్నవించారు.

రాహుల్.. అబద్ధాల మిషన్: లాల్‌సింగ్ ఆర్య

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. అబద్ధాల మిషన్ అని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య విమర్శించారు. రిజర్వేషన్లు, రాజ్యాంగంపై ఆయన లోక్‌సభ ఎన్నికల ముందు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అబద్ధాలు ప్రచారం చేయడం వల్లనే జమ్మూ కశ్మీర్, హరియాణాల్లో కాంగ్రెస్, ఓటమి పాలైందన్నారు.

ఈఆర్సీ హడావుడి

» దిగిపోతూ కీలక నిర్ణయాలు!

» విద్యుత్ సంస్థల 9 పిటిషన్లపై నేటి నుంచి 25 వరకు కీలక విచారణలు

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పదవీ కాలం ముగింపునకు సరిగ్గా 10 రోజుల ముందు.. అత్యంత కీలక నిర్ణయాలు తీసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) సిద్ధమైంది. ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 29తో ముగియనుంది. అయితే.. రాష్ట్ర ప్రజలపై భారం పడేలా తెలంగాణ విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన మొత్తం 9 పిటిషన్లపై.. ఆలోగానే ఈఆర్సీ కీలక నిర్ణయాలను తీసుకోబోతోంది. నిజానికి ఈ పిటిషన్లను విద్యుత్ సంస్థలు నిరుడు నవంబరులోగా వేయాల్సి ఉండగా.. నిర్దేశిత గడువుకి చాలా ఆలస్యంగా గత నెలలో వేశాయి. ఒకేసారి పెద్ద సంఖ్యలో దాఖలైన ఈ పిటిషన్లను చదివి రాతపూర్వకంగా అభ్యంతరాలను సమర్పించడానికి కేటాయించిన సమయం సరిపోదని, కాబట్టి అభ్యంతరాల సమర్పణకు గడువు పొడించాలని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ), విద్యుత్ రంగ నిపుణులు ఎం.వేణుగోపాల్ రావు తదితరులు చేసిన విజ్ఞప్తులను ఇప్పటికే ఈఆర్సీ తోసిపుచ్చింది. ఈ పిటిషన్లపై సోమవారం (20వ తేదీ) నుంచి శుక్రవారం (25వ తేదీ) వరకు వరుసగా ఐదు రోజుల పాటు హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లాలో బహిరంగ విచారణ జరపాలని నిర్ణయించింది. ఆ తర్వాత 4 రోజుల పదవీకాలమే మిగిలి ఉండనుండగా.. ఆలోపే హడావుడిగా 9 కీలక పిటిషన్లపై కమిషన్ ఉత్తర్వులను వెలువరించడానికి సిద్ధం కావడం చర్చనీయాంశమైంది. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద సంఖ్యలో టారిఫ్, ఏఆర్ఆర్, ఎంవైటీ పిటిషన్లపై ఈఆర్సీ హడావుడిగా నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు లేవు. కాగా.. విద్యుత్ సంస్థల పిటిషన్లలోని ప్రతిపాదనలపై విద్యుత్ రంగ నిపుణులు, పారిశ్రామికవేత్తలు నుంచి పెద్ద ఎత్తున రాతపూర్వక అభ్యంతరాలు ఈఆర్సీకి అందాయి.

విచారణలు ఇలా..

- 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.963.18 కోట్ల ట్రూ అప్ చార్జీల వసూలుకు అనుమతి కోరుతూ జెన్‌కో దాఖలు చేసిన పిటిషన్‌పై హైదరాబాద్ జీటీఎస్ కాలనీలోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో ఉదయం 10.30 నుంచి ఈఆర్సీ బహిరంగ విచారణ ప్రారంభం కానుంది.
- 2024-29 మధ్యకాలానికిగాను తమ ట్రాన్స్‌మిషన్ బిజినెస్, ఎస్ఎల్‌డీసీ యాక్టివిటీకి సంబంధించి ట్రాన్స్‌కో దాఖలు చేసిన రెండు ఎంవైటీ పిటిషన్లపై రేపు ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది. వచ్చే ఐదేళ్లలో మొత్తం రూ.16,346.1 కోట్ల ఆదాయ అవసరాలున్నట్టు అంచనా వేస్తూ ఆ మేరకు ట్రాన్స్‌మిషన్ చార్జీల వసూళ్లను ట్రాన్స్‌కో ప్రతిపాదించింది. 2019-24 మధ్యకాలానికి సంబంధించిన ట్రాన్స్‌కో ఆదాయ అంచనాలతో పోల్చితే ఇది రూ.584.59కోట్లు అధికం కావడం గమనార్హం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రాష్ట్రంలో రూ.1200కోట్ల మేర విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ దాఖలు చేసిన రెండు వేర్వేరు ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) పిటిషన్లతో పాటు 2024-29 మధ్యకాలానికి సంబంధించిన మరో రెండు ఎంవైటీ పిటిషన్లపై బుధవారం హైదరాబాద్‌లో, గురువారం నిజామాబాద్‌లో ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది. హెచ్‌టీ కేటగిరీ విద్యుత్ చార్జీల పెంపు, ఎల్టీ కేటగిరీలో కూడా నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగించే వారికి ఫిక్స్‌డ్ చార్జీ (డిమాండ్ చార్జీ)ల పెంపును ఏఆర్ఆర్ పిటిషన్‌లో డిస్కంలు ప్రతిపాదించాయి. హెచ్‌టీ కేటగిరీకి చార్జీల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రూ.100 కోట్ల భారం పడనుంది. నవంబరు 1నుంచి పెంపు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

సెస్‌లో చార్జీల పెంపుపై 25న..

సిరిసిల్లా జిల్లాకు విద్యుత్ సరఫరా చేసే కో-ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై లిమిటెడ్(సెస్) పరిధిలో రూ.5కోట్ల విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదిస్తూ దాఖలు చేసిన ఎంవైటీ పిటిషన్‌పై ఈ నెల 25న సిరిసిల్లాలో ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్

హామీలు నెరవేర్చే వరకు అలాగే పిలుస్తాం.. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని మోసం

» సీఎంకు ధైర్యం ఉంటే అశోక్ నగర్ వచ్చి నిరుద్యోగులతో మాట్లాడాలి

» మూసీ నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు



తిమ్మాపూర్/గజ్వేల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను దగా చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తన పేరును ఎగవేతల రేవంత్‌రెడ్డి అని మార్చుకోవాలని సూచించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ఆయనను ఆ పేరుతోనే పిలుస్తామన్నారు. చీఫ్ మినిస్టర్ అని పిలిపించుకుంటారో, చీప్ మ్యాన్.. చీటింగ్ మ్యాన్ అని పిలిపించుకుంటారో ఆయనే తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో బీఆర్ఎస్ అలయ్‌బలయ్ కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగాను, తర్వాత సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోనూ ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వాళ్ల గ్యారెంటీల గారడీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీతో కలిసి హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి ఏడాదికి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఉద్యోగాలు అడుగుతున్న యువతను రాక్షసుల్లా వేధిస్తున్నారన్నారు. సీఎంకు ధైర్యం ఉంటే సెక్యూరిటీ లేకుండా సెంట్రల్ లైబ్రరీకి వచ్చి నిరుద్యోగులతో మాట్లాడాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఒకే విడతలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పటికి మూడు విడతల్లో కూడా పూర్తిస్థాయిలో చేయలేకపోయారన్నారు. రుణమాఫీ చేస్తానని దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తప్ప దేశంలో ఎవ్వరూ లేరన్నారు. దేవుడిని కూడా మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డినే చూస్తున్నామన్నారు. పాలకుడే పాపం చేస్తే రాజ్యానికి అరిష్టమని ఓ అయ్యగారు తనకు చెప్పారని, రేవంత్ రెడ్డి వల్ల ప్రజలకు ఎక్కడ ఇబ్బంది అవుతుందోనని క్షమించాలని కోరేందుకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దగ్గరకు పోతే తనపై కేసు పెట్టించారని హరీశ్‌రావు విమర్శించారు. రూ.15 వేల రైతుబంధు ఇస్తామని చెబితే ప్రజలు నమ్మి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. ఉన్న రూ.10 వేల రైతుబంధును కూడా బంద్ చేశారన్నారు. కాంగ్రెస్‌ను గట్టిగా ప్రశ్నించకపోతే యాసంగికి కూడా రైతుబంధును ఎగ్గొడతారన్నారు.ముందేమో ధాన్యానికి బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అంటోందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే బోనస్ అంటున్నారని, రైస్ మిల్లర్లు కల్లాల వద్దకు వచ్చి క్వింటాలు వడ్లు రూ.3 వేలకు కొంటున్నారన్నారు ప్రభుత్వమేమో బోనస్‌తో కలిపి రూ.2,800 మాత్రమే ఇస్తానంటోందన్నారు. రైతులు తమ పంటలను ఎక్కడ అమ్మినా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణకు అడ్డొస్తే బుల్డోజర్ కింద వేసి తొక్కేస్తానని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. చావడానికైనా సిద్ధమే కానీ తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. రాష్ట్రంలో పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలని, తేడా వస్తే రేవంత్ రెడ్డి పర్మినెంట్ కాదన్నారు. మూసీ నిర్వాసితులను ఆర్ అండ్ ఆర్ చట్టం పరిధిలోకి తీసుకురావాలని హరీశ్‌రావు డిమాండ్‌చేశారు. ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో కేసు వేసి గెలిచిన గచ్చిబౌలిలోని 500 ఎకరాల్లో నిర్వాసితులకు 250 గజాల చొప్పున ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

నేడు సుప్రీంలో 'గ్రూప్-1' కేసు విచారణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలని, జీవో -29 రద్దు చేయాలని కోరుతూ పోగుల రాంబాబు అనే అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టనుంది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో వల్ల తాము నష్టపోతున్నామని ఈ నెల 17న రాంబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ తరఫున న్యాయవాది మోహిత్ రావు ఈనెల 18న ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీనిపై తక్షణమే విచారించలేమని సోమవారం విచారణ చేపడతామని సీజేఐ స్పష్టం చేశారు. అయితే సోమవారమే తెలంగాణలో గ్రూప్-1 పరీక్ష ఉండడం గమనార్హం.

జీవో 29పై సీఎం రేవంత్‌ది మొండి వైఖరి

- గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదా వేయకపోతే రాష్ట్రాన్ని దిగ్బంధిస్తాం: మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల వాయిదా, జీవో-29పై సీఎం రేవంత్‌రెడ్డి మొండి వైఖరి అవలంబిస్తున్నారని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. జీవో-29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు జరిగే నష్టంపై బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదా వేయకపోతే రాష్ట్రాన్ని దిగ్బంధిస్తామని ఆయన హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థులు, యువజన సంఘాల సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఓపెన్ కాంపిటీషన్‌లో లాస్ట్ కటాఫ్ ముగిసిన తర్వాతనే రిజర్వేషన్ ఉద్యోగాలను లెక్కించాలని డిమాండ్ చేశారు. మెరిట్‌లో వచ్చిన అభ్యర్థులను రిజర్వేషన్ల కింద లెక్కించి అన్యాయం చేయవద్దన్నారు. జీవో-29పై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, జాతీయ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కృష్ణయ్య చెప్పారు. జీవో-55 రాజ్యాంగబద్ధమైనదని, దానిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, రాంకోటి ముదిరాజ్, సి.రాజేందర్, ఉదయ్‌నేత, రాందేవ్ మోదీ, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల డిజిటల్ సర్వేకు ఏఈవోలు ససేమిరా!

- ప్రైవేటు ఏజెన్సీలతో చేయించాలని డిమాండ్

హైదరాబాద్, శామీర్‌పేట అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవోలు) పంటల డిజిటల్ సర్వే విషయంలో సుమారు నెల రోజులుగా పట్టిన పట్టు విడవటంలేదు. 49 రకాల విధులు నిర్వర్తిస్తూ ఒత్తిడికి గురవుతున్నామని ఓవైపు ఆందోళన చెందుతుండగా.. మరోవైపు డిజిటల్ సర్వే చేయాలని, యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండటంపై విచారం వ్యక్తంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో చేయించినట్లుగా ప్రైవేటు ఏజెన్సీలతో సర్వే చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూముకుంటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో ఏఈవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమస్యల సాధనకై అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన రాజ్‌కుమార్ బాధావత్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో 15 వేల ఏఈవోలు చేయాల్సిన పనిని కేవలం 2,600 మందితో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టర్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరేగా ఉన్నాయన్నారు. ప్రతి గ్రామానికి ఒక వ్యవసాయ సహాయకుడిని నియమించాలని కోరారు. ఇంత తక్కువ సిబ్బందితో రాష్ట్రంలో సాగులో ఉన్న కోటి యాభై లక్షల ఎకరాల భూభాగాన్ని సర్వే చేయడం సాధ్యంకాదన్నారు. తాము డిజిటల్ సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకునేదిలేదని, సర్వే చేపట్టేదిలేదని స్పష్టంచేశారు. ఒక మండలంలో సర్వేకు 15-20 మంది వ్యక్తులు అవసరమవుతారని, 12 వేల మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించి మూడు నెలలు పనిచేయిస్తే సర్వే పూర్తవుతుందని, లేకపోతే కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా రాష్ట్రాల్లో లాగా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని ఏఈవోలు చెబుతున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాస్ పేరు ఉన్న వ్యక్తులు

'శ్రీనివాసుల' సమ్మేళనం

- ఒకే పేరున్న 200 మంది సమావేశం
- జగిత్యాల జిల్లాలో ఆసక్తికర సంఘటన

జగిత్యాల అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 200 మంది శ్రీనివాస్ పేరుతో గల వ్యక్తులు ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆసక్తికర సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. జిల్లాలోని గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన పిట్టల శ్రీనివాస్‌కు ఒక అరుదైన ఆలోచన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా తన పేరుతో ఉన్న వ్యక్తులకు సంబంధించి ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేయాలనుకున్నారు. 15 రోజుల క్రితం 'శ్రీనివాసుల సేవా సమితి' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. దీంతో జిల్లాలో ఆ పేరుతో ఉన్న 1,024 మంది అందులో చేరారు. తర్వాత గ్రూప్ సభ్యులంతా కలవాలన్న ఆలోచనతో శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనం తొలిసారి జగిత్యాల పట్టణంలోని మార్కెట్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ పిట్టల శ్రీనివాస్ మాట్లాడుతూ.. త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాస్ పేరు ఉన్న లక్షల మందితో సమావేశం నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పుతామన్నారు. గ్రూప్ ద్వారా పేదలకు, అనాథలకు, వృద్ధులకు సేవ చేస్తామని చెప్పారు. తలసేమియా బాధితులకు సహాయపడుతూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు.



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రాచకొండ వీరయ్య, లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు

ఆరు తరాలు ఒక్కచోటే..

- మట్టపల్లిలో కోలాహలంగా వంశ వృక్ష ఆత్మీయ సమేళ్ళనం
- ఆరు తరాలకు చెందిన 367మంది హాజరు

మఠంపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరు తరాల కుటుంబ సభ్యులు ఒకే వేదికపై ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం వేదికైంది. నేరేడుచర్లకు చెందిన రాచకొండ వీరయ్య, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరయ్య, లక్ష్మమ్మ దంపతులు కిరాణా దుకాణం నడుపుతూ పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశారు.కుమారులు-కోడళ్లు, కుమార్తెలు-అల్లుళ్లు మనుమలు, మునిమనుమలు, మనవరాళ్లు ఇలా మొత్తం ఈ కుటుంబంలో 411 మంది ఉన్నారు. వీరిలో చాలామంది వ్యాపారం చేస్తుండగా, యువతరంలోని పలువురు ఉద్యోగాల రీత్యా విదేశాల్లో స్థిరపడ్డారు. ఏడేళ్ల క్రితం రాచకొండ వీరయ్య, లక్ష్మమ్మ దంపతులు మృతిచెందగా, వారి జ్ఞాపకార్థం ఆదివారం వంశవృక్ష ఆత్మీయ వేడుక నిర్వహించారు. ఆ కుటుంబానికి చెందిన రాచకొండ శ్రీనివాసరావు మూడు నెలలుగా అందరికీ సమాచారం ఇస్తూ, అవసరమైన నగదును, ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి 367మంది హాజరయ్యారు.

జీవో 29పై వివాదం అందుకే!

గ్రూప్-1 మెయిన్స్‌కు మెరిట్‌ను గంపగుత్తగా అమలుపై అభ్యంతరం!

రిజర్వ్‌డ్ కేటగిరీల వారికి అన్యాయం జరుగుతుందంటున్న అభ్యర్థులు

హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాలను భర్తీ చేసే క్రమంలో ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో జారీ చేసిన జీవో 29 పెద్ద వివాదాన్నే రేపుతోంది. ఈ జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, దీనిని రద్దు చేయాలని అభ్యర్థులు చేస్తున్న ఆందోళన రాజకీయ రంగు పులుముకుంది. సోమవారం నుంచి నిర్వహించ తలపెట్టిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ను రద్దు చేసి.. మళ్లీ పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీవో 29లో ఏముంది? దీనిపై వివాదం ఎందుకు తలెత్తిందన్న అంశాలను పరిశీలిస్తే.. గ్రూప్-1 ఉద్యోగాలకు సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్‌లో మొత్తం 563 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇందులో 354 పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సహా ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు కేటాయించారు. ఇవి పోగా మిగిలిన 209 పోస్టులకుగాను 1:50 నిష్పత్తిలో ప్రిలిమినరీ పరీక్షలో టాప్ 10,450 ర్యాంకులు సాధించిన వారందరినీ మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. వీరిలో టాప్ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కూడా ఉంటారు. ఇక 354 పోస్టులకు 1:50 నిష్పత్తి చొప్పున 17,700 మంది రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ జీవో నెంబర్ 29 కింద మొత్తం 563 పోస్టులకూ రిజర్వేషన్ కేటగిరీతో నిమిత్తం లేకుండా 1:50 నిష్పత్తి ప్రకారం మొత్తం టాప్ 28,150 ర్యాంకులు సాధించిన వారందరినీ గుంపగుత్తగా మెయిన్స్‌కు ఎంపిక చేశారని అభ్యర్థులు చెబుతున్నారు. అయితే ఈ విధానంలో ఒకవేళ ఏదైనా రిజర్వ్‌డ్ కేటగిరీకి అభ్యర్థులు తక్కువ పడితే 28,150 తరువాతి వారిని తీసుకుంటున్నారని, ఓపెన్ కేటగిరీ కింద అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను రిజర్వేషన్ కేటగిరీలో కలుపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇది రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు పూర్తి విరుద్ధమని పేర్కొంటున్నారు. అందువల్ల జీవో 29ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జీవో 55కు అనుగుణంగా మొత్తం 563 పోస్టులకు ఎంపిక చేపడితే 28,150 మందికి మాత్రమే మెయిన్స్‌కు అవకాశం లభిస్తుందని చెబుతున్నారు. కానీ.. జీవో 29వల్ల అదనంగా మరో 3,233 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేశారని, దీంతో మొత్తం అభ్యర్థులు 31,383 మంది అయ్యారని వివరిస్తున్నారు. జీవో 55 ప్రకారమే మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలంటున్నారు.

జీవోలు ఏం చెబుతున్నాయి?

జీవో 29లో రిజర్వేషన్‌ల ప్రకారం కాకుండా.. నేరుగా మల్టీజోన్ పోస్టుల సంఖ్యకు 50 రెట్ల మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అప్పుడు రిజర్వుడు కేటగిరీల్లో అభ్యర్థుల సంఖ్య 1:50 నిష్పత్తి కంటే తక్కువగా ఉంటే, ఆ తరువాత మెరిట్ వారిని కూడా అదనంగా తీసుకుంటారు. తెలంగాణ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ నిబంధనల్లోని రూల్ 22, 22ఏ ఆధారంగా వీరిని ఎంపిక చేస్తారు. ఇందుకోసం జీవో 55లోని అంశం 'బి'లో మార్పులు చేసి జీవో 29ని ప్రభుత్వం జారీ చేసింది. జీవో 55 ప్రకారమైతే.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపికను మల్టీజోన్ వారీగా ఉన్న పోస్టులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరిస్తూ కమ్యూనిటీ, జెండర్, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, స్పోర్ట్స్ తదితర కేటగిరీల్లో 1:50 నిష్పత్తిలో గుర్తిస్తారు. దీని ప్రకారం గతంలో 503 పోస్టులకు 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండేది.

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలు (హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ జిల్లాలో 27) ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు నేరుగా పర్యవేక్షించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా హాలు, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రాల్లోకి మధ్యాహ్నం 12.30 నుంచి 1.30గంట వరకు అనుమతిస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చేవారిని అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా అనుమానాలు ఉంటే 040-23452185, 040-23452186, 040-23452187నంబర్లలో కానీ, ఈ-మెయిల్ ద్వారా కానీ సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. దివ్యాంగులకు గంట సమయం అదనంగా కేటాయిస్తున్నారు. సహాయకులసాయంతో పరీక్షలు రాసే వారికి ప్రత్యేకంగా 4కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, పరీక్షా హాళ్లలో గోడ గడియారాలు ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్స్‌లో అభ్యర్థులు అన్ని పరీక్షలూ రాయాల్సి ఉంటుంది. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థులు తమ హాల్ టికెట్, ప్రశ్నపత్రాలు భద్రపరచుకోవాల్సి ఉంటుంది. 563గ్రూపు-1 పోస్టులను భర్తీలో భాగంగా.. ఇప్పటికే ప్రిలిమనరీ పరీక్షలు పూర్తి చేసి, మెయిన్స్ కోసం అభ్యర్థులను ఎంపిక చేశారు. ఒక్కో పోస్టుకు 50మంది చొప్పున అభ్యర్థులు మెయిన్స్ రాయనున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అభ్యర్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గ్రూప్-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్

పరీక్ష పేరు	తేదీ
జనరల్ ఇంగ్లీషు (క్వాలిఫై టెస్ట్)	21-10-2024
పేపర్-1 జనరల్ ఎస్సే	22-10-2024
పేపర్-2 చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం	23-10-2024
పేపర్-3 భారతీయ సమాజం, రాజ్యాంగం, పాలన	24-10-2024
పేపర్-4 ఆర్థిక శాస్త్రం, అభివృద్ధి	25-10-2024
పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్	26-10-2024
పేపర్-6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం	27-10-2024

29 జీవోను రద్దు చేయాల్సిందే

- అశోక్‌నగర్‌లో గ్రూప్- 1 అభ్యర్థుల ప్రెస్‌మీట్
- అభ్యర్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిక్కడపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జీవో 29 వల్ల తమ జీవితాలు నాశనమవుతాయని, కాబట్టి ఆ జీవోను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎవరో చెప్పిన మాటలు విని తమ భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరారు. ఒక్కరోజు సమయం మాత్రమే ఉందని, తమతో ఒక్కసారి చర్చించి ఆ తర్వాతే సీఎం నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం అశోక్‌నగర్‌లో అభ్యర్థులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. జీవో 29పై కోర్టులో కేసు నడుస్తోందని, ఈ జీవో రద్దు అయితే ఇప్పుడు మెయిన్స్ పరీక్షలు నిర్వహించినా, మళ్లీ నిర్వహించాల్సి వస్తుందని అన్నారు. దానివల్ల ప్రతిభావంతులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని, అందుకే పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నామని తెలిపారు. ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న అభ్యర్థులను పోలీసులు అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రెస్‌మీట్ పెట్టిన తమను అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబు అని అభ్యర్థులు ప్రశ్నించారు.

జీవో 29ని రద్దు చేయండి

దాని వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర నష్టం

గ్రూప్-1 పరీక్షను రీ షెడ్యూల్ చేయాలి

సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన 29 జీవోను ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1 పరీక్షను వెంటనే రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కొనసాగింపుపైనా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. గ్రూప్-1 అభ్యర్థులు పడుతున్న తీవ్రమైన ఆందోళనకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంజయ్ ఆదివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లలో తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. దీని వల్ల 5,003 మంది రిజర్వ్‌డ్ క్యాటగిరీ అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు. ఇది రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. జీవో 29 వల్ల దాదాపు 30 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు మెయిన్స్ పరీక్షకు దూరమయ్యారని సంజయ్ వివరించారు. కాగా, తెలంగాణలో రిజర్వేషన్ల ఎత్తివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం తెచ్చిన జీవో 29 అందుకు సంకేతమని అన్నారు. ఓపెన్ క్యాటగిరీలో మెరిట్‌తో వచ్చే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యర్థులకు జీవో 29 వల్ల నష్టం జరుగుతుందని అన్నారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు అశోక్‌నగర్ వచ్చి అరచేతిలో వైకుంఠం చూపించిన రాహుల్ గాంధీ.. ఇప్పుడు నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులు, నిరుద్యోగులపై బీఆర్ఎస్ కపట ప్రేమ

- పదేళ్లలో వారిని తీవ్ర ఇబ్బందులు పెట్టారు
- రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు
- 10 నెలలు నిండని సర్కారుపై విమర్శలా: జూపల్లి



కామారెడ్డి టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల పాలనలో రైతులు, నిరుద్యోగులను తీవ్ర ఇబ్బందులు పెట్టిన బీఆర్ఎస్.. ఇప్పుడు వారిపై ప్రేమను ఒలకబోస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. తాము రైతులకు రుణమాఫీ చేశామని, మరో 4 లక్షల మందికి దీపావళి తర్వాత రుణమాఫీ చేస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తున్నామని చెప్పారు. సాగు చేయని భూములకు దాదాపు రూ.25 వేల కోట్ల వరకు బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు ఇచ్చారని విమర్శించారు. తాము దానిని ప్రక్షాళన చేస్తున్నామని, అందుకే రైతు భరోసా ఇచ్చేందుకు కొంత సమయం తీసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం కామారెడ్డిలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. నెలకు రూ.6 వేల కోట్లు వడ్డీలకే కట్టాల్సి వస్తోందని తెలిపారు. పదేళ్లలో ప్రజలపై మోయలేని భారం మోపిన బీఆర్ఎస్.. పట్టుమని పది నెలలు నిండని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. త్వరలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోతున్నాయని, గత ప్రభుత్వం చేసిన లూటీని పట్టభద్రులు గమనించి, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఎంపీ సురేష్‌షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 29తో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగదు

బీసీ బిడ్డగా నేను భరోసా ఇస్తున్నా.. గ్రూప్-1లో రిజర్వుడ్.. కేటగిరీకి నష్టమన్నది అపోహే

- అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయండి
- బీజేపీ, బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తున్నాయి
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి జీవో 29తో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్నది అపోహ మాత్రమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఒక బీసీ బిడ్డగా, కాంగ్రెస్ పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున తాను భరోసా ఇస్తున్నానని, రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు అన్యాయం జరగదని చెప్పారు. ఓపెన్ కేటగిరీలో ఎంపికైన బీసీ, ఎస్టీ, ఎస్టీ, మైనారిటీలు అదే కేటగిరీలో కొనసాగుతారని స్పష్టం చేశారు. ఓపెన్ కేటగిరీలో ఎంపికైన బీసీ, ఎస్సీ, ఎస్టీలను తీసుకెళ్లి రిజర్వుడు క్యాటగిరీ ఉద్యోగాల్లో పడేస్తారన్నది పచ్చి అబద్ధమన్నారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. గాంధీభవన్ సేకరించిన సమాచారం ప్రకారం 1:50 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల్లో 75 నుంచి 80 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందినవారే ఉన్నట్లు తేలిందన్నారు. దీనిని బట్టి గ్రూప్-1 పోస్టుల్లో 75 నుంచి 80 శాతం రిజర్వుడు కేటగిరీల వారే ఎంపిక కాబోతున్నారని తెలిపారు. పరీక్షలు వాయిదా పడితే మళ్లీ ఎప్పుడు జరుగుతాయో తెలియదని, అపోహలకు పోయి జీవితాలను పాడు చేసుకోవద్దని గ్రూప్-1 అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని సూచించారు.

అభ్యర్థులపై లాఠీచార్జి చేయొద్దు..


పోలీస్ శాఖ తొందరపడి గ్రూప్-1 అభ్యర్థులను ఇబ్బంది పెట్టవద్దని, లాఠీచార్జి వంటివి జరగకుండా చూడాలని మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై అభ్యర్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని, వారిలో లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. 2023 ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కాంగ్రెస్ పార్టీని నెత్తిన పెట్టుకుని ఓట్లేసినందునే తాము అధికారంలోకి వచ్చామని, వారిని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ జారవిడుచుకోబోమని అన్నారు. జీవో 29పై శనివారం తాను, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కలిసి అధికారులతో మూడున్నర గంటల పాటు సంప్రదింపులు జరిపామని, తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకున్నామని తెలిపారు. ఆ తర్వాతే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగబోదన్న నిర్ణయానికి వచ్చామన్నారు.

అభ్యర్థులను రెచ్చగొడుతున్న బీజేపీ, బీఆర్ఎస్..

ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఈ పదిన్నరేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో కేంద్ర మంత్రి బండి సంజయ్ లెక్కలు చెప్పాలన్నారు. ఎన్ని పీఎస్‌యూలను మూసేశారో, ఎన్ని ఉద్యోగాలను పీకేశారో తమ వద్ద లెక్క ఉందని చెప్పారు. అలాగే నియామకాలు అంశంగా పెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ.. ఈ పదేళ్లలో పట్టుమని 35 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 మాసాల్లోనే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. దీనిని బట్టి నిరుద్యోగుల పట్ల ఎవరికి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో గ్రూప్-1 పరీక్ష నిర్వహించని బీఆర్ఎస్.. నేడు అభ్యర్థులకు నష్టం చేయడానికి పూనుకుందని ఆరోపించారు. దీనిని అభ్యర్థులు అర్థం చేసుకోవాలన్నారు. లోపాయికారీ ఒప్పందంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విద్యార్థి లోకాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. ఢిల్లీ బీజేపీ కార్యాలయం నుంచి వస్తున్న స్క్రిప్టును రాష్ట్రంలో ఈ రెండు పార్టీలూ అమలు చేస్తున్నాయని అన్నారు. జీవో 29.. ఫిబ్రవరి 23న విడుదలైతే ప్రతిపక్షాలకు ఇప్పుడు ఎందుకు గుర్తుకు వచ్చిందని, ఇన్ని రోజులు ఎందుకు నోరు మూసుకున్నాయని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు

- బతుకమ్మ చీరలూ పంచలేని దుస్థితి..
- ఢిల్లీ పర్యటనలు తప్ప సీఎం చేసిందేమీ లేదు
- రేవంత్ బ్రదర్స్ దోచుకోవడానికే ఫోర్ సిటీస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఇబ్రహీంపట్నం/ఆదిబట్ల/హైదరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ కాంగ్రెస్ పాలనలో అధోగతి పాలవుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఢిల్లీ పర్యటనలు మినహా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా బొంగ్లూరులోని ప్రమిదా కన్వెన్షన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన దసరా సమ్మేళనంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'కాంగ్రెస్ పాలనలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు కూడా పంచలేని దుస్థితి.. ఏ వర్గం వారూ సంతోషంగా లేరు.. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. రిజర్వేషన్లు తొలగించే కుట్రలు చేస్తున్నారు. నిరుద్యోగులపై లాఠీలు ఝుళిపించే పోలీసులు జాగ్రత్తగా ఉండాలి. నేడు మీరు చావబాదే అభ్యర్థులే రేపు మీ బాస్‌లుగా రావచ్చనే విషయం మరిచిపోవద్దు' అని హెచ్చరించారు. అసలు ఫార్మాసిటీ ఉందా లేదా అనేది తేల్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ నలుగురు సోదరులు దోచుకోవడానికే ఫోర్ సిటీస్ అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి జలాలు మూసీలో కలిసేలా ప్రాజెక్టు తీసుకుంటే మూసీ శుద్ధి అయిపోతుందని.. ఈ ప్రాజెక్టుకు కేవలం 12 వేల కోట్లు సరిపోతాయన్నారు. తెలంగాణలో రైతు రుణమాఫీ 40 శాతం పూర్తి చేయకుండానే.. 40 లక్షల మందికి రుణమాఫీ చేసినట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎక్స్ ఖాతాలో పెట్టిన పోస్టుపై కేటీఆర్ ఓ ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పేర్కొన్న 40 లక్షల మంది రైతులు అనే సంఖ్య (అనుముల ఇంటెలిజెన్స్) అంటే రేవంత్ వాడిన అబద్ధాల (ఏఐ) టెక్నిక్‌తో రూపొందించిందేనని ఎద్దేవా చేశారు. కాగా, బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పిస్తున్న కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ జిల్లా కోసం ఏం చేశారో చెప్పాలని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. సాగర్ నీళ్లు నల్లగొండకు రావడం లేదు.. వాటిని ఖమ్మం తరలిస్తుంటే జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.